




www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

విజయవాడ సిటీ*

ANDHRAJYOTHI

సంపుటి (Volume) : 60
సంచిక (Issue) : 329

వెల (Price) : Rs. 6.50








శనివారం | 14-3-2020 | పేజీలు: 12 + 16

శ్రీవికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి తె. 4.26 తదుపరి సప్తమి; నక్షత్రం: విశాఖ మ. 12.21 తదుపరి అనూరాధ; వర్జ్యం: సా. 4.11-5.43; దుర్ముహూర్తం: ఉ. 6.28-8.03; అమృతఘడియలు: రా. 1.24-2.56; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.28; సూర్యాస్తమయం: 6.22

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore




### పత్రాలు లాక్కొని పరుగో పరుగు...

ఈ నల్లచొక్కా యువకుడు 'ఒక్క నిమిషం' లేటైతే పరీక్షకు అనుమతించరేమో అని పరిగెత్తుతున్న విద్యార్థి కాదండోయ్! ఇతను వైసీపీ కార్యకర్త. తిరుపతి కార్పొరేషన్ పదోవార్డు బీజేపీ అభ్యర్థి శరవణను తోసేసి, ఆయన నుంచి నామినేషన్ పత్రాలు తీసుకుని పరుగో పరుగు! దీంతో శరవణ పోటీ ఆశలు గల్లంతయ్యాయి.

# అదే అరాచకం

## మున్సిపోల్స్‌లోనూ ఏకగ్రీవాలే లక్ష్యంగా రెచ్చిపోయిన వైసీపీ

- నామినేషన్ల చించివేతలు.. యథేచ్ఛగా దాడులు, బెదిరింపులు
- తిరుపతి, పుంగనూరుల్లో టీడీపీ అభ్యర్థులపై దౌర్జన్యం
- ముస్లిం అభ్యర్థుల అడ్డగింత.. మహిళా అభ్యర్థి ఆత్మహత్యాయత్నం
- తాడిపత్రి మున్సిపల్ కార్యాలయంలో వైసీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తిష్ఠ

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో నామినేషన్ల దాఖలు సందర్భంగా వైసీపీ నేతలు, కార్యకర్తల దౌర్జన్యాలు, హింసాకాండ, వారికి పోలీసుల వత్తాసు.. ఇదే అరాచకం మున్సిపల్ ఎన్నికల్లోనూ పునరావృతమైంది. టీడీపీ, ఇతర విపక్షాల

మిగతా 11వ పేజీలో...

### అపహరించి... అల్లంత దూరానికి

ఈమె పేరు కడియాల భారతి. తిరుపతి 27వ వార్డుకు టీడీపీ తరఫున పోటీ పడుతున్నారు. అది కూడా... వైసీపీ మేయర్ అభ్యర్థిపైన! నామినేషన్ వేయడానికి వస్తున్న భారతిని 'కిడ్నాప్' చేశారు. వాహనంలోకి ఎక్కించి 30 కిలోమీటర్ల అవతల పూతలపట్టు వద్ద వదిలేశారు. ఆమె తిరిగి వచ్చేసరికి... సమయం ముగిసిపోయింది.





### ఆ 4 మున్సిపాలిటీల్లో ఎన్నికలు రద్దు చేయండి

- పులివెందుల, మాచర్ల, డోన్, జమ్మలమడుగుల్లో టీడీపీ అభ్యర్థులను అడ్డుకున్నారు
- వైసీపీకి అధికారుల అండ
- భారీ భద్రతతో మళ్లీ పెట్టండి
- కమిషనర్‌కు బాబు లేఖ
- కరోనా కన్నా జగనే డేంజర్!
- పోటీకి ఎవరికీ చాన్సివ్వని ఉన్మాదం: బాబు

10,12

## ఏమైంది

కమిషన్‌కు చీవాట్లు

# మీ అధికారం?

### కోడ్ ఉంటేనే వస్తుందన్నారుగా! మరి ఇప్పుడేం చేస్తున్నారు?

- ఉల్లంఘనలపై చర్యలేవీ?
- ఫిర్యాదులపై స్పందించకుంటే ఎలా?
- నివేదిక మెయిల్‌లో తెప్పించుకోలేరా?
- షెడ్యూలుపై చెప్పిందొకటి, చేసిందొకటి
- 40 రోజులు గడువు కావాలని చెప్పి ఇంత తక్కువ వ్యవధి ఇచ్చారే!
- ఎన్నికల కమిషన్‌పై హైకోర్టు ఆగ్రహం



అమరావతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషన్ పని తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికార పార్టీ నేతలపై వస్తున్న ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకోవడం లేదని, ఈసీ తీరు ఏమాత్రం సరి కాదని అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నప్పుడే తమకు అధికారాలుంటాయని... అప్పుడే తాము చర్యలు చేపట్టగలమని చెప్పిన రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్‌ఈసీ) కోడ్ వచ్చాక కూడా ఎందుకు సరిగ్గా స్పందించడం లేదని నిలదీసింది. ఎస్‌ఈసీ తీరుతోపాటు గతంలో తాము జారీ చేసిన ఉత్తర్వుల ప్రతిని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు పంపించాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. ఇటీవల ఓ పిటిషన్‌పై ఇచ్చిన తీర్పులో స్థానిక ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలంటూ జారీ చేసిన ఆదేశాలు, మార్గదర్శకాలను ఈ సందర్భంగా గుర్తు చేసింది. ఎన్నికల షెడ్యూల్

మిగతా 2వ పేజీలో...

### పంచాయతీల 'విభజన' నిలిపివేత!

- సోమవారందాకా స్టే విధించిన హైకోర్టు
- 120 గ్రామాల్లో వాయిదా!

12

### శాంతిభద్రతలపై నివేదిక ఇవ్వండి

గవర్నర్‌ను కోరిన కేంద్రం

రాష్ట్ర కమిషన్ తీరుపై ఈసీకి హైకోర్టు నుంచి సమాచారం



కడప కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న టీడీపీ నేతలు

# మీరే ఏలుకోండి!

### వైసీపీ అకృత్యాలకు నిరసనగా పలుచోట్ల పోటీకి టీడీపీ దూరం

- డోన్‌ను బుగ్గనకు దానం చేస్తున్నాం: కేఈ
- ఆర్థిక మంత్రి అరాచకాలపై ఆగ్రహం
- తంబళ్లపల్లె, శ్రీకాళహస్తి, పుంగనూరు నియోజకవర్గాల్లో ఎన్నికల బహిష్కరణ
- కమలాపురంలోనూ ఉపసంహరణ

11



కేఈ కృష్ణమూర్తి

# కరోనా కరాళ నృత్యం

## భారత్‌లో మరొకరు మృతి.. ఇటలీలో ఒక్కరోజే 250 మంది

- ఢిల్లీలో వృద్ధురాలి మరణం.. ఇటలీ, స్విట్జర్లాండ్ వెళ్లొచ్చిన ఆమె కొడుకు
- తల్లీ కొడుకులు ఇద్దరికీ పాజిటివ్.. ఇటలీలో 1266కు చేరిన మరణాలు
- 5000 దాటిన మృతుల సంఖ్య.. స్కూళ్లు, మాల్స్, హాల్స్.. సకలం బంద్
- భారత్‌లోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా.. భారత్‌లో 82కి చేరిన కేసులు
- 71 మంది పరిస్థితి నిలకడగానే.. ఐపీఎల్ ఏప్రిల్ 15 దాకా నిలిపివేత
- 7 దేశాలకు మన విమానాలు రద్దు.. వైరస్ కొత్త కేంద్ర స్థానంగా యూరప్
- రోమ్ అంతటా చర్చిల మూసివేత.. పశ్చిమాసియాలో పరిమిత ప్రార్థనలు

13

# రాష్ట్రమంతా కలకలం!

### విజయవాడ, పాలకొల్లులో 4 అనుమానిత కేసులు

మక్కా యాత్రకు వెళ్లొచ్చిన కడప మహిళకు జ్వరం, దగ్గు

13

### 'బేర్' లైన్స్!

**విమాన చార్జీలు నేల చూపులు**

- కరోనా దెబ్బకు ధరలు తగ్గిస్తున్న సంస్థలు
- విజయవాడ టు హైదరాబాద్ రూ.987









# చేయి దాటితే కేంద్రం చర్యలు!

## అమిత్ షా హామీ ఇచ్చారు.. ఎంపీలు జీవీఎల్, రమేశ్, టీజీ వెల్లడి

- పార్లమెంటు భవనంలో హోం మంత్రితో భేటీ.. వైసీపీ 'స్థానిక' అరాచకాలపై ఫిర్యాదు
- ఇప్పటికైనా జగన్ ప్రభుత్వం కళ్లు తెరవాలి.. లేదంటే తీవ్ర పరిణామాలు తప్పవు: బీజేపీ నేతలు

12








### పన్ను కడితే కేసుల నుంచి విముక్తి

- 'వివాద్‌సే విశ్వాస్'బిల్లుకు పార్లమెంటు ఆమోదం
- మోసగాళ్లకు వర్తించదు మంత్రి నిర్మల స్పష్టీకరణ
- రూ.5 కోట్ల లోపు వివాదాలకే అవకాశం

8

12

### కేంద్ర ఉద్యోగులకు డీఏ 4% పెంపు






పరంజ్యోతి

# ఈశ్వరానుగ్రహంతో అపమృత్యువు దూరం



పూర్వకాలంలో ఉజ్జయిని పట్టణంలో వేదప్రియుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడికి.. దేవప్రియుడు, ప్రియమేధుడు, సుకృతుడు, సువ్రతుడు అని నలుగురు కుమారులు. నలుగురూ సుగుణోపేతులే. తండ్రి ఎంత ధర్మానుష్ఠానపరుడో కొడుకులు కూడా అంతటి ధర్మానుష్ఠానపరులు. ఆ ఊరి పక్కనే ఉన్న పర్వత శిఖరాల్లో ఒక రాక్షసుడున్నాడు. అతడి పేరు దూషణుడు. లోకంలో అందరినీ బాధపెడుతూ ఎక్కడా ఎవ్వరూ ఈశ్వరార్చన చేయలేని స్థితిని కల్పించాడు. ఉజ్జయినిలో ఈ నలుగురూ శివార్చన చేస్తున్న విషయం తెలుసుకున్న దూషణుడు వారి వద్దకు వచ్చి.. 'మీరు పార్థివ లింగానికి అర్చన చేయడానికి వీలు లేదు. మీరు నన్ను మాత్రమే అర్చించాలి. నాకు మాత్రమే పూజలు చేయాలి. పశుపతి ఎంతటివాడు? అటువంటివాళ్లను నేను ఎందరినో గెలిచాను. మీరు శివపూజను విడిచిపెడతారా లేక లింగమును ధ్వంసం చెయ్యనా?' అని అడిగాడు. దూషణుడి మాటలకు వాళ్లు కొంచెం కూడా బెదరలేదు. 'తుచ్ఛుడు.. వీడి ప్రలాపాలు వింటూ కూర్చుంటే సమయం వృథా అయిపోతుంది. హాయిగా మనం శంకరుడిని నమ్ముకుని ఉందాము. శంకరుని రక్షణయందు ఉండగా మనకు భయం ఏమిటి!' అని శివపూజపై మనసు లగ్నం చేశారు. దూషణుడు ఆ నలుగురి మీదకు కత్తి ఎత్తాడు. అయినా వాళ్లు కదల్లేదు. కనీసం కత్తికి బెదిరి చెయ్యి కూడా అడ్డుపెట్టకుండా.. 'హర ఓం హర హర' అంటూ అలాగే కూర్చున్నారు. ఏ రూపంలో వస్తున్న మృత్యువునయినా ఈశ్వరుడు తప్పించగలడు. ఈశ్వరానుగ్రహం ఉన్నవాడు తప్పనిసరిగా రక్షింపబడతాడు. ఆ నలుగురు బ్రాహ్మణకుమారులూ దీన్నే నమ్మి మట్టితో చేసిన చిన్న పార్థివ లింగానికి ఆరాధన చేస్తున్నారు. దూషణుడు వారిపైకి కత్తి ఎత్తగానే.. ఆ పార్థివలింగం నుంచి పరమేశ్వరుడు మహాకాళ స్వరూపంతో బయటకు వచ్చి కోపంతో ఒక్కసారి హుంకరించాడు. ఆ హుంకారానికి దూషణుడు, అతని సైనికులు బూడిదరాశులై పడిపోయారు. కానీ.. ఆ వేడి అక్కడే కూర్చున్న నలుగురు బ్రాహ్మణ కుమారులను మాత్రం ఏమీ చేయలేదు. వేడి ధర్మం కాల్చడమే. అగ్నిహోత్రం ఒకరిని కాల్చి వేరొకరిని వదలదు. కానీ, ఆ వచ్చిన వేడి పరమాత్మ స్వరూపం. అందుకే దూషణుని, అతని సైన్యాన్ని మాత్రమే కాల్చి స్వామి భక్తులైన ఆ నలుగురిని మాత్రం కాపాడింది. అప్పుడు బ్రాహ్మణ కుమారులు ఆ స్వామిని.. చనిపోయేవారిని చంపకుండా మిగిల్చిన రూపంగా భావించి స్తోత్రం చేశారు. అంతమందిని చంపి.. అక్కడే ఉన్న తన భక్తులైన నలుగురిని వదిలిన రూపం. కాబట్టి అది మహాకాళ స్వరూపం. ఆ రూపాన్ని చూసి దేవతలు పొంగిపోయి స్వామిని స్తోత్రం చేశారు. 'ఈశ్వరా మీరు ఇక్కడ లింగరూపంలో ఉద్భవించండి. ఇటువంటి సజ్జనులు, మీమీద పూనిక ఉన్నవాళ్లు, మీరు ఉన్నారని నమ్మినవాళ్లు ఎవరు ఇక్కడికి వస్తారో వారు అకాలంగా పడిపోకుండా అనుగ్రహించడానికి స్వయంభూలింగంగా ఉండాలి' అని అడిగారు. వారి కోరిక మేరకు అక్కడ మహాకాళ లింగంగా ఆవిర్భవించాడు. మనకు భయం వేసినప్పుడు 'హరహర మహాదేవ శంభోశంకర' అని పరమేశ్వరుని ధ్యానిస్తే తక్షణం మన భయం తొలగిపోతుంది. ఈశ్వరుడు అంతటా ఎప్పుడూ మనతోనే ఉంటాడు. వాయులింగమై వాయురూపంలో.. ఆకాశరూపంలో ఆకాశ లింగమై ఆ స్వామి ఎప్పుడూ మనతోనే ఉంటాడు. ఈశ్వరానుగ్రహం ఉన్నవారికి అపమృత్యువు లేదు.

- చాగంటి కోటేశ్వరరావు శర్మ

# రాజధానిని రాష్ట్రం మార్చలేదు

- పునర్విభజన చట్టంలోని 5, 6 క్లాజుల్లో స్పష్టత
- మూడు రాజధానుల నిర్ణయాన్ని కేంద్రం అడ్డుకోవాలి
- రాజ్యసభ జీరో అవర్‌లో కనకమేడల ప్రస్తావన



న్యూఢిల్లీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని 5, 6 క్లాజుల ప్రకారం ఒకసారి రాజధాని నిర్ణయం జరిగాక, కొత్తగా అధికారం చేపట్టిన ప్రభుత్వానికి రాజధాని ఏర్పాటుపై పునర్నిర్ణయాధికారం లేదని తెలుగుదేశం పార్టీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం రాజ్యసభ జీరో అవర్‌లో ఆయన ఏపీ రాజధాని మార్పు కోసం ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయాన్ని ప్రత్యేక అంశంగా ప్రస్తావించారు. విభజన చట్టానికి లోబడి ఏపీకి కొత్త రాజధానిపై ఐదున్నరేళ్ల క్రితమే నిర్ణయం జరిగిందన్నారు. సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోదీయే అమరావతి రాజధాని నిర్మాణానికి శంకుస్థాపన చేశారని, కేంద్ర ప్రభుత్వం రూ.1500 కోట్లు ఇచ్చిందని గుర్తు చేశారు. అక్కడ సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు భవనాలను గత ప్రభుత్వమే నిర్మించిందని తెలిపారు. అవి కాకుండా అనేక భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయని, వేల కోట్లు వ్యయం చేశారని వివరించారు. ఈ పరిస్థితుల్లో కొత్తగా వచ్చిన ప్రభుత్వం పరిపాలనా వికేంద్రీకరణ పేరుతో అమరావతి రాజధానిని మార్పుచేయాలని నిర్ణయించడం దురదృష్టకరమని కనకమేడల అన్నారు. మూడు పరిపాలనా రాజధానులు ఏర్పాటు చేయాలని ఏకపక్షంగా ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారని గుర్తు చేశారు. ఒక రాష్ట్రానికి ఒకే రాజధాని ఉండాలని డిమాండ్ చేశారు. మూడు రాజధానుల అంశాన్ని కొత్త ప్రభుత్వం తెరపైకి తెచ్చి ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతోందని విమర్శించారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా రాజధానులు మారవన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి అమరావతి రాజధాని మార్పును నిరోధించాలని కనకమేడల కోరారు.

## సీఎంగా బిజీ.. కోర్టుకు రాలేను!

- సీబీఐ కోర్టులో జగన్ పిటిషన్
- అక్రమాస్తుల కేసు 20కి వాయిదా

హైదరాబాద్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ అక్రమాస్తుల కేసు విచారణను సీబీఐ ప్రత్యేక కోర్టు ఈ నెల 20కి వాయిదా వేసింది. ఏపీ ముఖ్యమంత్రిగా అధికారిక విధుల్లో బిజీగా ఉన్నందున వ్యక్తిగతంగా హాజరు కాలేకపోతున్నారని, మినహాయింపు ఇవ్వాలని జగన్ తరఫు న్యాయవాది సీబీఐ ప్రత్యేక కోర్టుకు నివేదించారు. ఈ మేరకు దాఖలు చేసిన పిటిషన్‌ను అనుమతించిన న్యాయమూర్తి.. తదుపరి విచారణను ఈ నెల 20కి వాయిదా వేశారు. ఇదిలావుంటే, ప్రైవేటు వ్యక్తుల పెట్టుబడులకు సంబంధించి సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్(9/2012) నుంచి తన పేరును తొలగించాలని కోరుతూ జగన్ దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ మధుసూదన్‌రావు విచారించారు. జగన్ తరఫున న్యాయవాది ఎస్.ని రంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. రాజకీయ కక్షతోనే జగన్‌పై ఈ కేసు నమోదైందని, కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు రావడంతో ఆ పార్టీ నేతలు, టీడీపీ నేతలు జగన్‌పై హైకోర్టులో పిల్ దాఖలు చేసి సీబీఐ దర్యాప్తు కోరారని తెలిపారు. ఈ నేపథ్యంలో చార్జిషీట్ నుంచి జగన్ పేరును తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

## అమరావతిపై 'కాగ్' నివేదిక కోరండి

- హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు

అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిపై గత, ప్రస్తుత పాలకులు వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో నిజానిజాలు తేల్చేందుకు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) నివేదిక రూపొందించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. రాజధాని కోసం రూ.9 వేల కోట్లకు పైగా నిధులను వ్యయం చేశారని, 34 వేల ఎకరాల భూమిని సేకరించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు విజయవాడకు చెందిన చార్టెడ్ అకౌంటెంట్ ఎం.నారాయణా చార్యులు దాఖలు చేసిన పిల్‌పై శుక్రవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్యలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వినయ్‌వనరే వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. కేంద్ర కేబినెట్, ఆర్థిక, హోంశాఖల కార్యదర్శులు, కాగ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 1కి వాయిదా వేసింది.

## డ్రోన్ కేసులో ఏడుగురికి బెయిల్

తుళ్లూరు, మార్చి 13 : మందడంలో పోలీసులు డ్రోన్‌తో చిత్రీకరిస్తున్న పోలీసులను అడ్డుకొని కానిస్టేబుల్‌ని కొట్టారని, డ్రోన్‌ని ధ్వంసం చేశారనే ఆరోపణలపై అరెస్టయిన రాజధాని అమరావతి రైతులకు శుక్రవారం బెయిల్ మంజూరైంది. ఈ కేసులో 41 మందిపై పోలీసులు వివిధ సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేశారు. రిమాండులో ఉన్న ఏడుగురికి, అజ్ఞాతంలో ఉన్న వారికి మిగిలిన వారికి జిల్లా కోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసినట్టు రైతు జేఏసీ తెలిపింది.


APPOINTMENTS

WANTED LECTURERS

Faculty required to teach B.Sc., B.Com., BBA, BCA, MCA & MBA classes in the following subjects in our Degree Colleges at North Andhra and Godavari Districts.

- MATHS
- COMPUTERS
- MICROBIOLOGY
- FORENSIC SCIENCE
- HINDI
- TELUGU
- ENGLISH
- PHYSICS
- STATISTICS
- BIOCHEMISTRY
- COMMERCE
- CHEMISTRY
- ELECTRONICS
- BIOTECHNOLOGY
- MANAGEMENT
- VFX
- GAMING
- COMPOSITING

ARITHMETIC • REASONING • SOFT SKILLS

PLACEMENT OFFICERS: Candidates having experience as Placement officer/Asst. Placement Officer

LIBRARIANS: Candidates having experience as Librarian/ Asst. Librarian in Degree Colleges / Engineering Colleges.

Eligibility : MLISc (Preference for Sciecne Graduates)

ATTRACTIVE SALARY FOR DESERVING CANDIDATES

Apply with CV and Photo immediately by post /email

ADITYA DEGREE COLLEGE

H.O: Laxminarayananagar, KAKINADA-533003.

Ph : 0884 - 2376665,2385359,9704376667

http://aditya.ac.in/degree | email : career@aditya.ac.in






తుళ్లూరులో వివాహ వేడుకల్లో జై అమరావతి నినాదాలు చేస్తున్న నూతన దంపతులు, బంధువులు; చిల్లుల బొచ్చెలతో నిరసన తెలియజేస్తున్న మహిళలు

ఒప్పందాలు

# అమలు చేయండి!

- కొత్తగా ఏమీ అడగడం లేదు
- న్యాయస్థానాలే దిక్కు
- న్యాయమూర్తులే దేవుళ్లు
- 'మూడు' మార్చుకునే వరకు పోరు
- పోటీ నిరసనలతో మామధ్య చిచ్చుపెడతారా?
- అధికార పార్టీ నేతలకు అమరావతి రైతుల ప్రశ్న
- 87వ రోజూ కొనసాగిన రాజధాని నిరసనలు

గుంటూరు,తుళ్లూరు,మంగళగిరి,తాడికొండ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): "కొత్తగా ఏమీ అడగడం లేదు. ప్రభుత్వం ఆనాడు మాతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయమని కోరుతున్నాం" అని రాజధాని రైతులు నినదించారు. రాజధాని ప్రాంతంలో పోటీ నిరసనలు, ధర్నాలు నిర్వహిస్తూ ప్రశాంతతకు నిలయమైన తమ గ్రామాల్లో చిచ్చు పెట్టాలని చూస్తున్నారంటూ అధికార పార్టీ నేతలపై నిప్పులు చెరిగారు. రాజధానిగా అమరావతినే కొనసాగించాలంటూ రైతులు, మహిళలు చేపట్టిన ఆందోళనలు 87వ రోజు శుక్రవారం కూడా కొనసాగాయి. రైతులు, రైతు కూలీలు, మహిళలు వివిధ రూపాల్లో తమ నిరసన తెలిపారు. మూడు నెలలు తాము ఆందోళన చేస్తున్నా ఎవరూ పట్టించుకోలేదని ఆక్రోశం వ్యక్తం చేశారు. "ఇక ఎవరినీ నమ్మలేం. న్యాయస్థానాలే మాకు దిక్కు. న్యాయమూర్తులే దేవుళ్లు" అని నినదించారు. మూడు రాజధానుల నిర్ణయం ప్రభుత్వం మార్చుకునే వరకు ప్రాణాలు అర్పించి అయినా పోరు సాగిస్తాం తప్ప వెనకడుగు వేసేది లేదని ప్రతిజ్ఞ చేశారు. తుళ్లూరు, మందడం, వెలగపూడి, రాయపూడి, కృష్ణాయపాలెం, ఎర్రబాలెం, తదితర ప్రాంతాల్లో రిలే దీక్షలు, ఆందోళనలు కొనసాగించారు.



గోరింటాకుతో జైఅమరావతి నినాదాలు

### మోకాళ్లపై నిలబడి

అమరావతిని ఏపీకి ఏకైక రాజధానిగా ప్రకటించాలనే డిమాండ్‌తో పెదపరిమికి చెందిన మహిళలు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. అమరావతితోనే మా భవిత, రాష్ట్ర భవిష్యత్తు అని చేతులపై గోరింటాకు పెట్టుకుని రాయపూడి మైనారిటీ మహిళలు, రైతు కూలీలు నినాదాలు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన పదినెలల్లో కొత్తగా ఒరిగింది ఏమీలేదని.. జగన్ పాలనలో అతుకుల బతుకుగా మారిందంటూ చిల్లుల గిన్నెలు ముఖానికి అడ్డుపెట్టుకొని తుళ్లూరు మహిళలు నిరసన వ్యక్తం చేశారు.

### బిర్యానీ ఉద్యమాలు ఆపాలి

రాజధాని అమరావతిపై సీఎం జగన్ మొండివైఖరి మార్చుకోవాలని ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పేరుపోగు వేంకటేశ్వరరావు మాదిగ కోరారు. ఉద్దండ్రాయునిపాలెంలో ఏప్రిల్ 8న దళిత, బహుజన ధర్మ పోరాట దీక్ష చేపడతామని చెప్పారు. రైతుల న్యాయ పోరాటాన్ని అణచివేయాలనే దురుద్దేశంతో ప్రభుత్వమే పోటీగా బిర్యానీ ఉద్యమాలను ప్రోత్సహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో నేత రఫీ మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేని విధంగా న్యాయస్థానాలు జగన్ ప్రభుత్వ నిర్ణయాలను తప్పుపడుతున్నా ఆయనలో మార్పు రావడం లేదని విమర్శించారు. ఎంపీ నందిగం సురేశ్ అమరావతికి ద్రోహం చేస్తున్నారని గుంటూరు బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కంతేటి బ్రహ్మయ్య మండిపడ్డారు. రోజుకు మహిళలకు రూ.500, పురుషులకు రూ.700, మద్యం ఇస్తూ బయట ప్రాంతాల నుంచి మనుషులను ఇక్కడి తరలించి అలజడులు సృష్టించాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ, కోడి, చేప, రొయ్య కూరలతో ఎక్కువ రోజులు ఆందోళన చేయలేరని ఎద్దేవా చేశారు.

### అమరావతితోనే మా భవిత

తుళ్లూరులో శుక్రవారం వివాహం చేసుకున్న మోహనకృష్ణ, లక్ష్మీమేఘన దంపతులను ఆశీర్వదించేందుకు గ్రామ ప్రజలు అమరావతి ప్లకార్డులు పట్టుకొని హాజరయ్యారు. ఉద్యమ పాటలు పాడారు. మూడు రాజధానులకు వ్యతిరేకంగా తాడికొండ అడ్డరోడ్డులో చేస్తున్న నిరసన దీక్షలు శుక్రవారానికి 70 రోజులకు చేరుకున్నాయి. స్థానిక ఎన్నికల్లో వైసీపీని ఓడించాలని ఈ సందర్భంగా మహిళలు పిలుపునిచ్చారు.

# ఏమైంది మీ అధికారం?

(మొదటి పేజీ తరువాయి)

పైనా హైకోర్టు ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికార పార్టీ నేతల కోడ్ ఉల్లంఘనలపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా ఎస్ఈసీ స్పందించడంలేదని, వారిపై తగిన చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థిస్తూ టీడీపీ నేత కోవెలమూడి రవీంద్ర హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్యలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పి.వీరారెడ్డి వాదనలు వినిపిస్తూ.. "అనంతపురం జిల్లా తాడిపత్రి వైసీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి 'మన ఇల్లు - మన చెట్టు - మన తాడిపత్రి' పేరుతో కార్యక్రమం నిర్వహించి ఓటర్లకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా కడపలో గ్రామ వలంటీర్లు, వార్డు వలంటీర్లతో సమావేశం నిర్వహించి వైసీపీకి మద్దతుగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ఆళ్లగడ్డలో వైసీపీ నేతలు ఇళ్ల స్థలాల పంపిణీ కోసం కొలతలు వేస్తుండగా సాక్ష్యాధారాలతో సహా ఈసీకి ఫిర్యాదు చేశాం. ఎన్నికలు ముగిశాక ఇళ్ల స్థలాలు ఇస్తామని ఆశ చూపుతున్నారు. ఇదీ కోడ్ ఉల్లంఘనే. వైసీపీకి ఓటు వెయ్యకపోతే పించన్లు ఇవ్వం, ఇళ్ల స్థలాలు ఇవ్వం అంటూ వలంటీర్లు, వైసీపీ నేతలు బెదిరింపులకు దిగుతున్నారు. వీటన్నింటిపైనా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాం. అయినా చర్యలు తీసుకోలేదు. కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయండి" అని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ తరఫు న్యాయవాది ప్రభాకరరావు వాదనలు వినిపిస్తూ.. ఆ ఫిర్యాదులపై నిజానిజాలు తెలుసుకుని నివేదిక పంపించాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించామన్నారు. 10వ తేదీన అనంతపురం జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశామని, నివేదిక కోసం ఎదురు చూస్తున్నామని వివరించారు. దీనిపట్ల ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. "కలెక్టర్ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి కాదు. ఎన్నికల కోడ్ వచ్చాక ఆయన మీ నియంత్రణలో ఉంటారు. ఇప్పటి వరకూ వారి నుంచి ఎందుకు నివేదిక తెప్పించుకోలేదు? ఈ-మెయిల్ ద్వా రా అయినా తెప్పించుకోవచ్చు కదా? నివేదికలు రాలేదంటూ కాలం వెళ్లబుచ్చితే ఎలా?" అని నిలదీసింది.

### అంత తక్కువ సమయమా?

ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తున్నారని ధర్మాసనం ప్రశ్నించగా... ఎస్ఈసీ తరఫు న్యాయవాది ఎన్నికల షెడ్యూలు వివరించారు. తక్కువ సమయంలో షెడ్యూలు ఉండడం పట్ల ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది పి.వీరారెడ్డి స్పందిస్తూ.. "ఎన్నికల నిర్వహణ సమయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తగ్గించింది. నామినేషన్ల దాఖలుకు ఐదు రోజులు సమయం ఉండాలి. దీనిని మూడు రోజులకు కుదిరించారు" అని తెలిపారు. దీంతో ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. "ఎన్నికల నిర్వహణ కాలాన్ని ఎందుకు తగ్గించాల్సి వచ్చింది? ఎన్నికల నిర్వహణకు 40 రోజుల వ్యవధి కావాలని మా ముందు చెప్పి, ఇప్పుడెందుకింత హడావుడిగా ఎన్నికలు జరుపుతున్నారు? ఈ నోటిఫికేషన్ ఎవరు ఇచ్చారు? ఎవరికి అధికారం వుంది? ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడే చర్యలు తీసుకోగలమని గతంలో చెప్పారు కదా? ఇప్పుడు కోడ్ అమలులోకి వచ్చినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? కోడ్ ఉన్నందున ఎన్నికల కాలం తగ్గింపుపై ప్రభుత్వాన్ని అడగలేరా?" అని ప్రశ్నల వర్షం కురిపించింది. ఇందుకు ఈసీ తరఫు న్యాయవాది బదులిస్తూ.. ఎన్నికల నిర్వహణ కాలం కుదింపు తమ పరిధిలోది కాదని, పంచాయతీరాజ్ చట్టానికి సవరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసిందని పేర్కొన్నారు. దీంతో ఆ ఆర్డినెన్స్ ప్రతిని తమ ముందుంచాలని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

### వారిచ్చే వివరాలను విశ్వసిస్తారా?

పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం రాష్ట్ర ఎన్నికల కమిషన్ తరఫు న్యాయవాదిని కొన్ని ఆసక్తికర ప్రశ్నలు అడిగింది. "జిల్లా కలెక్టర్ సరైన నివేదిక ఇవ్వకుంటే ఏం చేస్తారు? ప్రభుత్వ నియంత్రణలో ఉన్నవారు ఇచ్చే వివరాలను ఈసీ విశ్వసిస్తుందా? మీరు కలెక్టర్‌ను నివేదిక కోరారా? లేక జిల్లా ఎన్నికల అధికారినా? ఇంతకీ కలెక్టర్‌ను జిల్లా ఎన్నికల అధికారిగా నోటిఫై చేశారా?" అని ప్రశ్నించింది. ఇందుకు ఈసీ తరఫు న్యాయవాది బదులిస్తూ.. తప్పుడు నివేదికలు ఇచ్చే అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కారు డ్రైవర్ సజీవ దహనం

- రెండు వాహనాలు ఢీ.. 8 మందికి గాయాలు

సిద్దవటం, మార్చి 13 : లారీ, స్కార్పియో కారు ఢీకొన్న ఘటనలో కారు డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. కడప జిల్లా సిద్దవటం మండలం ఉప్పరపల్లె సమీపంలో కడప-చెన్నై హైవే రోడ్డుపై శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో ఈ దారుణం చోటుచేసుకోంది. తిరుపతి నుంచి కడపకు వెళుతున్న లారీ.. కర్నూలు జిల్లా నంద్యాల సమీపంలోని బాలాపురం నుంచి తిరుమలకు వెళ్తున్న స్కార్పియో ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. స్కార్పియో నడుపుతున్న కర్నూలు జిల్లా పాణ్యం మండలం భూపనపాడుకు చెందిన డ్రైవర్ బండి ఆది సజీవదహనమయ్యాడు. అదే వాహనంలో ఉన్న ఓ బాలికతో పాటు 8 మందికి గాయాలయ్యాయి. పెట్రోలింగ్ సిబ్బంది సకాలంలో స్పందించి క్షతగాత్రులను కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు ఒంటిమిట్ట సీఐ హనుమంతునాయక్, సిద్దవటం ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.



## లోకం తీరు




### ఎండాకాలం

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| కడప | 39.0 | 22.0 |
| హైదరాబాద్ | 35.9 | 21.7 |
| విశాఖపట్నం | 35.8 | 24.0 |
| విజయవాడ | 35.6 | 23.8 |
| ఒంగోలు | 35.5 | 25.0 |
| గుంటూరు | 35.1 | 24.2 |

## అనంతపురంలో 39.4 డిగ్రీలు

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ఎండ తీవ్రత పెరిగింది. ఆకాశం నిర్మలంగా వుండడం, పొడిగాలులు కొనసాగడంతో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఒకటి, రెండు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. శుక్రవారం దేశంలోనే అత్యధికంగా అనంతపురంలో 39.4 డిగ్రీలు నమోదైంది. వరుసగా రెండో రోజు దేశంలో అత్యధిక ఉష్ణోగ్రతలు రాయలసీమలో నమోదయ్యాయి. నైరుతి దిశ నుంచి గాలులు వీయడంతో కోస్తాలో కూడా ఎండ తీవ్రంగా ఉంది. కోస్తా, రాయలసీమ పరిసరాల్లో ద్రోణులు, ఆవర్తనాలు లేకపోవడంతో పొడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న రెండు రోజుల్లో ఇదే మాదిరి వాతావరణం కొనసాగుతుందని పేర్కొంది.



## శాంతిని పెంపొందించడంలో ఫరూక్ సహకరిస్తారని ఆశిస్తున్నా

జమ్మూకశ్మీర్‌లో శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని పెంచడంలో ఫరూక్ అబ్దుల్లా తన వంతు సహకారం అందిస్తారని ఆశిస్తున్నా. ఆయన సిట్టింగ్ ఎంపీ. గతంలో సీఎంగా పనిచేశారు. కేంద్ర మంత్రిగా కూడా ఉన్నారు. పౌరుల్లో జాతీయతను పెంపొందించడంలో ఆయనకు రాజ్యాంగపరమైన బాధ్యత ఉంది.

-రవీందర్ రైనా, జమ్మూకశ్మీర్ బీజేపీ చీఫ్



## వేర్పాటువాదులతో పోరాడితే దేశద్రోహులన్న ముద్ర వేశారు

జమ్మూకశ్మీర్‌లో ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులను కొన్ని నెలలుగా నిర్బంధంలో పెట్టారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని నమ్మి వేర్పాటువాదులతో పోరాడిన వారిని దేశద్రోహులుగా ముద్ర వేశారు. ఇలాంటి చర్యలు దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తాయా.. లేక దేశ వ్యతిరేకులకు మరింత శక్తినిస్తాయా.. ఈ అంశంపై నిర్ణయాన్ని దేశ ప్రజలకే వదిలేస్తున్నా.

- రణ్‌దీప్ సూర్జేవాలా, కాంగ్రెస్ అధికార ప్రతినిధి

## ఎఫ్‌బీ వాడకం తగ్గిస్తే.. జీవితం ఆరోగ్యప్రదం

బెర్లిన్, మార్చి 13 : 'నెటిజన్లూ.. మీ జీవితం ఆరోగ్యప్రదం కావాలంటే ఫేస్‌బుక్ వాడకం తగ్గించాల్సిందే' అని జర్మనీలోని రుర్ వర్సిటీ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఫేస్‌బుక్ వాడకంతో 286 మంది నెటిజన్ల జీవనశైలిపై పడుతున్న ప్రభావాలపై అధ్యయనం అనంతరం ఈవిషయాన్ని వెల్లడించారు. వీరిలో 146 మందికి స్వేచ్ఛగా ఫేస్‌బుక్‌ను వినియోగించే వీలు కల్పించగా.. మిగతా 140 మంది రోజూ 20 నిమిషాలకు మించి ఎఫ్‌బీ చూడకుండా పర్యవేక్షించారు. అధ్యయనం అనంతరం వారందరి ఆరోగ్యాలు, జీవనశైలిలో వచ్చిన మార్పులను విశ్లేషించారు. ఎఫ్‌బీకి సమయం తగ్గించిన వారు ఆత్మన్యూనతా భావపు అవరోధం నుంచి బయటపడటంతో పాటు శారీరక శ్రమను పెంచినట్లు వెల్లడైంది. ఫేస్‌బుక్‌కు సమయం తగ్గించిన ధూమపానప్రియులు రోజూ తాగే సిగరెట్ల సంఖ్యను తగ్గించినట్లు నిర్ధారణ అయింది.

## కృత్రిమ మేధతో నిద్ర సమస్యలకు చికిత్స

వాషింగ్టన్, మార్చి 13 : నిద్ర సమస్యలను కృత్రిమ మేధా(ఏఐ) పద్ధతిని వినియోగించి అత్యంత కచ్చితత్వంతో విశ్లేషించవచ్చని శాస్త్రవేత్తలు అంటున్నారు. స్లీపింగ్ లేబొరేటరీల్లో రోగులకు జరిపే పాలీసోమ్నోగ్రఫీ పరీక్షల్లో సేకరించే ఎలక్ట్రో ఫిజియోలాజికల్ సమాచారాన్ని ఏఐ-మెషీన్ లెర్నింగ్ సాఫ్ట్‌వేర్‌తో విశ్లేషించవచ్చని వెల్లడించారు. ఇందులో వచ్చే ఫలితాలు, నిద్రాభంగంతో రోగిలో తలెత్తుతున్న ఆరోగ్య సమస్యల వివరాల ఆధారంగా ఔషధాలు, ప్రభావవంతమైన చికిత్సలు అందించే వీలు ఉంటుందని తెలిపారు. ఫలితంగా ఓ అంచనాతో చికిత్స అందించే ఊహాజనిత వైద్యానికి తెరపడుతుందన్నారు.

# ఫరూఖ్ విడుదల

సుమారు ఏడు నెలల నిర్బంధం తరువాత ఫరూఖ్ అబ్దుల్లా ఈ శుక్రవారం నాడు విడుదలయ్యారు. జమ్మూకశ్మీర్‌కు మూడు పర్యాయాలు ముఖ్యమంత్రిగా, ఒక సారి కేంద్రమంత్రిగా పని చేసిన ప్రస్తుత పార్లమెంటు సభ్యుడు ఫరూఖ్ అబ్దుల్లా ప్రజాభద్రతా చట్టం కింద ఇంతకాలంగా నిర్బంధంలో ఉన్నారు. 2019 ఆగస్టు 5వ తేదీన కేంద్రప్రభుత్వం జమ్మూకశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని తొలగిస్తూ, రాజ్యాంగంలోని 370 అధికరణంలో మార్పులు చేయడంతో పాటు, పెద్ద ఎత్తున ముందస్తు అరెస్టులు, ఆంక్షలు, నిర్బంధాలు విధించింది. కేంద్రం అనూహ్యంగా తీసుకున్న ఈ నిర్ణయానికి చట్టసభల్లో ఆమోదం లభించింది, దేశ వ్యాప్తంగా అనేకులు హర్షాంగీకారాలు తెలిపారు. అదే సమయంలో విమర్శలూ ఎదురయ్యాయి. జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని పూర్తిగా నిర్బంధంలోకి తోశారని, భారతదేశంతో కలసి ఉండడానికి ఆ ప్రాంతానికి ఏ ప్రాతిపదిక లేకుండా చేశారని ప్రతిపక్షాలు విమర్శించాయి. ప్రభుత్వ నిర్ణయానికి కశ్మీర్‌లోని మిలిటెంట్ వర్గీయులే కాక, ప్రధానస్రవంతి ప్రతిపక్ష పార్టీలు కూడా తమ వ్యతిరేకతను గట్టిగా వ్యక్తం చేశాయి. కశ్మీర్‌లో రాకపోకలను నిరోధించడం, అన్ని రకాల కమ్యూనికేషన్లను రద్దు చేయడం, కశ్మీరీ ప్రజలకు నిరసన తెలిపే హక్కు లేకుండా చర్యలు తీసుకోవడం అంతర్జాతీయంగా కూడా విమర్శలకు ఆస్కారమిచ్చాయి. విదేశాల నుంచి ఎంపిక చేసిన ప్రతినిధులను కశ్మీర్‌లో పర్యటించడానికి అనుమతించారు కానీ, వాటికి విశ్వసనీయత ప్రశ్నార్థకమైంది. ఆందోళనల్లో ఉద్యమాల్లో పాల్గొనే వయసున్న యువకులందరినీ రాష్ట్రం బయటికి తరలించి నిర్బంధించారు. నేషనల్ కాన్ఫరెన్స్, పిడిపి, ఇతర పార్టీలకు చెందిన అన్ని స్థాయిల కార్యకర్తలను, నాయకులను వారి వారి హోదాలను బట్టి, నిర్బంధంలోకి తీసుకున్నారు. కొందరు జైళ్లకు వెళ్లారు, కొందరు గృహనిర్బంధాల్లో ఉన్నారు. కొందరిని గెస్ట్ హౌసుల్లో బంధించారు. ప్రజల మనోభావాలు వ్యక్తం అయ్యే మార్గాలేవీ అందుబాటులో లేకుండా దిగ్బంధం చేయడం ఇంతకు మునుపెన్నడూ జరగనిది. అందుకే, మానవహక్కుల వాదులు కశ్మీర్ రాష్ట్రం మొత్తంగా బందిఖానాగా మారిందని వ్యాఖ్యానించారు.

83 సంవత్సరాల ఫరూఖ్‌ను ఏడు నెలలుగా గృహనిర్బంధంలోనే ఉంచారు. కానీ, రాష్ట్రం అంతా నిర్బంధ నిశ్శబ్దంలో ఉంటే, కాలూ చేయీ ఆడని ఆంక్షల మధ్య కాలం గడపడం కష్టమే. ఫరూఖ్ విడుదలయ్యారు కానీ, ఆయన కుమారుడు, కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, మరో మాజీ ముఖ్యమంత్రి మహబూబా ముఫ్తీ ఇంకా నిర్బంధంలోనే ఉన్నారు. తీవ్రవాదులను, రాళ్లు రువ్వేవారిని అరెస్టు చేసే ప్రజాభద్రత చట్టం కిందనే వీరందరినీ అరెస్టు చేశారు. ఇంకా ఈ చట్టం కింద నిర్బంధితులు నాలుగువందల మంది దాకా ఉన్నారని అంచనా. ఈ ఏడు నెలల కాలంలో ప్రభుత్వం అనుసరించిన వైఖరి వల్ల కశ్మీర్‌లో ప్రజాభిప్రాయం మారిందా, వారు 370 అధికరణం పీడ విరగడైందని ఆనందపడుతున్నారా, లేక, తమకు మరింత అన్యాయం జరిగిందని బాధపడుతున్నారా గ్రహించడం పెద్దగా కష్టమేమీ కాదు. కశ్మీర్‌లోకి పెద్ద ఎత్తున పెట్టుబడులను రప్పించేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను అక్కడి ప్రజలు స్వాగతిస్తున్నారా లేదా అన్నది కూడా తెలుసుకోవలసిన అంశం. తనకు స్వేచ్ఛ లభించడం ఆనందంగా ఉన్నదని, అయితే, తక్కిన నాయకుల విడుదల కూడా జరిగినప్పుడే తన ఆనందం పరిపూర్తి అవుతుందని, ప్రజలందరికీ పూర్తి స్వేచ్ఛ లభించినప్పుడు సంపూర్ణమవుతుందని ఫరూఖ్ వ్యాఖ్యానించారు. కేంద్రం తాను చేసిన తప్పొప్పులను సవరించుకోవడం ఈ విడుదలతో మొదలయిందని కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యానించారు కానీ, తక్కిన నేతల విడుదలలు ఎంత శీఘ్రంగా జరుగుతాయో వేచిచూడాలి.

కశ్మీర్ ప్రజా ఉద్యమ నాయకుడిగా, భారత్‌లో జమ్మూకశ్మీర్ అనుసంధానానికి కారకుడిగా ఉండిన షేక్ అబ్దుల్లా, తరువాత భారత ప్రభుత్వ తిరస్కారానికి గురై రెండుదశాబ్దాల పాటు నిర్బంధంలో ఉన్నారు. ఒక అవగాహన కుదిరిన తరువాత కశ్మీర్ ముఖ్యమంత్రి అయ్యారు. స్వతంత్ర ప్రతిపత్తి గురించి పట్టింపు ఉన్నందుకు ఆయన కష్టాలు పడవలసి వచ్చింది. ఫరూఖ్ అబ్దుల్లా, భారతదేశంలో కొనసాగడానికే అంగీకరించిన వ్యక్తి. కానీ, దేశంలో ప్రతిపక్ష రాజకీయాలతో కలసి నడవాలని, రాష్ట్రాలకు అధిక హక్కులు కావాలని కోరినందుకు, ఇందిరాగాంధీ ఆగ్రహానికి గురి అయ్యారు. అనంతరం, కశ్మీర్‌లో ఎన్నికల ప్రహసనం, తీవ్రవాదుల ప్రవేశం, తీవ్రమైన హింస, అణచివేత, తెలిసిన చరిత్రే. పిడిపితో కలసి అధికారాన్ని పంచుకున్న భారతీయ జనతాపార్టీ, తెగదెంపులు చేసుకున్న వెంటనే, తీవ్రమైన చర్యలు తీసుకోవడం ఇటీవలి పరిణామం. బిజెపి అధికార భాగస్వాములు కూడా ఇప్పుడు నిర్బంధాన్ని అనుభవిస్తున్నారు.

కశ్మీర్ ప్రజలకు ప్రాతినిధ్యం వహించే నాయకులకు తగిన స్వేచ్ఛ, వారి సమస్యలను చర్చించే వేదికలున్నప్పుడు మాత్రమే శాంతి శాశ్వతమవుతుంది. నిర్బంధ చర్యల వల్ల కానీ, పెట్టుబడుల వల్ల కానీ ఏర్పడే శాంతి తాత్కాలికమే. కశ్మీరీ గొంతును వినిపించే వారిని విడుదల చేసి, రాజకీయ ప్రక్రియలను సాధ్యమైనంత తొందరగా పునరుద్ధరించడం ఒక్కటే కశ్మీర్‌కు ఉపశమనం ఇస్తుంది.

■ పి. చిదంబరం



'పళని' పలుకు

# ఆదమరిచిన అజమాయిషీ

డబ్బు, ఇంకా విలువైన ఇతర వస్తువులను దాచుకునేందుకు వీలుండడమేగాక, ఖాతాదారుల ఆదేశానుసారం డబ్బు చెల్లించే సంస్థే బ్యాంకు. కరెంట్ ఖాతాలు, పొదుపు (సేవింగ్స్) ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపేణా ప్రజల నుంచి నిధులను బ్యాంకు స్వీకరిస్తుంది; వాటిపై వడ్డీ (నిధుల వ్యయం.. కాస్ట్ ఆఫ్ ఫండ్స్) చెల్లిస్తుంది. ఈ డిపాజిట్లలో ఒక ప్రముఖ భాగాన్ని, రిజర్వ్ బ్యాంక్ నిబంధనల మేరకు షేర్లు, బాండ్లు తదితర ఆర్థిక సాధనాల రూపేణా ఒక క్రమ పద్ధతిలో నిల్వ చేస్తుంది. ఇలా పోగా మిగిలిన నిధులనే రుణాలుగా ఇచ్చి వడ్డీ ఆర్జిస్తుంది (వడ్డీ ఆదాయం.. ఇంట్రెస్ట్ ఇన్‌కమ్). ఆర్థిక సాధనాల రూపేణా నిల్వ చేసే సొమ్ముపై కూడా విధిగా పరిమితులు ఉంటాయి. 'వడ్డీ ఆదాయం', 'నిధుల వ్యయం' మధ్య తేడా నికర వడ్డీ పరిమాణం (ఇంట్రెస్ట్ మార్జిన్.. ఎన్ఐఎమ్). ఇదే బ్యాంకుకు సమకూరే లాభం. ఎన్ఐఎమ్ ఎప్పుడూ ధనాత్మకంగా, నిర్దిష్టంగా ఉంటుంది గనుక బ్యాంకులు సాధారణంగా లాభాలను ఆర్జిస్తాయి.

లెండింగ్ బ్యాంక్ (రుణాలు ఇచ్చే బ్యాంక్) రుణగ్రహీత ఖాతాలను నిరంతరం గమనిస్తూ వుండవల్సిన అవసరం ఎంతైనా వున్నది. రుణగ్రాహి వడ్డీని క్రమబద్ధంగా చెల్లిస్తున్నాడా? అసలు వాయిదాలను నిబంధనల ప్రకారం గడువు తేదీలలోగా చెల్లిస్తున్నాడా? బ్యాలెన్స్ షీట్ (ఆస్తి అప్పుల పట్టీ), లాభనష్టాల ప్రకటనను తనిఖీ చేశారా? అవి, అప్పు తీసుకున్న వ్యక్తి నిజ ఆర్థిక స్థితిగతులను చూపుతున్నాయా లేదా అనే విషయాలను ఎప్పటికప్పుడు నిగ్గు తేల్చుకోవడం బ్యాంకుల బాధ్యత.

బ్యాంకులపై అనేక స్థాయిల్లో పర్యవేక్షణ వుంటుంది. బ్యాంకు ఫైనాన్స్ కమిటీ, బ్యాంకు డైరెక్టర్ల బోర్డు; బ్యాంకు అంతర్గత ఆడిటర్, ఎక్స్‌టర్నల్ ఆడిటర్, రిజర్వ్ బ్యాంక్ ఆమోదించిన చట్ట బద్ధ ఆడిటర్, బ్యాంకు వాటాదారుల వార్షిక సాధారణ సమావేశం, రిజర్వ్ బ్యాంకులోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బ్యాంకింగ్ ఆపరేషన్స్ అండ్ డెవలప్‌మెంట్ (డిబిఒడి), ప్రతి చిన్న లావాదేవీని నిశితంగా పరీక్షించే ఆర్థిక విశ్లేషకుడు. వీటన్నిటికీ మించి లిస్టెడ్ కంపెనీ అయిన బ్యాంక్ లాభాలకు దోహదం చేసే లేదా నష్టాలకు కారణమయ్యే అదృశ్య మార్కెట్. ఇవే గాక ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (డిఎఫ్ఎస్) కూడా బ్యాంకులపై పర్యవేక్షణ చేస్తుంది. ప్రభుత్వ రంగ బ్యాంకులతో సహా ప్రతి షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుకు సంబంధించిన అన్ని లావాదేవీలను ఈ ప్రభుత్వ విభాగం నిరంతరం తప్పక గమనిస్తూ వుంటుంది.

బ్యాంకులపై ఇన్ని విధాలుగా పర్యవేక్షణ వున్నప్పటికీ కొన్ని రుణాలు నిరర్థక ఆస్తులుగా మిగిలిపోవడం కద్దు. రుణ గ్రహీతల వ్యాపారాలు దివాలా తీయడం మొదలైనవి అందుకు కారణం కావచ్చు. ఈ వ్యాపార వైఫల్యాలు అర్థం చేసుకోదగినవే. అయితే రిజర్వ్ బ్యాంక్ నిబంధనలు, ఆదేశాల మేరకు ఒక రుణాన్ని 'నాన్ పెర్ఫార్మింగ్ అస్సెట్ (ఎన్‌పిఎ.. నిరర్థక ఆస్తి)'గా వర్గీకరించడం జరుగుతుంది. ఏదైనా ఒక రుణాన్ని ఇలా వర్గీకరించడం జరిగితే, బ్యాంకుకు ఆ మేరకు నష్టమే. దీనివల్ల బ్యాంకు లాభాలు తగ్గిపోతాయి. స్థూల నిరర్థక ఆస్తులు పెరగడమంటే బ్యాంకు ప్రతిష్ఠకు, అస్తిత్వానికి ప్రమాద ఘంటికలు మోగినట్లే.

సరే, ఇక యెస్ బ్యాంక్ విషయానికొద్దాం. ప్రతి త్రైమాసికంలో ఈ బ్యాంకు తన లాభాలను ప్రకటిస్తుంది. అయితే వాస్తవాలు వేరుగా వున్నాయి. ఆ వాస్తవాలను పసిగట్టడంలో పైన పేర్కొన్న పర్యవేక్షణ వ్యవస్థలన్నీ విఫలమయ్యాయి. యెస్ బ్యాంక్ తన మొదటి నష్టాన్ని 2019 జనవరి–మార్చి త్రైమాసికంలో ప్రకటించింది. అప్పుడు డిబిఒడి, డిఎఫ్ఎస్‌లలో ఎలాంటి ప్రమాద ఘంటికలు మోగనేలేదు! నిజానికి 2014 ఏప్రిల్ నుంచే యెస్ బ్యాంక్ విశృంఖలంగా రుణ వితరణ చేస్తోంది. ఆ బ్యాంక్ బ్యాలెన్స్ షీట్‌లోని వివరాలను చూడండి: ప్రతి ఆర్థిక సంవత్సరాంతంలో ఆ బ్యాంకుకు వసూలు కావలసిన బకాయిల వివరాలు ఇలా వున్నాయి: 2014 మార్చి: రూ.44,633 కోట్లు; 2015 మార్చి: రూ.75,550 కోట్లు; 2016 మార్చి: రూ.98,210 కోట్లు; 2017 మార్చి: రూ.1,32,263; 2018 మార్చి: రూ.2,03,534; 2019 మార్చి: రూ.2,41,499. 2014 మార్చి నుంచి 2019 మార్చి వరకు రుణ వితరణ పురోగతి ఎలా వున్నదో గమనించారా? ఏడాదికి 35 శాతం మేరకు ఆ పెరుగుదల రేటు వున్నది! మరో ముఖ్యమైన విషయం మీ దృష్టికి వచ్చిందా? నోట్ల రద్దు జరిగిన తరువాత మొదటి రెండు సంవత్సరాలలో అంటే 2016–17, 2017–18 ఆర్థిక సంవత్సరాలలో యెస్ బ్యాంక్ రుణ వితరణ మధ్య వున్న తేడా గమనార్హం.




> 2014 మార్చి తరువాత కొత్త రుణాలు మంజూరు చేసేందుకు యెస్ బ్యాంక్‌కు అనుమతి ఇచ్చింది ఎవరు? విశృంఖలంగా రుణాలు మంజూరు చేస్తున్న విషయం రిజర్వ్ బ్యాంక్ లేదా ప్రభుత్వానికి తెలియదా? ప్రతి సంవత్సరాంతంలో బ్యాంక్ బ్యాలెన్స్ షీట్‌ను రిజర్వ్ బ్యాంక్ లేదా ప్రభుత్వంలో ఏ ఒక్కరూ పరిశీలించనే లేదా? యెస్ బ్యాంక్ తన మొట్టమొదటి త్రైమాసిక నష్టాన్ని 2019 జనవరి–మార్చిలో ప్రకటించిన తరువాత కూడా ప్రమాద ఘంటికలు ఎందుకు మోగలేదు? బ్యాంకింగ్ వ్యవస్థపై పలు స్థాయిల్లో వున్న పర్యవేక్షణ, యెస్ బ్యాంక్ విషయంలో పూర్తిగా విఫలమయిందని ఈ ప్రశ్నలు స్పష్టం చేస్తున్నాయి.

అనివార్యంగా కొన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 2014 మార్చి తరువాత కొత్త రుణాలు మంజూరు చేసేందుకు ఏ కమిటీ అనుమతిచ్చింది? ఆ రుణాల మంజూరుకు ఎవరు బాధ్యులు? యెస్ బ్యాంక్ విచ్చలవిడిగా రుణాలు మంజూరు చేస్తున్న విషయం రిజర్వ్ బ్యాంక్ లేదా ప్రభుత్వానికి తెలియదా? ప్రతి సంవత్సరాంతంలో బ్యాంక్ బ్యాలెన్స్ షీట్‌ను రిజర్వ్ బ్యాంక్ లేదా ప్రభుత్వంలో ఏ ఒక్కరూ పరిశీలించనే లేదా? రిజర్వ్ బ్యాంక్ 2019 జనవరిలో యెస్ బ్యాంక్ సిఇఒను మార్చేసి, కొత్త సిఇఒను నియమించిన తరువాత బ్యాంక్ వ్యవహారాలలో ఏమీ మార్పు లేక పోవడానికి కారణమేమిటి? రిజర్వ్ బ్యాంక్ మాజీ డిప్యూటీ గవర్నర్ ఒకరిని యెస్ బ్యాంక్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో నియమించిన తరువాత కూడా బ్యాంక్ కార్యకలాపాలాలలో ఎటువంటి మార్పు ఎందుకు చోటు చేసుకోలేదు? యెస్ బ్యాంక్ తన మొట్ట మొదటి త్రైమాసిక నష్టాన్ని 2019 జనవరి–మార్చిలో ప్రకటించిన తరువాత కూడా ప్రమాద ఘంటికలు ఎందుకు మోగలేదు?

ఈ ప్రశ్నలను తొలుత 2020 మార్చి 7న లేవనెత్తడం జరిగింది. రిజర్వ్ బ్యాంక్ అధికారులు గానీ, ప్రభుత్వంలోని మరే ఇతర బాధ్యతాయుత అధికారి గానీ ఆ ప్రశ్నలకు ఇంతవరకు సమాధానమివ్వలేదు. ఎందుకని? యెస్ బ్యాంక్ కథ ప్రజల దృష్టి నుంచి కనుమరుగైపోగలదని ప్రభుత్వం భావిస్తున్నట్టుగా కన్పిస్తోంది. ఈ సంక్షోభాన్ని ప్రజలు అంత తొందరగా మరచిపోతారా? సామాజిక మాధ్యమాల పుణ్యమా అని ప్రజలు దీన్ని అంత త్వరగా విస్మరించే అవకాశం లేదు. ప్రింట్, టీవీ మీడియాకు ఈ వార్తలు, విశ్లేషణలు నివేదించడం మినహా మరో గత్యంతరం లేదు.

సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రంగంలోకి దిగారు. మంచిదే. వీరేదో సత్యావిష్కరణ చేస్తారని నేను భావించడం లేదు. జరిగిన అక్రమాలకు యెస్ బ్యాంక్, డిబిఒడి అధికారుల్లో జవాబుదారులు ఎవరో రిజర్వ్ బ్యాంక్ నిర్ణయించక ముందే ఈ దర్యాప్తు సంస్థలు రంగంలోకి ప్రవేశించడమేమిటి? 'దర్యాప్తు' పూర్తయ్యేవరకు జవాబుదారులు ఎవరో నిర్ధారించక పోవచ్చునేమో? నా యీ భయాలకు సహేతుక కారణాలు వున్నాయి. అభిజ్ఞ వర్గాలు ఏవో వివరాలు వెల్లడిస్తున్నాయనుకోండి. అయితే, అవి మీడియా స్పేస్ నింపడానికి మాత్రమే ఉపయోగపడతాయి. యెస్ బ్యాంక్ నుంచి రుణాలు తీసుకున్నవారి (ముఖ్యంగా వందలు, వేల కోట్ల రూపాయల రుణాలు తీసుకున్న బడా వ్యాపారుల) పేర్లను వెల్లడించి తీరాలని ప్రజలు, పార్లమెంటు డిమాండ్ చేయాలి. యెస్ బ్యాంక్ పై పర్యవేక్షణకు బాధ్యుల నుంచి సంజాయిషీని డిమాండ్ చేయాలి. యెస్ బ్యాంకులో అక్రమాలు కొంత మంది బాధ్యుల అజాగ్రత్త వల్లే గాక, అవి శిక్షార్హమైన ఉదాసీనత వల్లే జరిగాయని నేను భావిస్తున్నాను.

యెస్ బ్యాంక్‌ను గట్టెక్కించడానికి రిజర్వ్ బ్యాంక్, ప్రభుత్వం పూనుకోవడం విచిత్రంగా వున్నది. ఈ నెల 12న ప్రకటించిన ఒక పథకం ప్రకారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యెస్ బ్యాంక్‌లో రూ.7250 కోట్ల రూపాయలు మదుపు చేసి, 49 శాతం వాటాలను స్వాయత్తం చేసుకోనున్నది. యెస్ బ్యాంక్ నికర విలువ, బహుశా జీరో అని చెప్పవచ్చు. అటువంటి బ్యాంక్ షేర్లను ఒక్కోదానికి పది రూపాయలకు పైగా ధర కట్టి ప్రభుత్వ రంగ బ్యాంకు కొనుగోలు చేయడమేమిటి? ఆ షేర్లకు ఇప్పుడు ఏ పాటి విలువ వున్నది? ప్రజల సొమ్మును ఇలా వృథా చేయడం సబబేనా? అందరమూ ఆలోచించాలి. ఏమైనా యెస్ బ్యాంక్ కథ ఇంకా ముగియలేదు.

*(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)*

# ఆయన అడుగుజాడలే రాజ్యాధికార సోపానాలు

తెలుగు రాష్ట్రాల్లో బలమైన కుల ఉద్యమాలు ఎన్ని జరుగుతున్నా అవి రాజ్యాధికారం దిశగా మాత్రం సాగడం లేదు. మాదిగలు ఇంకా మానసిక బానిసత్వంలోనే ఉన్నారని అనిపిస్తోంది. జనాభా పరంగా 13శాతం ఉన్న మాదిగలు రాజ్యాధికార కాంక్ష లేకుండా ఉన్నారు. 'మాదిగ' అంటే ఆత్మగౌరవం లేని పదమన్న ఆత్మన్యూనతా భావనలో నుంచి మాదిగలు బయటపడలేక పోతున్నారు. తమను తాము తక్కువ చేసుకొని, పోరాడే స్ఫూర్తిని కోల్పోయి, తాత్కాలిక పదవులతో జీవితాలను గడిపేస్తున్న వీరు ఆత్మగౌరవంతో బతుకుతున్న చమార్ల పోరాట స్ఫూర్తితో ముందుకు నడవాల్సి ఉంది. దళితులకు రాజ్యాధికారం సాధించిపెట్టిన ధీరుడు కాన్షీరాం చమార్ అడుగు జాడల్లో సాగాలి. పంజాబ్‌లోని హోషియాపూర్ జిల్లా కవాస్ పూర్లో బిషన్ సింగ్ కౌర్, హరిసింగ్ తేల్ సింగ్‌ల చివరి సంతానంగా 1934 మార్చి 15న జన్మించారు కాన్షీరాం. ఉద్యోగం చేస్తున్న సమయంలో తన మిత్రుడి సహకారంతో అంబేద్కర్‌ను పూర్తిగా అధ్యయనం చేసి, ఆయన బాటలో నడిచారు.

దేశంలో 35 కోట్లకు పైగా ఉన్న బహుజనులకు ఆత్మగౌరవాన్ని, రాజ్యాధికారాన్ని సాధించి పెట్టడం కోసం తన జీవితాన్ని ధారపోశారు మహనీయుడు మాన్యశ్రీ కాన్షీరాం. సమాజంలో దుఃఖ నివారణ కోసం బుద్ధుడు ఏవిధంగా అయితే సొంత కుటుంబాన్ని, రాజభోగాలను వదిలి ప్రజల్లోకి వచ్చి జ్ఞానబోధ చేస్తూ సమసమాజ స్థాపన కోసం ఆధ్యాత్మిక పోరాటం చేశారో.. అదే విధంగానే కాన్షీరాం కూడా రాజకీయ బుద్ధుడయ్యారు. ఉన్నత ఉద్యోగాన్ని, కుటుంబాన్ని వదిలేసి, పెళ్లి చేసుకోకుండా, తండ్రి మరణించినా ఇంటికి వెళ్లకుండా తాను చనిపోయే వరకూ బహుజనులకు రాజ్యాధికారం సాధించే కృషి కొనసాగించారు. బహుజనులు నేడు రాష్ట్ర పతి, పార్లమెంట్ స్పీకర్ వంటి అత్యున్నత పదవులు పొందుతున్నారంటే అది ఈయన పోరాటం వల్లనే.




అంబేద్కర్ జన్మదినం సందర్భంగా 1984లో బహుజన సమాజ్ పార్టీని స్థాపించి, 'ఓట్లు మావి.. అధికారం మీకా' అంటూ అగ్రవర్ణాల ఆధిపత్యానికి ఎదురు తిరిగారు. అతి తక్కువ కాలంలోనే వెనుకబడిన వర్గాల వారిని ఎమ్మెల్యేలుగా, మంత్రులు, ముఖ్యమంత్రులుగా చేశారు. ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి దేశ రాజకీయాల్లో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు.

చాలామంది ఆయనను కుల రాజకీయాలు ప్రవేశ పెట్టిన నాయకునిగా ప్రచారం చేశారు. కానీ కులం అనే ముల్లును కులంతోనే తీయాలని, కుల నిర్మూలన కోసమే రాజకీయాల్లో కులాన్ని ప్రధాన ఎజెండాగా చేశారు. యూపీతో పాటు, హర్యానా, మధ్యప్రదేశ్, ఢిల్లీల్లోని చమార్, తదితర కులాలను కలుపుకొని బహుజన రాజ్యానికి ప్రాణం పోశారు. యూపీలో అధికారం నెరపిన బీఎస్పీ తరఫున అంటరాని కులానికి చెందిన మహిళ మూడుసార్లు ముఖ్యమంత్రిని చేశారు కాన్షీరాం. ఆయన నిర్వహించిన ఉద్యమ ఫలితంగానే ఇప్పుడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో దళితులు ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా ఉన్నారు. అయితే, తెలుగు రాష్ట్రాల్లో బలమైన కుల ఉద్యమాలు జరుగుతున్నా అవి పాలకులను ప్రశ్నించ లేకపోతున్నాయి. అడుక్కుంటే పాలకులుగా మారరని.. రాజ్యాధికారం అనే మాస్టర్ కీ కోసం ఉద్యమాలు చేయాలని చెప్పిన అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత దళితులపై ఉంది.

> సైకిల్‌నే ప్రచార రథంగా చేసుకొని, బలానికి చిహ్నమైన ఏనుగును పార్టీ గుర్తుగా పెట్టుకుని, అంబేద్కర్ చెప్పిన రాజ్యాధికారం అనే మాస్టర్ కీని సాధించిన ధీరుడు కాన్షీరాం చమార్ అడుగుజాడల్లో ముందుకు సాగాలి. ఇటువంటి మన జాతి మహనీయుల ఆశయాలన లక్ష్యంగా మార్చుకోకుంటే భవిష్యత్తులో అణగారిన వర్గాలు అంతరించిపోవడం ఖాయం.

రాజ్యాధికారానికి రాని జాతి అంతరించిపోతుంది. మనం సామాజికంగా ఎదగాలంటే రాజకీయాలలో కూడా ఎదగాలి. రాజకీయాల వల్లే రాజ్యాధికారం లభిస్తుంది. రాజ్యాధికారం నుంచి శాసనాధికారం లభిస్తుంది. మన చేతుల్లో రాజ్యాధికారం ఉంటేనే మన లక్ష్యం సిద్ధిస్తుంది. అందుకే రాజకీయాల గురించి మనం ఆలోచించాలి. సామాజిక హితం కోసం అనేక అంశాలపై అవగాహనతో ముందుకు నడవాలి. బహుజనులు దేశంలోనూ, రాష్ట్రాలలోనూ పాలకులుగా మారినప్పుడే మహనీయుల లక్ష్యం నెరవేరుతుంది. అందుకు కాన్షీరాం చమార్ మార్గమే బహుజనులకు రాచబాట.

భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీకి ఎంపిక చేయాలంటే, అంబేద్కర్ పార్లమెంటు సభ్యునిగా ఎన్నికైతేనే అవకాశం ఇస్తామంటూ ఆయనను అడ్డుకునే ప్రయత్నం చేశారు అగ్ర వర్ణ నేతలు. ఆ సమయంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన జోగేంద్రనాథ్ మండల్ చమార్ తన కల్నల్ నియోజకవర్గం ఎంపీ పదవికి రాజీనామా చేసి, ఆ స్థానంలో గెలిపించడంతో అంబేద్కర్ రాజ్యాంగ పరిషత్తుకు ఎంపికయ్యారు. జోగేంద్రనాథ్ త్యాగం అలా దేశానికే వెలుగులు పంచే రాజ్యాంగ రచనకు తోడ్పడింది. అంబేద్కర్, జోగేంద్రనాథ్‌ల స్ఫూర్తితో దేశంలోనే సుదీర్ఘ కాలం.. 38 ఏళ్ల పాటు కేంద్ర మంత్రిగా,ఉప ప్రధానిగా వివిధ మంత్రిత్వ శాఖలు నిర్వహించిన బాబు జగ్జీవన్ రాం తన అధికారాన్నంతా ఉపయోగించి అణగారిన వర్గాల సంక్షేమం, ప్రగతి కోసం పాటుపడ్డాడు. ఇదే కోవలో సాగుతున్న చంద్రశేఖర్ ఆజాద్ రావణ్ చమార్, యువనాయకుడు జిగ్నేష్ మేవానీ చమార్ లాంటి వారిని ఆదర్శంగా తీసుకుని మాదిగలు ధీరత్వాన్ని నింపుకోవాలి. తమ కోసం తామే దీక్షగా సాగాలి. లేని పక్షంలో భవిష్యత్తు మాదిగ తరాల పరిస్థితి మరింత అధ్వాన్న స్థితికి దిగజారే ప్రమాదం ఉంది. పాలకులుగా ఉన్న మన జాతి ప్రతినిధులు జాతి ఆర్థిక ఎదుగుదలకు దోహదపడక పోవడం కూడా ప్రమాదమే. ఏ స్థాయిలో అధికారం దక్కితే ఆ స్థాయిలో ఆ అధికారాన్ని విస్తృతంగా ఉపయోగించి మాదిగ పాలకులు తమ జాతి అభ్యున్నతికి కృషి చేయాలి. కాన్షీరాం చమార్ చైతన్యాన్ని నింపుకొని మనమంతా ఏ ఉద్యమాన్నైనా రాజ్యాధికారం దిశగా మలిచిన నాడే మనమంతా నిజమైన విద్యావేత్తలం.. నిజమైన డాక్టరేట్లం.. నిజమైన ఉద్యమకారులం.. అనిపించుకుంటామనేది నా భావన. సైకిల్‌నే ప్రచార రథంగా చేసుకొని, బలానికి చిహ్నమైన ఏనుగును పార్టీ గుర్తుగా పెట్టుకుని, అంబేద్కర్ చెప్పిన రాజ్యాధికారం అనే మాస్టర్ కీని సాధించిన ధీరుడు కాన్షీరాం చమార్ అడుగుజాడల్లో ముందుకు సాగాలి. ఈ మన జాతి మహనీయుల ఆశయాలు లక్ష్యంగా మార్చుకోలేకపోతే భవిష్యత్తులో అణగారిన వర్గాలు అంతరించిపోవడం ఖాయం.

**– సంపత్ గడ్డం**

(రేపు కాన్షీరాం జయంతి)

కరపత్రం

# ఎన్‌పీఆర్ తిరస్కరణకు తీర్మానం చేయాలి

జాతీయ జనాభా రిజిస్టరు (ఎన్‌పీఆర్) మొత్తాన్ని తిరస్కరించకుండా 2010 నాటి జాతీయ జనాభా రిజిస్టరును అమలు చేస్తామంటే సరిపోదని, మొత్తం ఎన్‌పీఆర్‌ను తిరస్కరిస్తే తప్ప ప్రయోజనం లేదని, ఆ మేరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు తమ రాష్ట్ర అసెంబ్లీలలో తీర్మానాలు అమలు చేయాలని మానవ హక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్) డిమాండ్ చేస్తోంది.

ఎన్‌పీఆర్, ఎన్‌సీఆర్, సీఏఏ మూడూ విడదీయలేనంతగా ఒక దానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. ఎన్‌పీఆర్‌కి శ్రీకారం చుట్టే పౌరసత్వ(సవరణ)చట్టం,2003 ముఖ్య లక్ష్యం భారత పౌరుల జాతీయ రిజిస్టరు (ఎన్ఆర్‌సిఐసీ) రూపొందించడం. ఎన్‌పీఆర్ ఎలా సేకరించాలో నిర్దేశించే పౌరసత్వ (పౌరుల రిజిస్ట్రేషన్, జాతీయ గుర్తింపు కార్డుల మంజూరీ) నియమాలు, 2003లోని 3వ నియమం శీర్షికలోనే ఎన్ఆర్‌సిఐసీ ప్రస్తావన ఉంది. ఎన్‌పీఆర్ ప్రక్రియ గురించి రూల్ 3(4) ప్రస్తావించగా రూల్ 3(5) సుస్పష్టంగా చెప్పేదేమంటే 'జనాభా రిజిస్టరు ద్వారా ధృవీకరణ చేసిన తరువాతే భారత పౌరుల రిజిస్టరులో వ్యక్తుల వివరాలు పొందుపరుస్తారు' అంటే, ఎన్‌పీఆర్ మీద ఆధారపడి ఎన్ఆర్‌సీను తయారు చేస్తారన్నమాట. మరో మాటలో చెప్పాలంటే ఎన్‌పీఆర్, ఎన్ఆర్‌సీకి తొలి మెట్టు.

ఎన్‌పీఆర్,ఎన్ఆర్‌సీ,సీఏఏలు ఏ క్రమంలో వచ్చాయో అర్థం చేసుకోవాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పార్లమెంటులో, బైటా చాలా స్పష్టంగా చెబుతున్నారు. ఎన్‌సీఆర్ విధానంలో ఒక వ్యక్తి పౌరసత్వం 'డౌట్‌ఫుల్ లేదా 'డీ' అని గుర్తించే ప్రసక్తి లేదని పార్లమెంట్‌లో మార్చి 12న పచ్చి అబద్ధం ఆడారు. పౌరసత్వ నియమాలలోని రూల్ 4(4) చెబుతున్నది ఏమిటంటే 'ధృవీకరణ చేసేటప్పుడు వ్యక్తుల పౌరసత్వం అనుమానాస్పదం(డౌట్‌ఫుల్)గా ఉన్నట్లు అనిపిస్తే దాన్ని నమోదు చేసేటప్పుడు ఈ విషయమై విచారణ జరపాలి అనే విషయాన్ని సూచిస్తూ జనాభా రిజిస్టరులో తగిన విధంగా గుర్తు పెట్టాలి. ఆ వ్యక్తి లేదా కుటుంబానికి ఆ విషయం ఒక ప్రొఫార్మా ద్వారా వెంటనే తెలియజేయాలి'.

ఎన్‌పీఆర్ సర్వే చేపట్టేది ఎన్ఆర్‌సీ వివరాల సేకరణ కోసమేనని హెచ్ఆర్ఎఫ్ నమ్ముతుంది. 'డౌట్‌ఫుల్' పౌరులను గుర్తించడానికి ఎన్‌పీఆర్ వివరాలు వాడుకుంటారు. దాని ఆధారంగా ఎన్ఆర్‌సీని రూపొందిస్తారు. ఈ ఎన్ఆర్‌సీని అడ్డం పెట్టుకుని పాలకులు తమకు గిట్టని వ్యక్తులజీవితాలతో చెలగాటమాడే అవకాశముంది. ఇది కేవలం మత మైనారిటీల సమస్య మాత్రమే అని ఇతరులది కాదు అన్నది ఒక భ్రమ. ఈ సమస్య దేశంలోని అశేష బడుగు బలహీన వర్గాలకు చుట్టుకోనుంది. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కేరళను ఆదర్శంగా తీసుకుని తమ రాష్ట్రంలో ఎన్‌పీఆర్‌ను బేషరతుగా తిరస్కరించాలని, తమ రాష్ట్రంలో దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేయబోమని అసెంబ్లీలలో తీర్మానాలు చేయాలని హెచ్ఆర్ఎఫ్ డిమాండ్ చేస్తోంది.

**– వి.ఎస్.కృష్ణ, ఎస్. జీవన్ కుమార్**

హెచ్ఆర్ఎఫ్, ఏపీ & టీఎస్ సమన్వయ కమిటీ సభ్యులు

> ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఇప్పుడు రంజీట్రోఫీ స్థానంలో భారతదేశ ప్రీమియర్ క్రికెట్ టోర్నమెంట్‌గా వున్నది. ఐపిఎల్ అట్టహాసాలు, ఆర్భాటాలు, ఆడంబరాలు ఎలా వున్నప్పటికీ తమ తమ రాష్ట్రాల టీమ్‌ల పట్ల క్రికెట్ అభిమానుల విధేయతలు ప్రగాఢంగా వున్నాయని నేను భావించడం లేదు. రాయల్ ఛాలెంజర్స్ బెంగలూరు, కోల్‌కతా నైట్ రైడర్స్ జయాపజయాలను అనుసరిస్తున్న ఇద్దరు మిత్రులు ముప్పై, నలభై సంవత్సరాల అనంతరం తమ టీమ్‌ల గురించి వాదించుకుంటారా అనేది సందేహమే.

■ రామచంద్ర గుహ



గతానుగతం

# 'రంజి'ల్లిన నాటి క్రికెట్

నా మేధో వికాసంలో కలకత్తా (నేటి కోల్‌కతా) ఒక మైలు రాయి. ఆ మహానగర మేధావులు నన్ను విశేషంగా ప్రభావితం చేశారు. నా మేధస్సును చైతన్య పరిచి, తీర్చిదిద్దారు. ఇప్పటికీ ఆ ధీమంతులతో సంభాషించడాన్ని నాకు నేనుగా ఆపలేను. నేను వ్యక్తిగతంగాను, బహిరంగంగాను అనేక వాదోపవాదాలు చేసిన కోల్‌కతా మేధావి రాజకీయ సైద్ధాంతిక వేత్త పార్థా ఛటర్జీ. పార్థా నాకు నా మొదటి ఉద్యోగాన్ని సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ సోషల్ సైన్సెస్ లో ఇచ్చారు. భారతీయుల అభిమాన క్రీడ గురించి కూడా ఆయన, నేను తరచూ వాదించుకునే వాళ్ళం. టెస్ట్ క్రికెట్ నుంచి డ్రాను రద్దు చేయదలుచుకున్నట్టు 1990 దశకంలో జగ్మోహన్ దాల్మియా ప్రకటించారు. డబ్బు చెల్లించి ఆట చూడడానికి వచ్చేవారు ఒక 'ఫలితాన్ని' కోరుకుంటారు కనుక టెస్ట్ మ్యాచ్‌లను లాంగర్ వెర్షన్ లిమిటెడ్ ఓవర్స్ క్రికెట్‌గా మార్చి వేయాలని ఆయన ప్రతిపాదించారు. నేను ఆ ప్రతిపాదనను వ్యతిరేకించాను. డ్రాలో ఒక విశిష్ట శోభ, నాటకీయ భావోద్విగ్నత వున్నాయని; ఎదుటి పక్షానికి విజయాన్ని నిరాకరిస్తూ హనీఫ్ మొహమ్మద్, సునీల్ గవాస్కర్‌లు గంటల తరబడి బ్యాటింగ్ చేయడమే అందుకొక నిదర్శనమని నేను రాసిన ఒక వ్యాసంలో పేర్కొన్నాను. పార్థా వెన్వెంటనే పత్రికా ముఖంగా ప్రతిస్పందిస్తూ క్రికెట్‌లో చోటుచేసుకుంటున్న వినూత్న మార్పులను గుర్తించలేక పోతున్నానని అంటూ నా అభిప్రాయాలను కొట్టివేశారు.

చరిత్ర, రాజకీయాలు, క్రికెట్ గురించి మా మధ్య జరిగే చర్చల్లో మరో కోల్‌కతా మేధావి రుద్రాంశు ముఖర్జీ కూడా పాల్గొనేవారు. క్రికెట్ అభిమానులుగా పార్థా, రుద్రాంశులకు నాకులేని రెండు గొప్ప అనుకూలతలు వున్నాయి. ఇరువురూ వయస్సులో నా కంటే పెద్దవారు. క్రికెట్ గురించిన వారి జ్ఞాపకాలు సువిస్తారమైనవి. కోల్‌కతాలో పుట్టి పెరిగినందున బాల్యం నుం చి వారికి (లార్డ్స్, మెల్ బోర్న్ క్రికెట్ గ్రౌండ్ తరువాత) గొప్ప క్రికెట్ మైదానమైన ఈడెన్ గార్డెన్స్ అందుబాటులో వుండేది. అక్కడ వారు ఎన్నో టెస్ట్ మ్యాచ్‌లు చూశారు. హజారే, ఉమ్రిగర్, సోబెర్స్, హార్వే మొదలైన మహా క్రికెటర్ల బ్యాటింగ్ ప్రతిభను బౌలింగ్ నైపుణ్యాన్ని నా మిత్రులు ప్రత్యక్షంగా వీక్షించారు. పార్థా, రుద్రాంశులకు లేని ఒక గొప్ప అనుకూలత నాకు వున్నది. నా సొంత రాష్ట్రమైన కర్ణాటక గత దశాబ్దాలలో పలుమార్లు రంజీ ట్రోఫీని గెలుచుకున్నది. నా మిత్రుల రాష్ట్రమైన బెంగాల్ చివరిసారి రంజీ ట్రోఫీని గెలుచుకున్నది బ్రిటిష్ వలసపాలకుల కాలంలో! నా కోల్‌కతా మిత్రులు తమ యవ్వనారంభ దశలో బెంగాల్ టీమ్ రంజీ ఫైనల్‌కు చేరడాన్ని కనీసం ఐదు సార్లు చూశారు. ప్రతి ఫైనల్ మ్యాచ్‌లోనూ బెంగాల్ ఓడిపోయింది. బెంగాల్‌ను నాలుగుసార్లు ఓడించిన ఘనత బొంబాయి టీమ్‌ది. ఈ టీమ్ 1958 నుంచి 1973 దాకా ప్రతి ఏటా రంజీ ట్రోఫీ విజేతగా వెలుగొందింది. నేను 1974 మార్చిలో బెంగలూరులోని చిన్న స్వామి స్టేడియంలో రంజీ సెమీ ఫైనల్‌లో బొంబాయిని కర్ణాటక ఓడించడాన్ని చూశాను. ఫైనల్‌లో రాజస్థాన్ టీమ్‌ను కర్ణాటక ఓడించింది. దరిమిలా రంజీ ట్రోఫీ కర్ణాటకకే దక్కింది.




ఇండియన్ ప్రీమియర్ లీగ్ ప్రధాన దేశీయ టోర్నమెంట్‌గా వున్న రోజులివి. ఇప్పుడు ఆరు పదులకు పైబడిన వయస్సులో వున్న క్రికెట్ ప్రేమికులకు రంజీ ట్రోఫీ ఎటువంటి స్ఫూర్తినిచ్చేదో నేటి యువతరానికి చెప్పడం కష్టం. 1960ల్లోనూ, 1970ల్లోనూ టెస్ట్ మ్యాచ్‌లు చాలా తక్కువ. లైవ్ టెలివిజన్ లేదు నాటి క్రికెట్ అభిమానులు తమ సొంత రాష్ట్ర టీమ్ జయాపజయాలకే ఎక్కువ ప్రాధాన్యమిస్తుండేవారు. రంజీ ట్రోఫీ మ్యాచ్‌లను చూడడానికి ఇరవై నుంచి ముప్పై వేల మంది వస్తుండేవారు. ఇంకా ఎంతో మంది రేడియో, వార్తా పత్రికల ద్వారా ఆ మ్యాచ్‌ల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటుండేవారు. ప్రతి ఒక్కరూ తమ సొంతరాష్ట్ర ఆటగాళ్ళను ప్రగాఢంగా అభిమానిస్తుండేవారు. ప్రసన్న కంటే వెంకటరాఘవన్ మెరుగైన ఆఫ్ స్పిన్నర్ అని తమిళులు వాదిస్తుండేవారు. ఇండియన్ టెస్ట్ టీమ్‌లో బెంగాలీలకు స్థానం దక్కకుండా కుట్రలు జరుగుతున్నాయని బెంగాలీ మిత్రులు విమర్శిస్తుండేవారు. ఎవరి వాదనలూ సహేతుకమైనవి కావని మరి చెప్పనవసరం లేదు.

క్రికెట్ అభిమానులుగా మా అస్తిత్వాలను రంజీ ట్రోఫీ ప్రభావశీలంగా నిర్వచిస్తుండేది. 1980ల్లో పార్థా, రుద్రాంశు, నేను ఇండియన్, వెస్టిండీస్ క్రికెట్ గురించే కాకుండా బెంగాల్, కర్ణాటక క్రికెట్ గురించి కూడా చర్చించుకునే వాళ్ళం. నా మిత్రులు ఇరువురూ, తాము పుట్టక ముందు రంజీట్రోఫీలో సంభవించిన బెంగాల్ విజయం గురించిన కథలు వింటూ, చదువుతూ పెరిగినవారు. బెంగాల్‌లో బాక్స్ వాలాలుగా పనిచేస్తున్న ఇద్దరు ఇంగ్లీష్ వ్యక్తులు ఆ విజయంలో కీలక పాత్ర వహించారు. వారి పేర్లు ఎ.ఎల్. హోసియె, టి.సి.లాంగ్ ఫీల్డ్. ఈడెన్ గార్డెన్స్ గుంపులు వారిని ప్రేమాభిమానాలతో 'అమృత్ లాల్' అనీ, 'తులసీ చరణ్'అనీ పిలిచేవారని పార్థా, రుద్రాంశు చెప్పారు. తమ రాష్ట్ర జట్టు ఏకైక విజయం గురించి నా మిత్రులిరువురికీ వినడం, చదవడం ద్వారా మాత్రమే తెలుసు. ఇక నా రాష్ట్రం కర్ణాటక టీమ్ పలు మార్లు విజయం సాధించింది. గెలిచిన కొన్ని మ్యాచ్‌లను నేను స్వయంగా చూసి ఆనందంలో ఓలలాడాను. 1980ల్లో నా మిత్రులతో చర్చల సందర్భంగా ఈ విషయం గురించి నేను సగర్వంగా చెప్పుకోకుండా ఎలా వుంటాను?

కొద్ది రోజుల క్రితం పార్థా ఛటర్జీ నాకు పంపిన ఒక ఈమెయిల్‌ను, నాటి గర్వాతిశయ భావోద్వేగాల వ్యక్తీకరణ నేపథ్యంలో అర్థం చేసుకోవల్సి వున్నది. ఇటీవల మా ఉత్తర ప్రత్యుత్తరాలలో, దేశంలో చోటుచేసుకుంటున్న వివిధ రాజకీయ, సామాజిక పరిణామాలే ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి. అయితే, పార్థా ఈమెయిల్ క్రికెట్‌కు సంబంధించినది. అది చాలా క్లుప్తంగా వున్నది. 'కర్ణాటకను బెంగాల్ జయించింది. త్రీ చీర్స్ ఫర్ పిగ్గీ లాల్, హిప్ హిప్ హుర్రే!' అని అందులో వున్నది. రంజీ ట్రోఫీ సెమీ ఫైనల్లో కర్ణాటకను బెంగాల్ ఓడించింది. అదీ, ఈడెన్ గార్డెన్స్‌లో. పార్థా అప్పుడు ఈడెన్ గార్డెన్స్‌లో వుండి వుంటారని నేను అనుకోను. ఆ మ్యాచ్ వార్తలను ఆయన ఎప్పటికప్పుడు తెలుసుకుని వుంటారరనడంలో సందేహం లేదు. నేనూ ఆ మ్యాచ్‌పై దృష్టి పెట్టలేదు. పార్థా మెయిల్ వచ్చిన తరువాత, బెంగాల్ టీమ్ మేనేజర్ అరుణ్(పిగ్గీ)లాల్ అని తెలిసింది. నా గౌరవనీయ మిత్రుని విజయ గర్వానికి నేనేమీ అసూయ పడలేదు. సాధారణంగా కర్ణాటక టీమ్, అందునా బెంగాల్ చేతిలో ఓడిపోవడం నాకు ఇష్టం లేదు. పాత ప్రత్యర్థి ముంబై, అంతకంటే పాత ప్రత్యర్థి తమిళనాడు చేతిలో కర్ణాటక ఓడిపోవడాన్ని నేను భరించలేను. అయితే ఒక విషయం నా అసంతృప్తిని బాగా తగ్గించింది. బెంగాల్ టీమ్ మేనేజర్ పిగ్గీలాల్ నాకు సుపరిచితుడు. 1970ల్లో ఆయన నాయకత్వంలో న్యూఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కాలేజీ తరఫున నేను ఆడాను. పిగ్గీ పలు టెస్ట్ మ్యాచ్‌లలో ఆడారు. బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో ప్రతిభావంతుడు. 1974లో ఢిల్లీ తరఫున రంజీ ట్రోఫీలో పిగ్గీ ఆడారు. ఉద్యోగరీత్యా కోల్‌కతాలో స్థిరపడడంతో బెంగాల్ తరఫున ఆడుతున్నారు. అమృత్ లాల్ హోసియె, తులసీచరణ్ లాంగ్ ఫీల్డ్ లాగా ఆయన కూడా సహజీకరణ అయిన బెంగాలీ. 1989–90లో బెంగాల్ రెండో సారి రంజీట్రోఫీని గెలుచుకున్నది. ఆ విజయానికి పిగ్గీలాలే కారకుడు. ఆయన పరుగులు తీస్తున్నప్పుడల్లా స్టేడియంలోని ముప్పై వేల మంది ఆయనకు 'లాల్ సలామ్' చెప్పారు! ఇప్పుడు బెంగాల్లో కమ్యూనిస్టులు అధికారంలో లేరు. రంజీ ట్రోఫీ మ్యాచ్‌లు ఇప్పుడు పెద్దగా జనాలను ఆకర్షించడం లేదు. ఈ ఏడాది రంజీ ఫైనల్ మ్యాచ్ రాజ్‌కోట్‌లో జరిగింది. బెంగాల్ ఓడిపోయింది. అంతిమ విజయం విషయంలో నా మిత్రులు పిగ్గీలాల్, పార్థాలకు ఆశాభంగం కలిగినందుకు నేను బాధపడ్డాను. ఇక సౌరాష్ట్ర ఇంతకు ముందు ఎన్నడూ రంజీ ట్రోఫీని గెలుచుకోలేదు. ఇప్పుడు సౌరాష్ట్ర పేరు కూడా బెంగాల్, కర్ణాటక సరసన నిలుస్తుంది. చివరగా ఒక మాట. ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఇప్పుడు రంజీట్రోఫీ స్థానంలో భారతదేశ ప్రీమియర్ క్రికెట్ టోర్నమెంట్‌గా వున్నది. ఐపిఎల్ అట్టహాసాలు, ఆర్భాటాలు, ఆడంబరాలు ఎలా వున్నప్పటికీ తమ తమ రాష్ట్రాల టీమ్‌ల పట్ల క్రికెట్ అభిమానుల విధేయతలు ప్రగాఢంగా వున్నాయని నేను భావించడం లేదు. రాయల్ ఛాలెంజర్స్ బెంగలూరు, కోల్‌కతా నైట్‌రైడర్స్ జయాపజయాలను అనుసరిస్తున్న ఇద్దరు మిత్రులు ముప్పై, నలభై సంవత్సరాల అనంతరం తమ టీమ్‌ల గురించి వాదించుకుంటారా అనేది సందేహమే.

*(వ్యాసకర్త చరిత్రకారుడు)*

## పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా!



ఎగ్జామ్ టిప్స్

పరీక్షల్లో నెగ్గాలంటే ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలి. అందుకు అనుసరించవలసిన నియమాలు ఇవే!

**స్టడీ స్పేస్:** చదవడానికి కేటాయించే చోటు విశాలంగా ఉండాలి. డెస్క్ మీద పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ కోసం సరిపడా స్థలం ఉండాలి. టేబుల్, కుర్చీలు సౌకర్యంగా ఉండాలి. గదిలోకి గాలి, వెలుతురు ధారళంగా రావాలి. ఎటువంటి అలికిడి లేకుండా చూసుకోవాలి.

**ఫ్లో చార్ట్స్, డయాగ్రమ్స్:** దృశ్యరూపంలోని అంశాలు జ్ఞాపకం పెట్టుకోవడానికి తోడ్పడతాయి. పరీక్షలకు ముందు చదివిన ప్రతి పాఠాన్నీ ఒక డయాగ్రమ్ రూపంలో రాసి పెట్టుకోవాలి. ఇలా చేస్తే ఆ డయాగ్రమ్ గుర్తు చేసుకున్న వెంటనే పాఠం సారం మొత్తం గుర్తుకువచ్చే వీలు ఉంటుంది.

**ప్రశ్నాపత్రాలు:** పరీక్షలకు ముందు గతంలో అవే పరీక్షలకు చెందిన ప్రశ్నాపత్రాలకు సమాధానాలు రాయడం సాధన చేయాలి. ఇలా చేస్తే పరీక్షల గురించిన భయం వదలడంతో పాటు, ప్రశ్నల పట్ల అవగాహనా పెరుగుతుంది.

# అదనపు శక్తి కోసం...

**పరీక్షల వేళ... పిల్లలకు సరైన ఆహారం ఇవ్వాల్సి ఉంటుంది. వారి మెదడు చురుకుగా పనిచేయాలంటే అదనపు శక్తి అవసరం అవుతుంది. రెగ్యులర్ వంటకాలను కాసేపు పక్కన పెట్టి, పోషకాలు అధికంగా ఉండే 'ఎగ్జామ్ ఫుడ్' అందివ్వడం వల్ల పిల్లలు అలసిపోకుండా చదువుతారు. క్యారెట్ అన్నం, ఓట్స్ చాట్, మిల్లెట్ దోశ, పెరుగు శాండ్‌విచ్... ఇవన్నీ కూడా పిల్లల మెదడును చురుగ్గా మారుస్తాయి. ఇవి రుచికరంగా ఉండటమేగాక, వారికి అదనపు శక్తి ని అందిస్తాయి. మరెందుకు ఆలస్యం... మీరూ ట్రై చేయండి!**

వంటిల్లు



## క్యారెట్ అన్నం

**కావలసినవి**

క్యారెట్ తురుము - ఒక కప్పు, బాస్మతి బియ్యం - ఒక కప్పు, సాంబార్ పొడి - ఒకటిన్నర టీస్పూన్, ఉల్లిపాయ - ఒకటి, పసుపు - చిటికెడు, గరంమసాలా - చిటికెడు, కొత్తిమీర - కొద్దిగా, జీలకర్ర - అర టీస్పూన్, నూనె - ఒక టేబుల్‌స్పూన్.

**తయారీ**

- ముందుగా బాస్మతి బియ్యంను శుభ్రంగా కడిగి అన్నం వండుకోవాలి.
- అన్నం ఉడికే సమయంలోనే కొద్దిగా ఉప్పు, ఒక టీస్పూన్ నూనె వేయాలి.
- స్టవ్‌పై పాన్ పెట్టి కాస్త వేడి అయ్యాక జీలకర్ర, ఉల్లిపాయలు వేసి వేగించాలి.
- ఉల్లిపాయలు వేగాక క్యారెట్ తురుము వేయాలి.
- సాంబార్ పొడి, పసుపు, ఉప్పు వేసి కలిపి ఐదు నిమిషాల పాటు చిన్నమంటపై ఉడికించాలి.
- ఇప్పుడు గరంమసాలా వేసి దించాలి.
- వండి పెట్టుకున్న అన్నంలో ఈ మిశ్రమాన్ని కలపాలి.
- కొత్తిమీరతో గార్నిష్ చేస్తే ఎంతో రుచికరంగా ఉంటుంది.

## ఓట్స్ చాట్

**కావలసినవి**

ఓట్స్ - పావు కప్పు, పెరుగు - మూడు టేబుల్‌స్పూన్లు, దానిమ్మగింజలు - ఒక టేబుల్‌స్పూన్, చాట్ మసాలా - పావు టీస్పూన్, జీలకర్రపొడి - అరటీస్పూన్, ఉప్పు - రుచికి తగినంత, కొత్తిమీర - కొద్దిగా, గ్రీన్‌చట్నీ - టీస్పూన్, స్వీట్‌చట్నీ - టీస్పూన్, కారప్పూస - ఒక టేబుల్‌స్పూన్.

**తయారీ**

- స్టవ్‌పై పాన్ పెట్టి ఓట్స్‌ను చిన్నమంటపై వేగించాలి.
- ఒక పాత్రలో పెరుగు, చాట్ మసాలా, జీలకర్రపొడి వేసి కలపాలి.
- స్వీట్ చట్నీ, గ్రీన్ చట్నీ వేసి కలియబెట్టాలి.
- ఇప్పుడు ఈ మిశ్రమాన్ని వేగించిన ఓట్స్‌లో వేసి కలపాలి.
- దానిమ్మ గింజలు, కొత్తిమీర, కారప్పూసతో గార్నిష్ చేసుకొని సర్వ్ చేసుకోవాలి.





## పెరుగు శాండ్‌విచ్

**కావలసినవి**

బ్రెడ్ ముక్కలు - నాలుగు, పెరుగు - పావు కప్పు, క్యాప్సికం - రెండు, ఉల్లిపాయ - ఒకటి, క్యాబేజీ - కొద్దిగా, మిరియాల పొడి - అర టీస్పూన్, వెన్న - టీస్పూన్, కొత్తిమీర - కొద్దిగా, ఎండు మిర్చి - ఒకటి.

**తయారీ**

- పెరుగును ఫ్రిజ్‌లో అరగంట పాటు పెట్టాలి. పెరుగులో నీళ్లు లేకుండా చిక్కగా ఉండేలా చూసుకోవాలి.
- క్యాప్సికం, ఉల్లిపాయ, క్యాబేజీ, కొత్తిమీరను కట్ చేసుకోవాలి. ఎండుమిర్చిని పొడిపొడిగా చేయాలి.
- వాటిని పెరుగులో వేసి కలపాలి.
- బ్రెడ్ ముక్కలు తీసుకుని వెన్న రాయాలి. తరువాత బ్రెడ్‌పై పెరుగు మిశ్రమం వేసి, పైన మరొక బ్రెడ్ పెట్టాలి.
- రుచికరమైన ఈ పెరుగు శాండ్‌విచ్‌ను పిల్లలు ఇష్టంగా తింటారు.

## మిల్లెట్ దోశ

**కావలసినవి**

ఊదలు - అరకప్పు, మినప్పప్పు - నాలుగు టేబుల్‌స్పూన్లు, టొమాటోలు - రెండు, ఎండుమిర్చి - నాలుగు, కందిపప్పు - ఒక టేబుల్‌స్పూన్, ఉప్పు - రుచికి తగినంత, నూనె - సరిపడా.

**తయారీ**

- ఊదలు, మినప్పప్పు, కందిపప్పును శుభ్రంగా కడిగి మూడు గంటల పాటు నానబెట్టాలి.
- తరువాత నీళ్లను తీసేసి, ఎండుమిర్చి వేసి మిక్సీలో గ్రైండ్ చేయాలి.
- టొమాటోలను ముక్కలుగా కట్ చేసి వేసి మరొకసారి గ్రైండ్ చేసి పేస్టులా పట్టుకోవాలి. దోశలు వేసుకునేందుకు అనువుగా పిండి కాస్త పలుచగా ఉండేలా చూసుకోవాలి.
- తగినంత ఉప్పు వేయాలి. ఉల్లిపాయలు కట్ చేసి వేసుకుని కలియబెట్టాలి.
- పెనం స్టవ్‌పై పెట్టి కాస్త వేడి అయ్యాక దోశలు వేయాలి. రెండు వైపులా కాల్చి వేడివేడిగా పిల్లలకు అందించాలి.



ఆహారం - ఆరోగ్యం

# ఎండల నుంచి రక్షణకు...

వేసవి కాలం వచ్చేస్తోంది. ప్రతీ ఏడాది ఎండలు ఎక్కువవుతూనే ఉన్నాయి. ఆరోగ్యపరంగా వేసవికి ఎలా సిద్ధం కావాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

-రజనీ

వేసవికి సిద్ధం కావాలంటే ముఖ్యంగా మూడు విషయాలు గుర్తుంచుకోవాలి.

1. హిమోగ్లోబిన్ శాతం చెక్ చేసుకోవాలి. 10 కన్నా తక్కువ ఉన్నవారు ఎండ వేడిమిని



తట్టుకోవడం కష్టం అవుతుంది.

2. అధిక బరువు ఉన్నవారు కనీసం 3 నుంచి 5 కిలోలు తగ్గాలి. బరువు ఎక్కువ ఉన్నవారిలో అధిక వేడి వల్ల రాషెస్ ఎక్కువగా ఉంటాయి. అలాగే తక్కువ బరువు గలవారు 3 కిలోలు పెరగాలి. లేదంటే వీరికి సమ్మర్‌లో వడదెబ్బ త్వరగా తగిలే అవకాశాలెక్కువ.

3. వేసవికాలం మిగతా దుస్తులు పక్కనపెట్టి, కాటన్ దుస్తులు రెడీ చేసుకోవడం తప్పనిసరి.

**ఇక మిగతా విషయాలకొస్తే...**

- సమ్మర్‌లో అన్నింటికన్నా ముఖ్యం హైడ్రేట్‌గా ఉండటం. బయటకు వెళ్లేప్పుడు నీళ్ల బాటిల్ వెంట తీసుకుని వెళ్లాలి.
- ఉదయం 9 కల్లా ఆఫీస్‌కు వెళ్లడం, సాయంత్రం 5 తర్వాతే బయటకు రావడం చేయాలి. ఈ విధంగా చేస్తే వడదెబ్బ బారిన పడరు.
- ఏసీ గదుల్లోంచి వెంటవెంటనే మారకూడదు. ఏసీ గది నుంచి ముందుగా సాధారణ ఉష్ణోగ్రత ఉన్న గదిలోకి వచ్చి, తర్వాత ఎండలోకి వెళ్లొచ్చు. దీనినే 'క్లయిమటైజేషన్' అంటారు. హఠాత్తుగా ఉష్ణోగ్రతల మార్పు వల్ల రక్తనాళాలు చిట్లే ప్రమాదం ఉంది. అయితే అది మన కంటికి కనిపించదు. కానీ శరీరానికి నష్టం జరుగుతుంది. అదే విధంగా బయటి నుంచి రాగానే వెంటనే చల్లటి నీళ్లు తాగొద్దు. 5 నిమిషాలు ఆగిన తర్వాత తాగాలి.
- ఎండలకు నిమ్మరసం కలిపిన మజ్జిగ దివ్యౌషధంలా పనిచేస్తుంది. మజ్జిగలో ఉన్న కాల్షియం, ఉప్పులో ఉండే సోడియం, నిమ్మరసంలోని పొటాషియం వడదెబ్బ నుంచి రక్షించడమేగాక, శరీరానికి ఉపశమనాన్ని ఇస్తాయి.
- వేసవిలో పండ్లరసాలు, సూప్స్ ఎప్పుడంటే అప్పుడు తీసుకోవచ్చు.




● డాక్టర్ బి.జానకి, న్యూట్రిషనిస్ట్
drjanakibadugu@gmail.com


# కివీ.. ఆరోగ్యప్రదాయని

గుడ్‌ఫుడ్

చూడ్డానికే కాదు రుచిలోనూ వెరైటీగా ఉండే కివీ ఫ్రూట్‌లో ఔషధ గుణాలు బోలెడు. నల్లగింజలు, ఆకుపచ్చ గుజ్జుతో కొంచెం వగరుగా, తీయగా ఉండే ఈ పండు అలసటను పోగొడుతుంది. అంతేకాదు కివీ ఫేస్‌ప్యాక్‌తో చర్మం కాంతులీనుతుంది. ఇతర లాభాలేమంటే...

- ఆరెంజ్, నిమ్మలో కన్నా కివీలోనే విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. రోగనిరోధక శక్తి, ఎముకల దృఢత్వం పెరగడం, గాయాలు తొందరగా నయం కావడంలో విటమిన్ సి తోడ్పడుతుంది.



- కివీ తింటే ఒత్తిడి తగ్గిపోతుంది. ఈ పండులోని ఐరన్ దంతాలు దృఢంగా, కంటి చూపు చురుగ్గా ఉండడంలో సాయపడుతుంది.
- ఇందులోని సి, ఇ విటమిన్లు చర్మాన్ని యవ్వనంగా ఉంచుతాయి. కివీ ముక్కలను ముఖం మీద కాసేపు ఉంచి నీళ్లతో శుభ్రం చేసుకుంటే తాజాగా కనిపిస్తారు.
- నిద్రపోవడానికి గంట ముందు రెండు కివీ పండ్లు తింటే నిద్ర చక్కగా పడుతుంది.
- దీనిలో సహజంగా ఉండే యాక్టినిడిన్ ఎంజైమ్ జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది.
- గర్భిణులు కివీ తింటే సరిపడా ఫోలిక్ ఆమ్లం లభిస్తుంది. బిడ్డ ఆరోగ్యంగా ఎదిగేందుకు ఫోలిక్ ఆమ్లం ఎంతో అవసరం.
- క్యాలరీలు, కొవ్వు తక్కువగా ఉండే ఈ పండును సలాడ్ లేదా ఇతర పండ్లతో స్మూతీగా ఆరగించవచ్చు.



న్యూస్‌మేకర్



# డైనమిక్ లేఖీ!

**మీనాక్షీ లేఖీ... ఢిల్లీ నియోజకవర్గ పార్లమెంట్ సభ్యురాలు. ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా కూడా ఆమె పేరు వినిపించింది. ఇటీవల 'సీఏఏ'పై పార్లమెంట్‌లో లేఖీ స్పందించిన తీరు ఆమెను వార్తల్లో వ్యక్తిగా నిలబెట్టింది. సీఏఏకు వ్యతిరేకంగా జరిగిన నిరసన ప్రదర్శనల వెనుక అంతర్జాతీయ శక్తులు ఉన్నాయంటారామె. 'ది న్యూఢిల్లీ కాన్‌స్పిరసీ' పుస్తక సహరచయిత్రి కూడా అయిన లేఖీ విశేషాలివి...**

కొందరి గురించి తెలుసుకునేటప్పుడు ఎక్కడలేని ఉత్సుకత మనలో కలుగుతుంది. అలాంటి వారే బీజేపీకి చెందిన ఎంపీ మీనాక్షి లేఖీ. ఢిల్లీలోని ఒక మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఆమె చిన్నతనం నుంచే దూకుడు స్వాభావంతో ఉండేవారు. దేశ రాజధానిలోనే ఆమె చదువు సాగింది. హిందూ కళాశాలలో బీఎస్సీ గ్రాడ్యుయేషన్ చేసిన తర్వాత ఢిల్లీ యూనివర్శిటీలో ఎల్ఎల్‌బీ పట్టా తీసుకున్నారు. 1990లో ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో తన పేరు నమోదుచేసుకున్నారు. అప్పుడే సుప్రీంకోర్టులో పనిచేస్తున్న అమన్‌కు మీనాక్షితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఆ తర్వాత వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. మీనాక్షి మామగారు కూడా సుప్రీంకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు.

న్యాయశాస్త్రం నుంచి రాజకీయాల దాకా అన్నింటిలో ఆమె చాలా యాక్టివ్. దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేయడమేగాక పలు ఎన్జీవోలకు న్యాయ సేవలు అందిస్తుంటారు. మీనాక్షి సామాజిక కార్యకర్త కూడా. సోషల్ యాక్టివిస్టుగా ఆమె జాతీయ మహిళా కమిషన్‌తో పాటు నేషనల్ ఇనిస్టిటూట్ ఆఫ్ పబ్లిక్ కో-ఆపరేషన్, చైల్డ్ డెవలప్‌మెంట్, డబ్ల్యుటిఐ, సిఎస్ఆర్‌లతో కలిసి మహిళలు, పిల్లల హక్కుల కోసం పనిచేశారు.

**పనితో పేరు తెచ్చుకున్నా...**

సంఘ్ పరివార్ ఆర్థిక విభాగమైన 'స్వదేశీ జాగరణ మంచ్'లో ఆమె పనిచేశారు. నితిన్ గడ్కరీ బీజేపీ అధ్యక్షుడైన తర్వాత పార్టీ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలిగా ఉండాల్సిందిగా మీనాక్షీ లేఖీని ఆహ్వానించారు. "న్యాయవాదిగా చేస్తూ వివిధ కేసులపై మీడియాతో మాట్లాడాల్సి వచ్చేది. అందుకే చాలామంది పార్టీ నాయకులతో నాకు పరిచయాలున్నాయి. పార్టీ ప్రతినిధిగా నా బాధ్యతలను చక్కగా నిర్వహిస్తున్నానన్న పేరు కూడా తెచ్చుకున్నా. అలా అలా ఈ స్థాయికి రాగలిగా"అని అంటారామె. చిన్నప్పటి నుంచీ మీనాక్షి అన్ని విషయాల్లోనూ చాలా యాక్టివ్‌గా ఉండేవారు. అందరితో కలివిడిగా మాట్లాడేవారు. అన్ని విషయాలూ తెలుసుకోవాలనే ఉత్సుకత ఆమెలో ఎక్కువగా ఉండేది. ఈ లక్షణాలే ఆమెను బలమైన నాయకురాలిని చేశాయి. "ప్రజలతో ఇప్పటికీ మమేకమై తిరుగుతుంటా. వారికి నాపై పూర్తి విశ్వాసం ఉంటుంది. దేశంపై నాకున్న నమ్మకం లాగే, దేశ ప్రజల వివేకంపై కూడా నాకు అంతే విశ్వాసం ఉంది. వాళ్లు నాపై చూపించే నమ్మకం మహోన్నతమైనది" అని అంటారీ ఎంపీ.

2014 కేంద్ర బడ్జెట్‌లో స్టార్టప్స్ కోసం పదివేల కోట్ల రూపాయల నిధుల ప్రకటన వెనుక మీనాక్షీ లేఖీ కీలక పాత్ర పోషించారు. ఈ నిధులను సద్వినియోగం చేయడానికి ఎంటర్‌ప్రెన్యూవల్ ఎకోసిస్టమ్‌కు సంబంధించి ఉత్సాహంగా పనిచేశారు. మీనాక్షి వ్యక్తిత్వంలోని మరో ప్రత్యేకత ఏమిటంటే విలువలకు ఆమె ప్రాణం పెడతారు. "ఆ విలువలే లేకపోతే నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉండేదాన్ని కాదు. పని పరంగా నా మనసు ఏది చెబితే అది చేసుకుపోతా. సత్యం నాకు ముఖ్యం" అని వివరిస్తారామె.

డేరింగ్ మహిళగా మీనాక్షి తీసుకునే నిర్ణయాలకు ఇంట్లో కూడా పూర్తి సహకారం ఉంటుంది. "కెరీర్ పరంగా నా కుటుంబం, భర్త అందించిన సహకారం, తోడ్పాటు ఎంతో ఉంది. వారి ప్రోత్సాహం లేకుంటే నేను ఎంచుకున్న రంగంలో ఇంతగా రాణించేదాన్ని కాదు" అని గర్వంగా చెబుతారు. ప్రధాని మోదీ ఆలోచనలను లేఖీ తు.చ తప్పకుండా అనుసరిస్తారు. ఆయన పట్ల అమితమైన అభిమానాన్ని ప్రదర్శిస్తారు. "రాజకీయాలు, నాయకత్వ విషయంలో నేను ప్రధాని నరేంద్ర మోదీని అనుసరిస్తా. ఎందుకంటే ఆయన నిర్ణయాలు తీసుకునేటప్పుడు నిశ్చితంగా, ఊగిసలాటకు తావులేకుండా వ్యవహరిస్తారు. రాజకీయ నాయకులకు ఈ లక్షణం తప్పకుండా ఉండాలి" అని అభిప్రాయపడతారు.

**స్త్రీల సమస్యలపైనా...**

న్యాయవాదిగా గృహహింస, కుటుంబపరమైన వివాదాలు... ముఖ్యంగా దేశ సైనిక దళాలలో పనిచేసే మహిళల పర్మినెంట్ కమిషనింగ్ కేసుల వంటి వాటిపై లేఖీ బలంగా వాదించారు. అంతేకాదు మహిళా రిజర్వేషన్ బిల్లు, పనిచేసే ప్రదేశాలల్లో మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులు (ప్రివెన్షన్, ప్రొహిబిషన్, రిడ్రెసెల్) బిల్లుల ముసాయిదా తయారీ కమిటీల్లో కూడా ఆమె కీలకంగా వ్యవహరించారు. కేసు ప్రొసీడింగ్ సమయంలో మీడియాను అనుమతించాలని మీడియా తరపున వాదించి గెలిచారు. బీజేపీలోని సమర్థులైన నాయకుల్లో మీనాక్షి ఒకరు. ఇటీవల పౌరసత్వ సవరణ బిల్లు, ఈ నేపథ్యంలో ఢిల్లీలో చెలరేగిన హింసాత్మక సంఘటనలపై కూడా ఆమె తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షాలు కావాలని ప్రజలను రెచ్చగొడుతున్నాయని పార్లమెంటులో ఆమె విమర్శలు కురిపించారు.



**"రాజకీయాలు, నాయకత్వ విషయంలో నేను ప్రధాని నరేంద్ర మోదీని అనుసరిస్తా. ఎందుకంటే ఆయన నిర్ణయాలు తీసుకునేటప్పుడు నిశ్చితంగా, ఊగిసలాటకు తావులేకుండా వ్యవహరిస్తారు. రాజకీయ నాయకులకు ఈ లక్షణం తప్పకుండా ఉండాలి"**

**ముక్కుసూటి మనిషిని...**

మీనాక్షి ఎన్నో ముఖ్యమైన ఫోరమ్స్‌లో పనిచేశారు. 'నేషనల్ కమిషన్ ఫర్ విమెన్ స్పెషల్ కమిటీ'లో ఆమె సభ్యురాలు. మహిళా సాధికారతపై ఏర్పాటు చేసిన ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఛైర్‌పర్సన్ కూడా. సీఏఏ, పేదలకు కనీస వేతనాలు అందించే బిల్లుపై చర్చల్లో ఆమె తనదైన శైలిలో అర్థవంతంగా వాదించారు. భారతదేశంలో ఇంకా కొనసాగుతున్న లింగ వివక్షను లేఖీ తీవ్రంగా విమర్శించారు. ఒక్కమాటలో చెప్పాలంటే 'డైనమిక్ లేడీ మీనాక్షీ లేఖీ' అంటారు ఆమెని బాగా ఎరిగినవారు. పలు మ్యాగజైన్లు, పేపర్లలో కాలమ్స్ రాస్తుంటారు. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధిగా ఆయా ఛానళ్లలో జరిగే చర్చా కార్యక్రమాలలో తనదైన వాదనను బలంగా వినిపిస్తారు. అంతేకాదు వివిధ మంత్రిత్వ శాఖల్లో, ఎన్‌హెచ్ఆర్‌సి, జెండర్ ట్రైనింగ్ కార్యక్రమాలలో మీనాక్షి ప్రసంగాలు ఇస్తుంటారు.

"పని, ప్రజలు, కుటుంబం ఇదే నా ప్రపంచం. ఎక్కడకు వెళ్లినా ఒత్తిడి దరి చేరకుండా ప్రశాంతంగా ఉంటా. ప్రగతిశీల ఆలోచనా ధోరణి, సహజసిద్ధమైన ఉత్సుకతతో కూడిన మెదడు నన్ను ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంచుతాయి. నేను చాలా ముక్కు సూటి మనిషిని. ఈ ప్రవర్తన వల్ల నాకు 'అహంకారం' ఎక్కువ అని పొరబాటు పడిన వాళ్లు కూడా ఉన్నారు. నేను అందరికీ చెప్పేది ఒకటే. మీ కలలను వెంబడించడం ఆపకండి. అదే మీ కోసం మీరు చేసుకోగలిగే గొప్ప పని. అప్పుడు ఏ కష్టం కూడా మీ కలలకు ఆటంకం కాదు. మీ లక్ష్యం నుంచి మీరు వెనక్కి మరలలేరు" అంటున్న మీనాక్షిలోని డైనమిజమే ఆమెను ఈ స్థాయికి తీసుకొచ్చిందని అర్థమవుతుంది.

## టెక్ సందేహాలు

### ఫోన్ రోజూ రీస్టార్ట్ చేయాల్సిందేనా...

**నా దగ్గర కోస్‌లో ఎరా-2 ఫోన్ ఉంది. ఏడాదిన్నరగా జియో సిమ్ వాడుతున్నాను. చాలాసార్లు ఫోన్ కనెక్షన్ పోతోంది. ఎవరైనా కాల్ చేసినా కాల్ కలవదు. ఫోన్ లో సిమ్ లేదని వస్తోంది. సిమ్ వేసినా ఫోన్ రీస్టార్ట్ చెయ్యాలని సూచిస్తోంది.. సిమ్ ఫోన్‌లోనే ఉన్నా దాదాపు ప్రతీ రోజు ఇలా రీస్టార్ట్ చేయాల్సి వస్తోంది. దీనికి పరిష్కారం ఏమిటి?**

**- శోభాదేవి**



ప్రస్తుతం మీరు వాడుతున్న సిమ్ కార్డ్‌లో లేదా మీ ఫోన్‌లో ఉన్న సిమ్ కార్డ్ స్లాట్‌లో సమస్య ఉండి ఉంటుంది. డూప్లికేట్ సిమ్ తీసుకొని, ఆ కొత్త సిమ్ దాంట్లో అమర్చితే దాదాపు సమస్య పరిష్కారం అవుతుంది. చాలా అరుదైన సందర్భాలలో మన ఫోన్‌లో ఉండే సిమ్ కార్డ్ స్లాట్ డ్యామేజ్ అయినప్పుడు కూడా ఇలాంటి పరిస్థితి ఏర్పడుతుంది. అలాంటప్పుడు ఫోన్‌ను సర్వీస్ సెంటర్‌లో ఇవ్వండి. స్లాట్ మార్చడం గానీ, దాన్ని శుభ్రపరచడం గానీ చేసి ఇక మీదట సమస్య రాకుండా చేస్తారు. ఈ రెండూ కాకుండా మీ ఫోన్‌లోని రేడియో చిప్ (ఇది నెట్‌వర్క్ కమ్యూనికేషన్ కోసం ప్రధానంగా ఉపయోగిస్తారు)లో ఇబ్బంది ఉన్నా ఇలాంటి పరిస్థితే ఎదురవుతుంది. అలాంటప్పుడు సర్వీస్ సెంటర్ ద్వారా దాన్ని సరిచేయడానికి కొంత ఖర్చు పెట్టవలసి వస్తుంది.

### ఆ స్టోర్లు సురక్షితమేనా?

**గూగుల్ ప్లే స్టోర్ కాకుండా ఇతర అప్లికేషన్ స్టోర్ల ద్వారా అప్లికేషన్లను డౌన్‌లోడ్ చేసుకోవడం మంచిదేనా?**

**- చక్రవర్తి**

గూగుల్ ప్లే స్టోర్ ఎప్పటికప్పుడు అప్‌లోడ్ అయిన అన్ని అప్లికేషన్లనూ నిశితంగా పరిశీలిస్తుంది. అంతటితో సరిపెట్టుకోకుండా, ఒక యూజర్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ అయి ఉన్న అన్ని అప్లికేషన్లనూ పరిశీలిస్తుంది. ప్రమాదకరమైన అప్లికేషన్స్ ఏవైనా ఉంటే గూగుల్ ప్లే ప్రొటెక్ట్ అనే సదుపాయం ద్వారా వాటి సమాచారం కూడా చూపిస్తుంది. అయితే గూగుల్ ప్లే స్టోర్‌కు భిన్నంగా వేరే అప్లికేషన్ స్టోర్ల నుంచి డౌన్‌లోడ్ చేసినప్పుడు, ప్రమాదకరమైన అప్లికేషన్లను స్కాన్ చేసే మెకానిజం వాటిలో అంత సక్రమంగా ఉండదు. ఈ కారణం వల్ల మనకు తగినంత సెక్యూరిటీ లభించదు. ఈ మధ్య చాలామంది గూగుల్ ప్లే స్టోర్‌ను కాకుండా ఇతర అప్లికేషన్ స్టోర్‌లను ఎంపిక చేసుకుంటున్నారు. ఏది ఏమైనా సాధ్యమైనంతవరకు ఇతర అప్లికేషన్ స్టోర్‌ల జోలికి వెళ్లకపోవడమే మంచిది.




### గూగుల్ క్రోమ్-మరింత వేగంగా...

**గూగుల్ క్రోమ్ బ్రౌజర్ మరింత వేగంగా పని చేయాలంటే ఏమైనా సెట్టింగ్స్ ఉంటే తెలియజేయగలరు?**

**- నిరుపమ్**




గూగుల్ క్రోమ్ బ్రౌజర్ పనితీరు ప్రధానంగా ర్యామ్ మీద ఆధారపడి ఉంటుంది. ఎంత ఎక్కువ ర్యామ్ ఉంటే అంత వేగంగా అది స్పందిస్తుంది. కాబట్టి పెద్ద మొత్తంలో ర్యామ్ ఇన్‌స్టాల్ చేసుకోవడం చాలా అవసరం. దానితో పాటు ఒకసారికి కేవలం పరిమిత మొత్తంలో మాత్రమే టాబ్స్ ఓపెన్ చేసి పెట్టుకోవడం సురక్షితం. టాబ్ సస్పెండర్ లాంటి థర్డ్-పార్టీ ఎక్స్‌టెన్షన్లను ఇన్‌స్టాల్ చేయడం ద్వారా బ్యాక్‌గ్రౌండ్ టాబ్స్ మెమరీని వినియోగించుకోకుండా ఎప్పటికప్పుడు అడ్డుకోవచ్చు. దీనివల్ల కొంతవరకు క్రోమ్ పనితీరు మెరుగుపడుతుంది.

**మీ టెక్ సందేహాలకు సమాధానాల కోసం: navya@andhrajyothy.com**

టెక్ గురు

# లింక్ క్లిక్ చేస్తే అంతే!



మియాపూర్‌కు చెందిన స్నేహ మొబైల్‌కి ఒక మెసేజ్ వచ్చింది. అందులో ఒక లింక్ ఉంటే క్లిక్ చేసింది. ఆ వెంటనే ఫోన్ స్విచాఫ్ అయింది. మళ్లీ ఫోన్ ఆన్ చేసిన స్నేహ ఆ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు. తన పనిలో పడిపోయింది. ఆ తరువాత స్నేహ ఫోన్‌లో ఉన్న డేటా మొత్తం హ్యాకర్ల చేతుల్లోకి వెళ్లింది.

వైజాగ్‌లో ఉండే సౌరభ్ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటాడు. ఓరోజు ఫేస్‌బుక్ పేరుతో వచ్చిన ఓ లింక్‌ను క్లిక్ చేశాడు. వెంటనే ఫేస్‌బుక్ పేజ్ ఓపెన్ అయింది. నిజమైన ఫేస్‌బుక్ పేజే అనుకుని అందులో యూజర్‌నేమ్, పాస్‌వర్డ్ ఎంటర్ చేశాడు. అంతే... అతడి ఫేస్‌బుక్ అకౌంట్ హ్యాకర్ల బారినపడింది.

**ఇలాంటి వార్తలు రోజూ వింటూనే ఉన్నాం. అనవసరమైన లింకులు క్లిక్ చెయ్యొద్దని, మోసపోవద్దని చదువుతూనే ఉన్నాం. అయినా అందరూ పెడచెవిన పెడుతూనే ఉన్నారు. అందుకే థియరిటికల్‌గా కాకుండా లింకులు క్లిక్ చేస్తే ఏమవుతుందో, ఇతర సైబర్ నేరాలు ఎలా జరుగుతాయో డెమోలతో వివరించే ప్రయత్నం చేసింది 'ఆంధ్రజ్యోతి'...**

ఇక్కడ మీరు చూస్తున్నది ఒక మహిళకు సంబంధించిన ఫోటో. రాత్రి 11 గంటల సమయంలో బెడ్ మీద పడుకుని ఫోన్ బ్రౌజ్ చేస్తూ మేము పంపించిన లింక్ క్లిక్ చేసింది. వెంటనే ఆమెకు తెలియకుండా, కనీసం స్క్రీన్ మీద



ఎలాంటి ప్రివ్యూ కనిపించకుండా ఆమె ఫొటో ఇలా వచ్చింది. (ఆమె ప్రైవసీని కాపాడటం కోసం ఫొటోని బ్లర్ చేశాం). మీరు ఫొటో చూస్తే ఆమె లింకు క్లిక్ చేసిన విషయం, ఫొటో రిసీవ్ అయిన విషయం కూడా టెర్మినల్‌లో అప్‌డేట్ అవడం గమనించవచ్చు. ఈ పద్ధతి ద్వారా కేవలం ఫొటోలు మాత్రమే కాదు, వీడియో కూడా లైవ్‌గా మీకు తెలియకుండానే చూడొచ్చు. కాబట్టి ప్రత్యేకంగా మహిళలు ఇలాంటి లింకుల విషయాల్లో చాలా అప్రమత్తంగా ఉండాలి.

## పాస్‌వర్డ్‌ల ఎంపిక



చాలామంది తమ భార్య లేదా ప్రేయసిని 'బంగారం' అని పిలుస్తుంటారు. అంతటితో సరిపెట్టుకుంటే బానే ఉంటుంది. అలా కాకుండా జీమెయిల్ వంటి వాటికి పాస్‌వర్డ్ కూడా ఆ పేర్లనే పెట్టుకుంటారు. బంగారం, వజ్రం, పవన్ కల్యాణ్, తెలంగాణ, శ్రీనివాస్, రాము, కుమార్ వంటి పేర్లని పెట్టుకుంటే సులభంగా గుర్తిస్తారు. వివిధ సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో మీ యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌తో సహా ఈ ఫోటోలో చూస్తున్న విధంగా తెలుసుకోవచ్చు. ఇక్కడ 'బంగారం' అనే పాస్‌వర్డ్ పెట్టుకున్న అనేక మంది మెయిల్ ఐడిలతో సహా నేను తెలుసుకున్న విషయం మీరు గమనించవచ్చు. (ప్రైవసీ కోసం వాటిని బ్లర్ చేశాం) కాబట్టి ఇకమీదట సులభమైన పాస్‌వర్డ్‌లను పెట్టుకోవడం మానేయండి.

## అకౌంట్లన్నీ హ్యాక్

ఫేస్‌బుక్, ట్విట్టర్, గూగుల్, ఇన్‌స్టాగ్రామ్ వంటి అకౌంట్లను హ్యాక్ చేయడం చాలా సులభం. ఇక్కడ ఫోటోలో కనిపిస్తున్న సోషల్ నెట్ వర్కింగ్ సైట్ ఎంపిక చేసుకుంటే చాలు. ఒక ఫిషింగ్ పేజ్ సిద్ధమవుతుంది. ఆ లింకుని బాధితులు క్లిక్ చేసి యూజర్‌నేమ్, పాస్‌వర్డ్ ఎంటర్ చేయగానే వెంటనే ఆ సమాచారం హ్యాకర్ స్క్రీన్ మీద కనిపిస్తుంది. ఇక్కడ డెమో కోసం చేసిన యూజర్ నేమ్, పాస్‌వర్డ్ మీరు చూడొచ్చు. ప్రపంచ వ్యాప్తంగా 70 శాతం



సైబర్ నేరాలు ఫిషింగ్ ఎటాక్‌ల ద్వారానే జరుగుతూ ఉంటాయి. కాబట్టి అప్రమత్తంగా ఉండండి. ఇలాంటి ఎటాక్‌ల ద్వారా మీ డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, యూజర్‌నేమ్, పాస్‌వర్డ్‌లను తస్కరిస్తుంటారు.

## ఫోటో డౌన్‌లోడ్ చేస్తే..!

చాలామంది ఇంటర్నెట్‌లో వివిధ వెబ్ సైట్లలో ఉండే ఫోటోలు ఇష్టానుసారం డౌన్‌లోడ్ చేసుకుంటూ ఉంటారు. అయితే హ్యాకర్లు ఫోటోల్లో కూడా స్పైవేర్లు పొందుపరుస్తారన్న విషయం అతి కొద్ది

```
Select an option:

    [*] (gen)     Generate a malicious BMP image
    [*] (web)     Start a web server and deliver malicious image
    [*] (ps)      Generate Powershell payload
    [*] (sc)      Generate shellcode from raw file
    [*] (exit)    Quit the application

>>>
```

మందికి మాత్రమే తెలుసు. ఇక్కడ మీరు చూస్తే ఒక ఫోటోలో స్పైవేర్ నిక్షిప్తం చేయడంతోపాటు, అప్పటికప్పుడు ఒక వెబ్ సర్వర్ సృష్టించి, దానిని ఇతరులకు షేర్ చేయడం ద్వారా వారిని ప్రమాదంలో పడే విధంగా చేయవచ్చు.

## ఫేస్‌బుక్ ఫోన్ నెంబర్లు



ఫేస్‌బుక్‌లో చాలామంది తమ ఫోన్ నెంబర్లు పెడుతూ ఉంటారు. ఇక్కడ మీరు చూస్తే గనుక భారీ మొత్తంలో ఫేస్‌బుక్ యూజర్ల ఫోన్ నెంబర్లని వారికి తెలియకుండా ఒకదాని తర్వాత మరొకటి సేకరించడం జరుగుతోంది. వారు ఫోన్ నెంబర్‌ని ప్రైవేట్‌గా పెట్టుకున్నప్పటికీ కూడా కొన్ని పద్ధతులను ఉపయోగించి హ్యాకర్లు తెలుసుకుంటూ ఉంటారు. ఫేస్‌బుక్‌లో ఫోన్ నెంబర్ పెట్టడం ఎంతవరకు సురక్షితమో ఈపాటికి మీకు అర్థమయ్యే ఉంటుంది. ఒక యూజర్ ఐడీ ఎంటర్ చేస్తే చాలు, ఆ వ్యక్తికి సంబంధించిన పూర్తి వివరాలను కూడా సేకరించవచ్చు. కాబట్టి సోషల్ మీడియా సురక్షితం అని భావించకండి.

## రియల్ టైమ్ లొకేషన్

ఇంతకు ముందు చెప్పుకున్న విధంగానే, మీకు రకరకాల కబుర్లు చెప్పి ఒక లింకు పంపించి, మీ చేత క్లిక్ చేయిస్తే చాలు. ప్రస్తుతం మీరు ఎక్కడ ఉన్నారో తెలుసుకోవచ్చు. అంతేకాదు మీరు ఎటువైపు ప్రయాణిస్తున్నారో రియల్ టైం లొకేషన్ కూడా అప్‌డేట్ అవుతూ



ఉంటుంది. ఒక లింకు క్లిక్ చేస్తే ఏమవుతుందిలే అనే ధీమాలో ఉండేవారు ఈ విషయాన్ని తప్పనిసరిగా గుర్తుపెట్టుకోవాలి.

ఇప్పటివరకు ఎక్కడా హ్యాకింగ్ గురించి ఇలా ప్రాక్టికల్‌గా ఎవరూ వివరించలేదు. పాఠకులకు సైబర్ మోసాల గురించి మరింత స్పష్టంగా అర్థమయ్యేలా చెప్పే ప్రయత్నాన్ని 'ఆంధ్రజ్యోతి' చేసింది. కాబట్టి ఇకమీదట మరింత జాగ్రత్తగా వ్యవహరించండి.

## ఫోన్ మొత్తం హ్యాక్

ఇక్కడ మీరు చూస్తున్నది ఒక ఫోన్ మొత్తాన్ని హ్యాక్ చేసి దానికి వచ్చిన ఎస్ఎంఎస్ మెసేజ్‌లను డంప్ చేసుకుని



చూడడం! 2019లో ఇలా నా ఫోన్‌ను నేనే హ్యాక్ చేసుకుని డంప్ చేసుకున్న స్క్రీన్ షాట్ మీరు చూస్తున్నారు. మీరు చేసే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, వాట్సప్ మెసేజ్‌లు, ఫోన్లో కెమెరాలు, మైక్రోఫోన్లు, లొకేషన్, ఫోన్లో ఉండే ఫోటోలు, వీడియోలు, పాస్‌వర్డ్‌లు అన్నీ ఈ పద్ధతి ద్వారా హ్యాక్ చేస్తారు.

## ఒకటే యూజర్‌నేమ్ వాడితే...

సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో అకౌంట్ క్రియేట్ చేసుకునేటప్పుడు, అన్ని చోట్లా ఒకటే యూజర్ నేమ్‌వాడుతూ ఉంటారు. ఇది చాలా ప్రమాదకరం.



మీ ఒక అకౌంట్ పేరు తెలిస్తే చాలు, దాన్ని ఆధారంగా చేసుకుని ఇంకా ఏయే సర్వీసులలో అదే పేరుతో మీకు అకౌంట్ ఉందో తెలుసుకోవచ్చు. ఒకవేళ మీరు ఒకటే పాస్‌వర్డ్ అన్ని చోట్లా పెట్టినట్లయితే, మీ డిజిటల్ ప్రపంచాన్ని మొత్తంగా కొల్లగొట్టే అవకాశం హ్యాకర్‌కి కలుగుతుంది. ఇక్కడ నేను శ్రీనివాస్ అనే ఒక వ్యక్తి ఏ సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో అకౌంట్ కలిగి ఉన్నాడో వెతికి క్షణాల్లో ఫలితాలు పొందిన విషయం మీరు చూడొచ్చు.

*(గమనిక: డెమోల కోసం కొంతమంది వ్యక్తిగత సమాచారం, ఫొటోలను వారి డివైజ్‌లని హ్యాక్ చేసి సేకరించటం జరిగింది. ఇది పూర్తిగా వారి అనుమతితో సేకరించిన సమాచారం. ప్రజలను అప్రమత్తం చేయడం కోసం ఈ డెమోలను అందించాం.)*



**నల్లమోతు శ్రీధర్**
fb.com/nallamothusridhar

వినూత్నం

# కామిక్ భల్లే... భల్లే...

**చిన్ననాటి జ్ఞాపకాలను ఒక్కసారైనా తలచుకుని మురిసిపోనివారుండరు. బాల్యాన్ని మళ్లీ చూసుకునే రోజు వస్తే బాగుంటుంది అనుకునేవారు చాలామందే. ఢిల్లీకి చెందిన కామిక్ ఆర్టిస్ట్ దశ్మీత్ సింగ్ తన కామిక్ చిత్రాల ద్వారా సిక్ కమ్యూనిటీ ప్రజల బాల్యపు గురుతుల్ని మళ్లీ గుర్తుచేస్తున్నారు. తన బొమ్మల ద్వారా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న ఈ చిత్రకారుడి విశేషాలు...**



మన చిన్నతనంలో అమ్మమ్మో, నానమ్మో తలకు నూనె రాసి, దువ్వడం, అలిగితే ముద్దుచేయడం మనందరికి జ్ఞాపకమే. అలానే తల్లితండ్రులు, తాతయ్యలు ఉయ్యాల మాదిరిగా మారి పిల్లల్ని ఊరడించడం ఇప్పటికి పంజాబ్‌లో చిన్నపిల్లలున్న ఇంట్లో కనిపించేదే. అక్కడి పిల్లలు 'జూటీ మియా' అంటూ పాటలు పాడుకుంటూ ఆడుకుంటారు. ఈ మధుర స్మృతులను కామిక్‌లుగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తున్నారు దశ్మీత్ సింగ్.



**పెయింటింగ్ మీద వ్యాపకంతో**

"ఆర్టిస్ట్ శరణ్‌దీప్ సింగ్ గీసిన చిత్రాలను ఫేస్‌బుక్‌లో చూసి, ఆయన స్ఫూర్తితో పదకొండో తరగతిలో ఉన్నప్పటి నుంచే బొమ్మలు గీసేవాణ్ణి. నా ఆలోచనల్ని అందమైన బొమ్మలుగా వేయడం చూసి నాకే ఆశ్చర్యం వేసేది. ప్లస్‌టూ తరువాత మెడికల్ సైన్సెస్‌లో చేరాను. కానీ బొమ్మలేసే అలవాటు మాత్రం మానలేదు. ఖాళీ సమయంలో స్కెచ్‌లు, పెయింటింగ్స్ చక్కగా వేయడం నేర్చుకునేందుకు యూట్యూబ్ ట్యుటోరియల్స్ చూసేవాణ్ణి. అంతేకాదు ఫైన్‌ఆర్ట్స్ చేసిన మా అమ్మను పెయింటింగ్ బేసిక్స్ చెప్పమని అడిగేవాణ్ణి. చిత్రలేఖనం మీది వ్యాపకంతో చదువులో మార్కులు తక్కువగా వచ్చేవి. మెడికల్ సైన్స్ నాకు సరిపోదనిపించింది. దాంతో ఆ కోర్సు వదిలేసి 'గురు తేజ్ బహదూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'లో చేరాను. అదేసమయంలో 'అకల్ నెట్‌వర్క్' అనే ఎన్జీవోతో పని చేసే అవకాశం వచ్చింది. వారి కోసం కొన్ని డిజిటల్ పెయింటింగ్స్ వేసి ఇచ్చాను. అలానే సిక్కు కమ్యూనిటీ కథల మీద చాలా బొమ్మలు వేశాను. నా జీవితంలో ఏ రోజుకారోజు జరిగిన సంఘటనల్ని బొమ్మలుగా వేయడం నాకు అలవాటు. అయితే ఎక్కువ బొమ్మలు వేయడం సాధ్యమయ్యేది కాదు. దాంతో రఫ్‌గా స్కెచ్‌లు వేసేవాణ్ణి. పెయింటింగ్స్‌లో వేగం పెంచుకునేందుకు మెట్రోలో వెళ్లే వారిని, ఎవరి పనుల్లో వారున్న జనాల చిత్రాలు గీసేవాణ్ణి.



**సిక్కు పెద్దలు ప్రశంసించారు**

"నా కామిక్స్ చూసి సిక్కు పెద్దలు, ఇతర మతాల వాళ్లు కూడా నన్ను అభినందించారు. ఎవరైనా నా కామిక్స్‌ను షేర్ చేసి 'ఇది నేనే' అని చెప్పడం నాకు ఎంతో సంతోషాన్నిస్తుంది. 'మాకు ఇబ్బందిగా గడిచిన రోజున మీ కామిక్స్ చూసి నవ్వుతూ బాధల్ని మరిచిపోతున్నాం' అని చాలామంది నాకు సందేశాలు పంపిస్తుంటే చెప్పలేనంత ఆనందం వేస్తుంది."

**తమను తాము చూసుకునేలా**

ఒకసారి ఇన్‌స్టాగ్రామ్‌లో అలీసియా సౌజా గీసిన బొమ్మలు చూశా. ఆమె తన జీవితం గురించి కామిక్స్ రూపంలో ఇన్‌స్టాగ్రామ్‌లో చెబుతుంది. నేనూ అలా చేయాలనుకున్నా. నేను మొహమాటస్తుడిని. నా విషయాల్ని ఇతరులతో పంచుకోవడం ఇష్టం ఉండదు. అప్పుడే అందరి జీవితంలో రోజూ జరిగే సంఘటనల్ని కామిక్స్‌గా మలచాలన్న ఆలోచన వచ్చింది. వాటిని మొదటిసారి చూసిన వాళ్లు 'అది నేనే' అని తమను తాము పోల్చుకుంటారు. నేను ఎక్కువగా ఊహాత్మక, జీవిత వాస్తవాలనే కామిక్స్‌గా వేస్తా" అని చెబుతాడీ ఆర్టిస్ట్.

## లిటిల్స్

### జత ఉన్న బొమ్మ ఏది?




జవాబు: 3

### దారి కనుక్కోండి



### జతపరచండి

cheetah
deer
rhino
hippo
lion



### చుక్కలు కలిపి రంగులు వేయండి



### డైలీ సుడోకు -307

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | 8 | | 3 | | 4 | 9 |
| | | | | 9 | 6 | | 1 | 8 |
| | 9 | | | | | 2 | | 3 |
| | | | 3 | | 2 | 1 | 7 | |
| | 2 | 5 | 7 | | 8 | | | |
| 9 | | 7 | | | | | 6 | |
| 5 | 1 | | 6 | 8 | | | | |
| 2 | 4 | | 9 | | 7 | | | |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

**సుడోకు - 306 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 5 | 6 | 7 | 4 | 2 | 3 | 8 | 9 |
| 4 | 9 | 8 | 1 | 3 | 6 | 7 | 2 | 5 |
| 3 | 2 | 7 | 5 | 9 | 8 | 4 | 1 | 6 |
| 6 | 3 | 1 | 9 | 2 | 4 | 5 | 7 | 8 |
| 5 | 4 | 9 | 8 | 7 | 1 | 6 | 3 | 2 |
| 7 | 8 | 2 | 3 | 6 | 5 | 1 | 9 | 4 |
| 9 | 1 | 5 | 6 | 8 | 3 | 2 | 4 | 7 |
| 8 | 6 | 4 | 2 | 1 | 7 | 9 | 5 | 3 |
| 2 | 7 | 3 | 4 | 5 | 9 | 8 | 6 | 1 |



చిరంజీవి సినిమా నుంచి

## అభిప్రాయ భేదాలతో తప్పుకున్న త్రిష

"కొన్ని సందర్భాల్లో అనుకున్నవన్నీ జరగవు. ఊహించని మలుపులు ఎదురవుతాయి" అని అంటున్నారు త్రిష. చిరంజీవి హీరోగా కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న 'ఆచార్య' సినిమాలో చిరుకి జోడీగా త్రిషను ఎంపిక చేసిన సంగతి తెలిసిందే! అయితే ఇప్పుడామె ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారు. ఈ విషయాన్ని ఆమే ట్విట్టర్ వేదికగా తెలిపారు. "ముందు చెప్పినవి, చర్చించినవి జరగడం లేదు. ఇలాంటి క్రియేటివ్ ప్రాబ్లమ్స్ వల్ల చిరంజీవి సర్ సినిమాలో భాగం కాలేకపోతున్నా. టీమ్‌కి ఆల్ ద బెస్ట్. ప్రియమైన తెలుగు ఆడియన్స్ కోసం త్వరలోనే ఓ క్రేజీ ప్రాజెక్ట్‌తో మీ ముందుకొస్తా" అని త్రిష ట్విట్టర్‌లో రాసుకొచ్చారు. గతంలో విక్రమ్ హీరోగా నటించిన 'సామి 2' సినిమా మొదట అంగీకరించి, కీర్తి సురేశ్ మరో నాయికగా నటిస్తున్నారని త్రిష ఆ సినిమా వదులుకున్నారు. 'ఖైదీ నం.150'లో చిరంజీవి సరసన నటించిన కాజల్ 'ఆచార్య' సినిమాలో నటించే ఛాన్స్ ఉందని ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది.

# అనుష్క జన్మ ధన్యం

- కె.రాఘవేంద్రరావు



కోన వెంకట్, ఛార్మి, పూరి జగన్నాథ్, అనుష్క, రాజమౌళి, విశ్వప్రసాద్, అంజలి

"ప్రయత్నిస్తే ఎవరికైనా సినిమా అవకాశాలు దొరుకుతాయి కానీ, అనుష్క విషయంలో అలా కాదు. ఆమెని వెదుక్కుంటూ పాత్రలు వెళ్లాయి. ఈ తరం కథానాయికల్లో ఎవరికీ ఈ అదృష్టం దొరకలేదు" అని కె.రాఘవేంద్రరావు అన్నారు. అగ్ర కథానాయిక అనుష్క తెలుగు పరిశ్రమలో అడుగుపెట్టి 15 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం 'నిశ్శబ్దం' చిత్రబృందం ప్రత్యేక వేడుకని నిర్వహించింది. కె.రాఘవేంద్రరావు, రాజమౌళి సహా అనుష్కతో సినిమాలు చేసిన దర్శకులు, నిర్మాతలు అతిథులుగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కె.రాఘవేంద్రరావు మాట్లాడుతూ "'శ్రీరామదాసు' తీస్తున్న సమయంలో నాగార్జున అనుష్కని పరిచయం చేశారు. స్వీటీ అని పిలవగానే మెట్లు ఎక్కుతూ వచ్చింది. ఆ రోజే 'నువ్వు దక్షిణాదిలో టాప్ హీరోయిన్ అవుతావని చెప్పా. తొలి సినిమాతోనే 'సూపర్' అనిపించింది. కథానాయికగా ఆమె బంగారు మెట్లెక్కింది. నన్ను అందరూ మౌనముని అని పిలిచేవారు. 'నిశ్శబ్దం' సినిమాతో అనుష్క మౌనముని కన్యక అవుతుంది. అన్ని చోట్లా అభిమానుల్ని సంపాదించుకున్న అనుష్క జన్మ ధన్యం" అని అన్నారు. శ్యామ్‌ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ "అనుష్క జీవితాన్ని మార్చేసింది 'అరుంధతీ' సినిమా అని అంటారు. నా జీవితాన్ని మార్చేసిన కథానాయిక తను. ఆరు నెలల క్రితం నేను జార్జియాకి వెళ్లా. అక్కడ రష్యాకు చెందిన జాజా అనే వ్యక్తి నాకు గైడ్‌గా ఉన్నాడు. మేం హైదరాబాద్ నుంచి వచ్చామని తెలియగానే అతడు స్వీటీ తెలుసా? అని అడిగాడు. తన కోసం అనుష్క ఏం చేసిందో చెప్పాడు. ఓ షూటింగ్ కోసం జార్జియా వెళ్లినప్పుడు అనుష్కకి కార్ డ్రైవర్‌గా జాజా ఉన్నాడట. అయితే ఒక రోజు జాజా కాకుండా, మరో వ్యక్తి కారు తీసుకొచ్చాడట. ఎందుకు రాలేదని ఆరా తీస్తే అతని కారు ఫైనాన్స్ వాళ్లు తీసుకెళ్లారని తెలియడంతో అనుష్క జాజాని పిలిపించి స్వయంగా తీసుకెళ్లి కారు కొనిచ్చిందట. ఇలాంటి మంచి మనసు ఎంతమందికి ఉంటుంది" అని అన్నారు. ఎస్.ఎస్.రాజమౌళి మాట్లాడుతూ "'విక్రమార్కుడు' సినిమాతో అనుష్క నా కుటుంబ స్నేహితురాలు అయిపోయింది. ఆ సినిమా చేస్తున్నప్పుడు ప్రతి సన్నివేశాన్నీ చేసి చూపించమని అడిగేది. కొన్ని సన్నివేశాలు తనకి తను మార్చుకుని చేసేది. 'బాహుబలి'లో అనుష్క పోషించిన దేవసేన పాత్ర విషయంలో ఇప్పటికీ గర్వపడతా. ఆమె నటి మాత్రమే కాదు, మంచి మనసున్న అమ్మాయి. నా హృదయంలో ఆమెకు ప్రత్యేకమైన స్థానం ఉంటుంది" అన్నారు. "ప్రతి ఒక్కరూ నా పదిహేనేళ్ల కెరీర్ గురించి మాట్లాడుతున్నారు. నా ముందు ఎంతోమంది సీనియర్ నాయికలు ఉన్నారు. వారితో పోల్చితే నేను చేరుకున్న లక్ష్యం, సాధించింది ఘనత చాలా తక్కువ. దీన్ని నేనొక బాధ్యతగా తీసుకుని మరింత శ్రమిస్తా. 'సూపర్' నుంచి 'నిశ్శబ్దం' వరకు నాకు సహకరించిన దర్శకులు, నటులు, సాంకేతిక నిపుణులను ఎప్పటికీ మరచిపోలేను. ఏప్రిల్ 2న వస్తున్న 'నిశ్శబ్దం' నా గత చిత్రాల్లానే అలరిస్తుంది" అని అనుష్క అన్నారు. "మంచితనం, తెలివితేటలు కలగలిసిన అమ్మాయి అనుష్క. ఆమె అసలు పేరు స్వీటీ శెట్టి. పాస్‌పోర్ట్‌లో కూడా అలాగే ఉంటుంది. 'సూపర్' సినిమా సెట్‌లో ఆమెకు అనుష్క అని నామకరణం చేశాం. రవితేజ, ఛార్మి, నేను అనుష్కను అమ్మా అని పిలుస్తాం. కలిసినప్పుడల్లా ఆమె కాళ్లకు నమస్కారం చేసి ఆశీర్వాదం తీసుకుంటాం. తన నుంచి నేర్చుకోవలసింది చాలా ఉంది" అని పూరి జగన్నాథ్ అన్నారు. అన్నారు. "మనిషిని మనిషిలా మంచిగా చూడటం అనుష్కలో ఉన్న గొప్ప గుణం. ఎలాంటి పాత్రకైనా జీవం పోయగలదు" అని వైవీఎస్ చౌదరి చెప్పారు. "ఎంత తెలిసినా, సాధించినా తనకు ఏమీ తెలియనట్లుగా వ్యవహరించే గుణం అనుష్కది. 'నిశ్శబ్దం' కోసం చాలా కష్టపడింది" అని కోన వెంకట్ అన్నారు.



రవితేజ

వక్కంతం వంశీ

## కాంబినేషన్ కుదిరింది

ప్రస్తుతం 'క్రాక్' సినిమాతో బిజీగా ఉన్న రవితేజ మరో సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. పలు చిత్రాలకు రచయితగా పనిచేసి, 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' సినిమాతో దర్శకుడిగా మారిన వక్కంతం వంశీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారు. రవితేజ ఎనర్జీకి సరిపడ కథను వంశీ సిద్ధం చేశారట. పూర్తిస్థాయి మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ఉండబోతోందని సమాచారం. నిర్మాత, కథానాయిక వివరాలు త్వరలో వెల్లడిస్తారు.

## ఇండస్ట్రీకి ఓపెన్ ఛాలెంజ్

- రంగోలీ చందేల్



కంగనా రనౌత్, రంగోలీ చందేల్

కంగనా రనౌత్‌కు సంబంధించిన ప్రతి విషయంలోనూ తన సోదరి రంగోలీ చందేల్ తనదైన శైలిలో స్పందిస్తుంటారు. కంగనాను ఎవరైనా విమర్శిస్తే చాలు సోషల్ మీడియా వేదికగా తన మాటల తూటాలు విసురుతుంటారామె! తాజాగా రంగోలీ.. బాలీవుడ్ ఇండస్ట్రీకి ఛాలెంజ్ విసిరారు. "ఇండస్ట్రీకి నా ఓపెన్ ఛాలెంజ్. కంగనా కాకుండా ఈ జనరేషన్ కథానాయిక ఎవరైనా రూ.60-70, 80-100 కోట్ల భారీ బడ్జెట్‌ను భుజాన వేసుకుని, కథానాయిక ప్రాధాన్యమున్న చిత్రంలో నటించి బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోగలరా? అలాంటి నటి పేరు ఒకటి చెప్పినా కంగనా నటనకు స్వస్తి పలికి, సినిమాలకు దూరంగా ఉంటుంది" అని రంగోలీ ట్వీట్ చేశారు. ఈ ఏడాది 'పంగా' సినిమాతో విజయం అందుకున్న కంగనా ప్రస్తుతం 'తలైవి' సినిమాలో నటిస్తున్నారు.

## రిలీజ్ ఫిక్స్



యశ్

యశ్ హీరోగా 'కె.జి.యఫ్ చాప్టర్ 1'కి కొనసాగింపుగా 'కె.జి.యఫ్ చాప్టర్ 2' రూపొందుతోన్న సంగతి తెలిసిందే. ప్రశాంత్ నీల్ దర్శకుడు. శ్రీనిధి శెట్టి కథానాయిక. సంజయ్ దత్, నవీనా టాండన్ కీలక పాత్రధారులు. కైకాల సత్యనారాయణ సమర్పణలో విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని వారాహి చలన చిత్రం అధినేత సాయికొర్రపాటి తెలుగులో విడుదల చేస్తున్నారు. నిర్మాత మాట్లాడుతూ "అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, దసరా సందర్భంగా అక్టోబర్ 23న ప్రపంచ వ్యాప్తంగా సినిమాను విడుదల చేస్తున్నాం" అని తెలిపారు.

## కళాతపస్వి ఆశీస్సులు



విశ్వనాథ్, శివనాగు

సీనియర్ నటి అన్నపూర్ణమ్మ ప్రధాన పాత్ర పోషించిన 'అన్నపూర్ణమ్మగారి మనవడు' చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. నర్రా శివనాగేశ్వరరావు(శివనాగు) దర్శకత్వంలో ఎమ్మెన్నార్ చౌదరి ఈ చిత్రాన్ని నిర్మించారు. మాస్టర్ రవితేజ మనవడిగా నటించాడు. కళాతపస్వి కె.విశ్వనాథ్ అంటే తనకున్న ప్రత్యేక అభిమానం కారణంగా దర్శకుడు శివనాగు ఆయన్ని కలిసి ఆశీస్సులు అందుకొన్నారు. ఈ సందర్భంగా 'అన్నపూర్ణమ్మగారి మనవడు' చిత్రం పోస్టర్స్ తిలకించిన కె.విశ్వనాథ్ చిత్రవిశేషాలను అడిగి తెలుసుకొన్నారు. పల్లెటూరి వాతావరణాన్ని ప్రతిబింబించే ఈ చిత్రం విజయవంతం కావాలని విశ్వనాథ్ ఆకాంక్షించారు. ఈ సినిమా షూటింగ్ అమరావతి పరిసర ప్రాంతాల్లో జరిగిందని శివనాగు చెప్పగానే ఒకప్పుడు అక్కడ తను 'సప్తపది' చిత్రం షూటింగ్ చేసినట్లు విశ్వనాథ్ గుర్తు చేసుకొన్నారు.

## జరగబోయేది ఎవరికీ తెలియదు!



కరోన్య కత్రిన్

మహేంద్రన్, శ్రీ పల్లవి, కారుణ్య చౌదరి, కరోన్య కత్రిన్ నటీనటులుగా శ్రీనివాస్ బండారి దర్శకత్వం వహించిన చిత్రం 'అసలు ఏం జరిగిందంటే'. అనిల్ బొద్దిరెడ్డి నిర్మాత. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయిన ఈ చిత్రం గురించి దర్శకుడు మాట్లాడుతూ "'జీవితంలో జరిగిపోయింది తప్ప.. జరగబోయేది ఎవరికీ తెలియదు. కాలంతో పరిగెత్తడం తప్ప.. అంతకుమించి మనం ఏమీ చేయలేం' అన్న ఇతివృత్తంతో వస్తున్న సినిమా ఇది. సినిమాలో ప్రతి పాత్రకు ప్రాధాన్యం ఉంటుంది. చరణ్ అర్జున్ సంగీతంలో 6 పాటలు అలరిస్తాయి" అని అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "సెన్సార్ పూర్తి చేసుకుని క్లీన్ 'యు' సర్టిఫికెట్ వచ్చింది. ఈ నెల 20న సినిమాను విడుదల చేస్తున్నాం" అని తెలిపారు.

## సరదాగా సాగే ప్రేమకథ



రోహిత్, కైషా రావత్

రోహిత్, కైషా రావత్ జంటగా నాగేందర్.టి దర్శకత్వం వహించిన 'విఠల్ వాడి' చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొని ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. యథార్థ సంఘటనల ఆధారంగా జి.నరేశ్‌రెడ్డి రెడ్డి నిర్మించిన చిత్రమిది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "సరదాగా సాగే ప్రేమకథ ఇది. చక్కని వినోదాన్ని పంచుతుంది. హీరోహీరోయిన్ల మధ్య కెమిస్ట్రీ, పాటలు, కెమెరా పనితనం సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయి" అని తెలిపారు. కుటుంబమంతా కలిసి చూసే సినిమా ఇదని నిర్మాత చెప్పారు.

## ప్రేమలు-పెళ్లిళ్లు



మహీ రాథోడ్, మోనా ఠాగూర్

మహీ రాథోడ్ హీరోగా నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం '1992'. మోనా ఠాగూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం టైటిల్ లోగో, ఫస్ట్ సింగిల్‌ను నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేశారు. ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్న శివ పాలమూరి మాట్లాడుతూ 'ప్రస్తుత సమాజంలో ప్రేమ, పెళ్లిళ్లు ఎలా తయారయ్యాయో చూపించే ప్రయత్నం చేస్తున్నాం. అమాయకుడైన ఓ యువకుడు ప్రేమించి, పెళ్లి చేసుకొని ఆ తర్వాత ఎలాంటి ఇబ్బందులు పడ్డాడన్నది చిత్రకథాంశం. సినిమా చివరి షెడ్యూల్ జరుగుతోంది. వేసవిలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని తెలిపారు.













| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 1325.34 ↑ | 365.05 ↑ | 1,357 ↓ | 2,255 ↓ | (48 పైసలు) ↑ | ↑ |
| 34,103.48 | 9,955.20 | 42,017 | 43,085 | 73.80 | 35.28 |
| | | ముంబై 10 గ్రాములు (99.9 శాతం స్వచ్ఛత) | | | |

రూ.5 కోట్ల లోపు

# ఐటీ వివాదాలకు విముక్తి!

## వివాద్ సే విశ్వాస్‌కు పార్లమెంట్ ఆమోదం

## మోసగాళ్లకు వర్తించదు : నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పన్ను వివాదాలు ఎదుర్కొంటున్న వారు ఎలాంటి పెనాల్టీ, అపరాధ వడ్డీ లేకుండా బకాయి మొత్తం చెల్లించి కేసుల నుంచి బయటపడేందుకు వీలు కల్పించే 'వివాద్ సే విశ్వాస్' బిల్లును రాజ్యసభ శుక్రవారం ఆమోదించింది. ఈ నెల రెండో తేదీన ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఈ బిల్లుకు నాలుగో తేదీన లోక్‌సభ మూజువాణీ ఓటుతో ఆమోదముద్ర వేసింది. ఇప్పుడు రాజ్యసభ కూడా ఆమోదం తెలపడంతో దీనికి చట్టపరమైన ప్రతిపత్తి లభిస్తుంది. వివాద్ సే విశ్వాస్ కింద పన్ను వివాదాల పరిష్కారానికి గరిష్ఠ పరిమితి రూ.5 కోట్ల వరకే ఉంటుంది. ఆలోపు పన్ను వివాదాల్లో చిక్కుకున్న వారు ఎలాంటి అపరాధ వడ్డీలు, జరిమానాలు లేకుండా చెల్లించాల్సిన పన్ను మాత్రం చెల్లించి వివాదం నుంచి బయటపడవచ్చు. ఈ అవకాశం ఉపయోగించుకునేందుకు మార్చి 31 వరకే గడువు విధించారు. మార్చి 31 పైబడి జూన్ 30 లోపు వివాదం పరిష్కరించుకునేందుకు ముందుకు వచ్చే వారు తాము చెల్లించాల్సిన బకాయికి 10 శాతం అదనపు పెనాల్టీ కూడా జోడించి చెల్లించాల్సి ఉంటుంది.

### ఇది క్షమాభిక్ష ఏ మాత్రం కాదు

డీమానిటైజేషన్ సమయంలో బ్యాంకుల్లో భారీ మొత్తంలో డిపాజిట్లు చేసిన వారికి, మోసగాళ్లకు ఇది క్షమాభిక్ష ఏ మాత్రం కాదని అంతకు ముందు సభలో చర్చ సందర్భంగా ఆర్థికమంత్రి స్పష్టం చేశారు. అలాంటి వారు డీమానిటైజేషన్ సమయంలో చేసిన డిపాజిట్ల మొత్తంలో 75 శాతం పన్ను చెల్లించినప్పుడే వారికి కేసుల నుంచి విముక్తి లభిస్తుందని ఆమె అన్నారు. మోసపూరిత లావాదేవీలను నిర్వహించిన వారు దీని ద్వారా లబ్ధి పొందకుండా నివారించేందుకే వివాదంలో చిక్కుకున్న పన్ను గరిష్ఠ పరిమితి రూ.5 కోట్లుగా నిర్ణయించినట్టు చెప్పారు. ఆలోపు బకాయి ఉన్న వారు మాత్రమే వివాద్ సే విశ్వాస్ కింద పన్ను చెల్లింపునకు అర్హత ఉంటుందని ఆమె పేర్కొన్నారు. అలాగే ఆదాయపు పన్ను చట్టం కింద వచ్చిన వివాదాలకు తప్ప సంపద పన్ను చట్టం వివాదాలకు ఇది వర్తించదని ఆమె అన్నారు. అంతే కాదు ఐటీ సోదాలు, దాడులు జరిగిన కేసుల్లో రూ.5 కోట్లలోపు ఆస్తులు స్వాధీనం చేసుకున్న కేసులకు కూడా ఇది వర్తిస్తుందని ఆమె చెప్పారు. వడ్డీ చెల్లింపులు, పెనాల్టీలకు సంబంధించిన వివాదాలైతే మాత్రం అలాంటి వారు వివాదంలో చిక్కుకున్న మొత్తంలో 25% పెనాల్టీ లేదా వడ్డీగా చెల్లించాల్సి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. అలాగే ఐటీ చట్టం కింద ప్రాసిక్యూషన్ ఎదుర్కొంటున్న వారు మాత్రమే ఈ పరిష్కారానికి అర్హత కలిగి ఉంటారని చెప్పారు. 2017-18 అసెస్‌మెంట్ సంవత్సరం తర్వాత నమోదైన కేసులకు మాత్రమే ఇది వర్తిస్తుందని కూడా ఆమె తెలిపారు. వివాద్ సే విశ్వాస్ వర్తించే గడువును మార్చి 31గాను, 10% పెనాల్టీతో గడువు జూన్ 30 వరకు ఇచ్చినప్పటికీ స్కీమ్ ఎప్పుడు ముగుస్తుందనేది తదుపరి నోటిఫై చేస్తామని నిర్మల స్పష్టం చేశారు. వివాద్ సే విశ్వాస్ అనే పదంపై హిందీయేతర భాషల వారికి పూర్తి అవగాహన కోసం ఆయా భాషల్లో వాస్తవికమైన అర్థం తెలియచేసే విధంగా రాష్ట్రాలన్నింటికీ స్థానిక భాషల్లో సర్కులర్లు పంపుతామని ఆమె చెప్పారు.

**వివాదంలో రూ.9.32 లక్షల కోట్లు**

దేశంలో ఇప్పటివరకు 4.83 లక్షల ప్రత్యక్ష పన్ను కేసులు వివిధ కోర్టులు, డెట్ రికవరీ ట్రిబ్యునల్స్, ఐటీ అప్పిలేట్ ట్రిబ్యునల్స్ ముందు పెండింగులో ఉన్నాయి. వీటిలో చిక్కుకున్న వివాదాస్పద పన్ను బకాయిల విలువ రూ.9.32 లక్షల కోట్లుంది. ఈ కేసుల్లో అధిక శాతం పరిష్కారం అయ్యే ఆస్కారం ఉంది.

# పడిపడి లేచె!

## ప్రారంభంలో సెన్సెక్స్ 10% పైగా పతనం



కరోనా ధాటికి శుక్రవారం స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌నూ నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వారాంతపు ట్రేడింగ్ ప్రారంభంలో బేర్ పంజాకు బుల్ సొమ్మసిల్లింది. సూచీలు లోయర్ సర్క్యూట్ బ్రేకర్‌ను తాకాయి. దాంతో ఎక్స్ఛేంజీలు ట్రేడింగ్‌ను 45 నిమిషాలపాటు నిలిపివేశాయి. స్వల్ప విరామంలో సేదతీరిన బుల్ చెంగున లేచి దౌడు తీసింది. రికవరీ ర్యాలీలో సూచీలు ప్రారంభ నష్టాలను పూడ్చుకోవడమే గాక భారీగా లాభపడ్డాయి.

- 12 ఏళ్లలో తొలిసారిగా ట్రేడింగ్ నిలిపివేత
- మళ్లీ తేరుకుని పరుగులు తీసిన సూచీ
- రూ.3.55 లక్షల కోట్లు పెరిగిన మార్కెట్ సంపద

కరోనా భయాలతో తీవ్ర ఊగిసలాటలకు లోనవుతున్న స్టాక్ మార్కెట్లను ప్రభుత్వం, ఆర్‌బీఐ నిశితంగా గమనిస్తున్నాయి. **- నిర్మలా సీతారామన్, ఆర్థిక మంత్రి**

ప్రపంచ మార్కెట్లో పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. మార్కెట్ స్థిరత్వంతోపాటు వ్యవస్థలో తగినంత ద్రవ్య లభ్యత కోసం అవసరమైన చర్యలు చేపడతాం. **- ఆర్‌బీఐ**

ప్రపంచ మార్కెట్లతో పోలిస్తే దేశీయంగా ఈక్విటీ మార్కెట్లలో క్షీణత తక్కువే. మరికొద్ది వారాల్లోనే దేశీయంగా పరిస్థితులు మళ్లీ కుదుటపడతాయి. కరోనా భయాలను అరికట్టేందుకు ప్రభుత్వం, ఆర్‌బీఐ తగిన చర్యలు తీసుకుంటాయి. **- కేవీ సుబ్రమణియన్, ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు**

ముంబై: స్టాక్ మార్కెట్లో వారాంతపు ట్రేడింగ్ సెషన్ ఆద్యంతం ఊగిసలాటలతో ఉత్కంఠగా సాగింది. సూచీల రోలర్‌కోస్టర్ రైడ్‌లో మదుపర్ల నరాలు తెగిపోతాయా? అన్నంతగా టెన్షన్ పడ్డారు. కరోనా ఉగ్రరూపానికి ట్రేడింగ్ ప్రారంభంలోనే మార్కెట్ చతికిలపడింది. బీఎస్ఈ ప్రామాణిక సూచీ సెన్సెక్స్.. గురువారం నాటి ముగింపుతో పోలిస్తే 3,390 పాయింట్లు (10 శాతం పైగా) పతనమై 30,000 దిగువ స్థాయికి పడిపోయింది. దాంతో స్టాక్ ఎక్స్ఛేంజీలు ఉదయం 9.20 గంటల నుంచి ట్రేడింగ్‌ను 45 నిమిషాలపాటు నిలిపివేశాయి. గడిచిన 12 ఏళ్లలో సూచీలు లోయర్ సర్క్యూట్‌ను తాకడంతో ట్రేడింగ్ నిలిపివేయడం ఇదే తొలిసారి. ట్రేడింగ్ పునఃప్రారంభం తర్వాత సూచీలు మళ్లీ ఒక్కసారిగా ఎగిశాయి. వరుస పతనాల దెబ్బకు అత్యంత చౌకగా లభిస్తున్న బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇంధన రంగ షేర్లలో కొనుగోళ్లు జోరందుకోవడం కలిసివచ్చింది. దాంతో సెన్సెక్స్, నిఫ్టీ భారీ లాభాల దిశగా పయనించాయి.

### అతి భారీ నష్టాల నుంచి భారీ లాభాల్లోకి..

సెన్సెక్స్ తన ఇంట్రాడే కనిష్ఠ స్థాయి 29,388.97తో పోలిస్తే ఏకంగా 5,380.51 పాయింట్లు ర్యాలీ తీసి 34,769.48 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసుకుంది. స్టాక్ మార్కెట్ చరిత్రలో ఇదే అతిపెద్ద ఇంట్రాడే రికవరీ ర్యాలీ. చివరికి సూచీ 1,325.34 పాయింట్ల (4.4 శాతం) లాభంతో 34,103.48 వద్ద పరుగును ఆపింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) ప్రామాణిక సూచీ నిఫ్టీ కూడా 365.05 పాయింట్లు (3.81 శాతం) బలపడి 9,955.20 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 8,555.15 వద్ద ట్రేడింగ్ కనిష్ఠ స్థాయిని నమోదు చేసుకుంది.

### రూ.16.5 లక్షల కోట్ల రికవరీ

మార్కెట్ ప్రారంభంలో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల విలువ దాదాపు రూ.13 లక్షల కోట్లు తరిగిపోయి రూ.112,78,172.75 కోట్లకు దిగజారింది. మార్కెట్ మళ్లీ కోలుకోవడంతో వారాంతం ట్రేడింగ్ ముగిసేసరికి ఇన్వెస్టర్ల సంపద (గురువారం ముగింపుతో పోలిస్తే) రూ.3.55 లక్షల కోట్లు పెరిగి రూ.129,26,242.82 కోట్లకు చేరుకుంది. అయితే వారం మొత్తం మీద మాత్రం ఇన్వెస్టర్ల సంపద రూ. 15 లక్షల కోట్లు ఆవిరైపోయింది.

### గతంలో ట్రేడింగ్ నిలిపివేసిన సందర్భాలు..

స్టాక్ ఎక్స్ఛేంజీలో ట్రేడింగ్ నిలిపివేయాల్సి రావడం చాలా అరుదుగా జరిగే సంఘటన. 2008 జనవరి 22న కూడా సూచీలు సర్క్యూట్ బ్రేక్ చేయడంతో స్వల్పకాలంపాటు ట్రేడింగ్ నిలిపివేశారు. 2012 అక్టోబరు 5న ఎన్ఎస్ఈలో చోటు చేసుకున్న ఫ్రీక్ ట్రేడ్ కారణంగానూ కొద్ది నిమిషాలపాటు ట్రేడింగ్ నిలిచిపోయింది.

**బంగారం ధర రూ.1,097 తగ్గుదల**

అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ తగ్గడంతో బంగారం, వెండి ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ధర శుక్రవారం నాడు రూ.1,097 తగ్గి రూ.42,600కు పరిమితమైంది. వెండి రేటు సైతం కిలోకు రూ.1,574 తగ్గి రూ.44,130కి చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 1,584 డాలర్లు, వెండి 15.65 డాలర్లు పలికింది.

# యెస్ బ్యాంక్‌కు చేయూత

## ఉద్దీపన పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం

- త్వరలో మారిటోరియం ఎత్తివేత
- చేతులు కలిపిన ఇతర బ్యాంకులు
- రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా ఆసక్తి



న్యూఢిల్లీ: యెస్ బ్యాంకును పట్టాలెక్కించే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. ఇందుకోసం ఆర్‌బీఐ సమర్పించిన ఉద్దీపన (బెయిల్‌ఔట్) పథకానికి కేంద్ర కేబినెట్ శుక్రవారం ఆమోదం తెలిపింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ విషయం చెప్పారు. ఈ ఉద్దీపన పథకం నోటిఫికేషన్ వెలువడిన మూడు రోజుల్లో యెస్ బ్యాంకు నుంచి డిపాజిట్ల ఉపసంహరణపై ఉన్న మారిటోరియాన్నీ ఎత్తివేయబోతున్నట్టు ప్రకటించారు. ఆ తర్వాత వారం రోజుల్లో బ్యాంకుకు కొత్త డైరెక్టర్ల బోర్డునీ ఏర్పాటు చేస్తారు.

### ఇతర బ్యాంకుల నుంచీ పెట్టుబడులు

యెస్ బ్యాంకును గాడిలో పెట్టేందుకు ఎస్‌బీఐతో కలిసి పని చేసేందుకు నాలుగు ప్రముఖ ప్రైవేటు బ్యాంకులూ ముందుకొచ్చాయి. ఇందులో భాగంగా ఐసీఐసీఐ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు చెరో రూ.1,000 కోట్లు యెస్ బ్యాంకు ఈక్విటీలో వాటా తీసుకుంటున్నాయి. కోటక్ మహీంద్రా బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు మరో రూ.1,100 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు అంగీకరించాయి. దీంతో బ్యాంకు అధీకృత ఈక్విటీ మూల ధనాన్ని ప్రస్తుత రూ.1,100 కోట్ల నుంచి రూ.6,200 కోట్లకు పెరగనుంది.

### బిగ్ బుల్ ఆసక్తి!

ఈ బ్యాంకులకు తోడు డీమార్ట్ ప్రమోటర్ రాధాకిషన్ దమానీ, బిగ్‌బుల్ రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా, అజీమ్ ప్రేమ్‌జీ ట్రస్టులు చెరి రూ.500 కోట్ల చొప్పున యెస్ బ్యాంకు ఈక్విటీలో వాటా తీసుకునేందుకు సిద్ధమైనట్టు సమాచారం. ఇందుకోసం ఆర్‌బీఐ ఇప్పటికే వివిధ ఆర్థిక సంస్థలు, వ్యక్తులతో చర్చలు జరుపుతున్నట్టు సీతారామన్ చెప్పారు. ఎల్ఐసీ కూడా యెస్ బ్యాంకు ఈక్విటీలో వాటా తీసుకుంటుందనే వార్తలు వినిపిస్తున్నాయి.

### మూడేళ్ల లాక్ ఇన్ పీరియడ్

యెస్ బ్యాంకు ఈక్విటీలో కొత్తగా పెట్టుబడి పెట్టే బ్యాంకులు, ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల్లో 75 శాతాన్ని మూడేళ్ల వరకు విక్రయించేందుకు వీల్లేదని ఆర్థిక మంత్రి సీతారామన్ చెప్పారు. ఎస్‌బీఐ తీసుకునే 49 శాతం ఈక్విటీలోనూ 26 శాతాన్ని మూడేళ్ల వరకు కదలించేందుకు వీల్లేదు.

**మొత్తం రూ.50 వేల కోట్లు**

ఆర్థిక పునర్ వ్యవస్థీకరణ కింద యెస్ బ్యాంకుకు మొత్తం రూ.50,000 కోట్లు అందుబాటులోకి వస్తాయి. ఇందులో రూ.20,000 కోట్లు ఈక్విటీ నిధులు. రూ.30,000 కోట్లను బల్క్ డిపాజిట్ల కింద ఇతర బ్యాంకులు సమకూరుస్తాయి. మారటోరియం తొలగించాక డిపాజిటర్ల ఒత్తిడి ఎదురైతే ఎదుర్కొనేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయని భావిస్తున్నారు.

### రాణా కపూర్ దంపతులపై మరిన్ని కేసులు

యెస్ బ్యాంకు ప్రమోటర్ రాణా కపూర్, ఆయన బార్య బిందుపై సీబీఐ తాజాగా మరిన్ని కేసులు నమోదు చేసింది. కపూర్ దంపతులతో పాటు ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతం థాపర్‌పైనా కేసులు నమోదయ్యాయి. అమృతా షెర్గిల్ బంగళా కొనుగోలు కోసం మంజూరు చేసిన రూ.2,000 కోట్ల రుణం కోసం ముడుపులు చేతులు మారాయనే ఆరోపణలపై సీబీఐ ఈ కేసులు నమోదు చేసింది. ఇందుకు సంబంధించి ఢిల్లీ, ముంబైల్లోని వారి నివాసాలు, కార్యాలయాల్లో సోదాలూ జరిపింది. ఈ కేసులకు సంబంధించి ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ కార్యాలయాల్లోనూ సీబీఐ సోదాలు జరిపింది.

# 50% విమానాలు తగ్గాయ్

- కరోనాతో ఆసియా పసిఫిక్ గజగజ
- 2040 నాటికి భారత్‌కు 2,040 కొత్త విమానాలు: బోయింగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత విమానయాన రంగం ఆకర్షణీయంగా వృద్ధి చెందుతోంది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో వచ్చే అయిదేళ్ల విమానయాన రంగం అభివృద్ధికి భారత విమానయాన రంగం దోహదం చేస్తుందని బోయింగ్ కంపెనీ అంచనా వేస్తోంది. వచ్చే ఇరవై ఏళ్లలో (2040) భారత్‌లోని విమానయాన కంపెనీలకు 2,040 కొత్త వాణిజ్య విమానాలు అవసరం అవుతాయని భావిస్తున్నట్లు బోయింగ్ వైస్ ప్రెసిడెంట్, గ్లోబల్ హెడ్ (కమర్షియల్ మార్కెటింగ్), డారెన్ హల్స్ట్ తెలిపారు. కరోనా ప్రభావంతో ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ప్రయాణికుల విమానాలు 50 శాతానికి పైగా తగ్గాయని చెప్పారు. చైనాలో సాధారణంగా సగటున రోజుకు 15,000 విమాన సర్వీసులుంటాయి. ఇది దాదాపు 3,000కి. చైనాను మినహాయిస్తే.. ఆసియా పసిఫిక్ మార్కెట్‌లో ఫ్లైట్లు 5,000 నుంచి దాదాపు 2,500కు పరిమితమయ్యాయన్నారు. అయితే భారత్‌లో ఈ ప్రభావం అంతగా లేదని చెప్పారు.



బోయింగ్ ఇండియా ప్రెసిడెంట్ సలీల్ గుప్తే, బోయింగ్ వైస్ ప్రెసిడెంట్ డారెన్

భారత్‌లోని 200 మందికి పైగా సరఫరాదారుల నుంచి విమానాలకు అవసరమైన హై-ఎండ్ సిస్టమ్స్, ఏరోస్ట్రక్చర్లు, వైర్ హార్నెస్, కాంపోజిటీస్ తదితర కీలక పరికరాలను బోయింగ్ కొనుగోలు చేస్తోంది. ప్రస్తుతం ఏడాదికి 100 కోట్ల డాలర్ల విలువైన పరికరాలు, స్ట్రక్చర్లు కొనుగోలు చేస్తున్నామని, వీటిని 200 కోట్ల డాలర్లకు పెంచనున్నామని డారెన్ చెప్పారు.

### హైదరాబాద్ కీలకం

పరికరాల సరఫరా పరంగా హైదరాబాద్‌ను కీలక మార్కెట్‌గా భావిస్తున్నామని బోయింగ్ ఇండియా ప్రెసిడెంట్ సలీల్ గుప్తే తెలిపారు. హైదరాబాద్‌లోని టాటా బోయింగ్ ఏరోస్పేస్ (టీబీఎల్) 777 విమానాల అప్‌లాక్ బాక్సులను తయారు చేస్తోంది. భారత్ ఏరోస్పేస్, రక్షణ రంగాల కోసం ఇంటిగ్రేటెడ్ సిస్టమ్స్‌ను అభివృద్ధి చేస్తోంది. హైదరాబాద్‌లోని సైయెంట్ బోయింగ్ విమానాల కోసం కీలకమైన డిజైన్ ఇంజినీరింగ్ ప్రాజెక్టులను చేపట్టింది. 747-8, 787 విమానాలకు డిజైన్, స్ట్రెస్ సపోర్ట్‌ను అందిస్తోందన్నారు.

## హైదరాబాద్‌లో టీఏఎస్ఎల్ రక్షణ ఎలక్ట్రానిక్స్ తయారీ యూనిట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (టీఏఎస్ఎల్) అనుబంధ కంపెనీ నోవా ఇంటిగ్రేటెడ్ సిస్టమ్స్ (ఎన్ఐఎస్ఎల్) హైదరాబాద్‌లో డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తోంది. నాదర్‌గూల్ గ్రామం సమీపంలోని టీఎస్ఐఐసీ-పారిశ్రామిక పార్కులో దీన్ని ఏర్పాటు చేస్తున్నారు. యూనిట్ శంకుస్థాపన కార్యక్రమంలో తెలంగాణ పరిశ్రమల మంత్రి కేటీ రామారావు, ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, టీఎస్ఐఐసీ ఎండీ నరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గత పదేళ్లుగా టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ హైదరాబాద్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తోందని, ఏరోస్పేస్ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టిందని కేటీఆర్ అన్నారు. గ్లోబల్ ఓఎంఈలు లాక్‌హీడ్ మార్టిన్, బోయింగ్, జీఈ, సిర్కోస్కీ వంటి వాటితో చేతులు కలిపిందని చెప్పారు. హైదరాబాద్‌లో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ కార్యకలాపాలను మరింత విస్తరించడం సంతోషకరంగా ఉందని తెలిపారు. డిఫెన్స్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్‌ను అభివృద్ధి చేయడం టీఏఎస్ఎల్ ప్రస్థానంలో ఒక మైలు రాయని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సీఈఓ, ఎండీ శ్రీ సుకరన్ సింగ్ అన్నారు. రక్షణ దళాలు, డీఆర్‌డీఏ, ఇంటర్నేషనల్ ఓఈఎంలు, సిస్టమ్ ఇంటిగ్రేటర్లకు నోవా ఇంటిగ్రేటెడ్ సిస్టమ్స్ కస్టమైజ్డ్ డిఫెన్స్ ఎలక్ట్రానిక్ సిస్టమ్ సొల్యూషన్లను అందిస్తోంది.

## ఎగుమతులు పెరిగాయ్..

- ఏడు నెలల్లో మొదటి వృద్ధి

న్యూఢిల్లీ: భారత్ ఎగుమతులు పెరిగాయి. ఏడు నెలల్లో మొదటిసారిగా ఎగుమతుల్లో వృద్ధి నమోదైంది. ఫిబ్రవరిలో ఎగుమతులు 2.91 శాతం వృద్ధి చెంది 2,765 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.97 లక్షల కోట్లు)కు చేరుకున్నాయి. పెట్రోలియం, ఇంజనీరింగ్, కెమికల్స్ వంటి రంగాల్లో వృద్ధి ఎగుమతులు పెరగడానికి దోహదపడినాయి. తొమ్మిది నెలల్లో మొదటిసారి ఫిబ్రవరిలో దిగుమతులు 2.48 శాతం పెరిగి 3,750 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. గత జూన్ నుంచి ఎగుమతుల్లో ప్రతికూల వృద్ధి నమోదు అవుతోంది.

## సీఐఐ సదరన్ రీజియన్ చైర్మన్‌గా సతీష్ రెడ్డి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సదరన్ రీజియన్ చైర్మన్‌గా డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ చైర్మన్ సతీష్ రెడ్డి ఎన్నికయ్యారు. 2020-21 సంవత్సరానికి ఈయన నియామకం జరిగింది. 2019-20 సంవత్సరంలో సీఐఐ సదరన్ రీజియన్ డిప్యూటీ చైర్మన్‌గా సతీష్ రెడ్డి బాధ్యతలు నిర్వహించారు. 2014-2020 కాలానికి సీఐఐ నేషనల్ కౌన్సిల్ మెంబర్‌గా ఉన్నారు. ఇంతకు ముందు సీఐఐ నేషనల్ ఫార్మా కమిటీ చైర్మన్‌గా, సీఐఐ ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ చైర్మన్ (2003-04)గానూ రెడ్డి బాధ్యతలు నిర్వహించారు. కాగా 2020-21 సంవత్సరానికి సీఐఐ సదరన్ రీజియన్ డిప్యూటీ చైర్మన్‌గా కెవిన్ కేర్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సీకే రంగనాథన్ ఎన్నికయ్యారు.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 13వ తేదీకి.. | | విజయవాడ | 324 |
| హైదరాబాద్ | 295 | విశాఖపట్నం | 355 |
| 14వ తేదీకి.. | | వరంగల్ | 298 |
| చిత్తూరు | 323 | డజను గుడ్లు రూ. | 54 |
| గోదావరి | 324 | | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 15 | విజయవాడ | 30 |
| వరంగల్ | 15 | గుంటూరు | 30 |
| మహబూబ్‌నగర్ | 15 | ఒంగోలు | 30 |
| కరీంనగర్ | 16 | చిత్తూరు | 32 |
| కర్నూలు | 15 | నెల్లూరు | 32 |
| విశాఖపట్నం | 16 | అనంతపురం | 38 |
| గోదావరి | 16 | | |

### బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 42,240 | 42,600 | 43,530 | 42,400 | 42,140 |
| క్రితం ముగింపు | 43,960 | 42,900 | 45,030 | 43,000 | 43,650 |
| 22 క్యారెట్లు | 40,230 | 39,400 | 40,040 | 39,170 | 40,130 |
| క్రితం ముగింపు | 41,910 | 39,800 | 41,420 | 39,810 | 41,570 |
| వెండి (కిలో) | 41,900 | 44,300 | 44,400 | 44,300 | 46,000 |
| క్రితం ముగింపు | 45,400 | 46,800 | 46,660 | 46,500 | 48,900 |

# అయిదేళ్లలో రూ.25,000 కోట్లు

- విమానాశ్రయాల అభివృద్ధికి ఏఏఐ ప్రణాళిక
- 100 విమానాశ్రయాల అభివృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విమానాశ్రయాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) వచ్చే అయిదేళ్లలో రూ.25,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ప్రస్తుతం దేశంలోని విమాన ప్రయాణికుల్లో 50 శాతం మంది ఢిల్లీ, ముంబై వంటి మహానగరాల్లో ప్రైవేటు విమానాశ్రయాల నుంచి రాకపోకలు నిర్వహిస్తుంటే.. మిగిలిన 50 శాతం ప్రయాణికులు ఏఏఐ నిర్వహణలోని విమానాశ్రయాల ద్వారా వెళుతున్నారు. ప్రస్తుతం ఏఏఐ విమానాశ్రయాలకు ఏడాదికి 34.5 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు నిర్వహించడానికి సదుపాయాలు ఉన్నాయి. ఈ సామర్థ్యాలను 2030 నాటికి 70-75 కోట్లకు పెంచుకోవాలని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా లక్ష్యంగా పెట్టుకుందని ఏఏఐ చైర్మన్ ఆనంద్ సింగ్ తెలిపారు.

గత మూడేళ్లలో ఉడాన్ పథకం కింద దేశంలోని మారుమూల ప్రాంతాల్లోని 48 విమానాశ్రయాలను ఏఏఐ అభివృద్ధి చేసింది. వచ్చే అయిదేళ్లలో 100 విమానాశ్రయాలను అభివృద్ధి చేయనుంది. ఉడాన్ పథకం కింద కేంద్రం విమానాశ్రయాల అభివృద్ధికి రూ.4,500 కోట్లు కేటాయించిందని సింగ్ తెలిపారు. ప్రతిపాదిత వాటర్ ఏరోడ్రోమ్స్‌లోని కొన్నింటిలో వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి నాన్ షెడ్యూల్డ్ కార్యకలాపాలు ప్రారంభం కాగలవన్నారు.

## వేర్‌హౌస్ కార్యకలాపాలకు జీఎంఆర్, స్పైస్‌జెట్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వేర్‌హౌసింగ్, పంపిణీ, ట్రేడింగ్ కార్యకలాపాలు నిర్వహించడానికి జీఎంఆర్ ఏరోస్పేస్ అండ్ ఇండస్ట్రియల్ పార్క్‌లో స్పైస్‌జెట్ కోసం జీఎంఆర్ హైదరాబాద్ ఏవియేషన్ సెజ్ (జీహెచ్ఏఎస్ఎల్) భవనాన్ని నిర్మించనుంది. ఈ మేరకు రెండు కంపెనీల మధ్య లీజ్ ఒప్పందం కుదిరిందని జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (జీహెచ్ఐఏఎల్) తెలిపింది. జీహెచ్ఐఏఎల్‌కు జీహెచ్ఏఎస్ఎల్ అనుబంధ కంపెనీ. 33,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సదుపాయాన్ని లక్ష చదరపు అడుగుల వరకూ విస్తరించుకోవచ్చని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్ ల్యాండ్ డెవలప్‌మెంట్ సీఈఓ అమన్ కపూర్ తెలిపారు.

## మౌలిక సదుపాయాలు మరింత పెరగాలి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత్‌లో విమాన ప్రయాణికులు వేగంగా వృద్ధి చెందడానికి అవకాశాలు ఉన్నాయని.. ఆ అవకాశాలను అందిపుచ్చుకోవడమే ముఖ్యమని జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సీఈఓ ఎస్‌జీకే కిషోర్ అన్నారు. గత పదేళ్లలో విమాన మౌలిక సదుపాయాలు గణనీయంగా పెరిగాయని.. అయితే ఇంకా పెరగాల్సి ఉందని చెప్పారు. దేశంలో ప్రతి వెయ్యి మందికి ఐదుగురు మాత్రమే ప్రయాణం చేస్తున్నారని వివరించారు. భారత్‌లో రీజినల్ జెట్లకు మంచి అవకాశాలు ఉన్నాయని ఎంబ్రాయర్ వైస్ ప్రెసిడెంట్ సీసర్ పెరిరియా తెలిపారు. అంతర్జాతీయ సేవలపై భారత విమానయాన కంపెనీలు దృష్టి పెట్టాలని విస్తారా సీఈఓ లెస్లీ థంగ్ అన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో ఇతర దేశాలతో భారత్‌ను పోల్చడానికి వీలు లేదని.. అయితే మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలని వివరించారు.

# ఇంకా అవే రంగులు!

- తీర్పు వచ్చి 4 రోజులైనా మారని తీరు
- ప్రభుత్వ భవనాలపై వైసీపీ రంగుల తీసివేతకు వెలువడని మార్గదర్శకాలు
- నిర్ణయం ద్వివేదికి వదిలిపెట్టిన సీఎస్
- ఆదేశాలివ్వాల్సిన ఎస్‌ఈసీ లేఖతో సరి
- నాడు సీఈవోగా అత్యుత్సాహం
- కోడ్ అమల్లో మాత్రం కదలని ద్వివేది

అమరావతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ భవనాలకు వేసిన వైసీపీ పార్టీ జెండాను పోలిన రంగులను పది రోజుల్లోపు తొలగించాలని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాల అమలుకు ఇక మిగిలింది ఆరు రోజులే! తొలగించిన రంగుల స్థానంలో కొత్తగా వేయాల్సిన పెయింట్‌పై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మార్గదర్శకాలు విడుదల చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే దీనికి సంబంధించి నిర్ణయాలను సీఎస్... పంచాయతీరాజ్ కమిషనర్ గోపాలకృష్ణ ద్వివేదికి పూర్తిగా వదిలేసినట్లు తెలిసింది. అలాగే, కోడ్ అమల్లో ఉన్నప్పుడు స్పందించాల్సిన ఎన్నికల కమిషన్ కూడా మొక్కుబడి చర్యలకే పరిమితం అయిందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. పంచాయతీ భవనాలకు వైసీపీ రంగులపై ఫిర్యాదు చేసినవారికి.. కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉందని చెబుతూ వచ్చింది. తీరా తీర్పు వచ్చాక...సీఎ‌స్‌కు లేఖ రాస్తామని, 10 రోజుల్లో పెయింట్లు మార్చేస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ప్రెస్‌మీట్‌లో చెప్పారు. నిజానికి మార్గదర్శకాలు ఇచ్చేలా సీఎస్‌ను ఆదేశించే అధికారమున్నా ఎన్నికల కమిషనర్ కేవలం లేఖతో సరిపెట్టారు. దీనిపై నిజానికి ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లకు ఎన్నికల కమిషన్ ఇప్పటికే ఆదేశాలివ్వాలి. అలా జరగలేదు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో హైకోర్టుతీర్పు అమలు సాధ్యం కాదనే భావన బలపడుతోంది. 2019 సార్వత్రిక ఎన్నికలు నిర్వహణ కోసం కేంద్ర ఎన్నికల కమిషన్ రాష్ట్రంలో గోపాలకృష్ణ ద్వివేదిని చీఫ్ ఎన్నికల కమిషనర్‌గా నియమించింది. అప్పట్లో ఆయనపై పలు ఆరోపణలు వచ్చాయి. ఇప్పుడు ఆయనే పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శిగా బాధ్యతల్లో ఉన్నారు. ఎన్నికల నిర్వహణలో అప్పట్లో అవార్డు తీసుకొన్న ద్వివేది.. ఇప్పుడు ఎన్నికల కోడ్ అమలు చేయడానికి మీనమేషాలు లెక్కిస్తుండటం గమనార్హం! అప్పట్లో ప్రభుత్వంలో ఉన్న పార్టీని ఇరకాటంలో పెట్టేందుకు ఆయన అత్యుత్సాహం చూపినట్టు విమర్శలు వచ్చాయి. ఎన్నికల నియమావళిని అడ్డం పెట్టుకుని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని సైతం సమీక్షలు నిర్వహించకుండా అడ్డుకున్నారు. జిల్లా కలెక్టర్లను బదిలీ చేశారు. సాక్షాత్తు సీఎస్‌నే నియమావళి సాకుతో మార్చేసిన సంఘటనలున్నాయి. అప్పట్లో కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్రంలో వైసీపీకి అనుకూలంగా, టీడీపీకి వ్యతిరేకంగా ఆయన వ్యవహరిస్తున్నారన్న ప్రచారం జరిగింది. కోడ్ అమలు చేయడంలో తాత్సారం చేసి ప్రస్తుత ప్రభుత్వానికి భక్తి చాటుకుంటున్నారేమోనని పలువురు ఆరోపిస్తున్నారు.

# సాయిరెడ్డి సేవలో పెద్దసారు!

- ఆంధ్ర వర్సిటీ కీలక అధికారి తీరు
- అభ్యర్థులపై సర్వే, జాబితా తయారీ
- అందులోనూ... సిఫారసులకు పెద్దపీట
- మూడు రోజులు విధులకు గైర్హాజరు
- అభ్యర్థులు ఖరారయ్యాక తిరిగి డ్యూటీకి!

(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోనే ఘనమైన చరిత్ర కలిగిన ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆయన కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వైసీపీ అంటే ఆయనకు వల్లమాలిన అభిమానం. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో చిన్న వయస్సులోనే ఏయూలో కీలక పదవి లభించింది. ఇప్పుడు వైసీపీ అధికారంలోకి రాగానే విశ్వవిద్యాలయంలో మరోసారి ఉన్నతస్థాయి బాధ్యతలు చేపట్టారు. విశాఖపట్నంలో అవసరాన్ని బట్టి ఆయా అంశాలపై విద్యార్థులతో సర్వేలు చేయిస్తూ కీలకమైన సమాచారాన్ని వైసీపీకి అందిస్తుంటారు. ఇప్పుడు... విశాఖపట్నం కార్పొరేషన్ ఎన్నికలు జరుగుతుండడంతో తన అధికారిక బాధ్యతలను పక్కనపెట్టి మరీ అధికార పార్టీ సేవలో తరిస్తున్నారు. గత మూడు రోజుల నుంచి ఆయన విశ్వవిద్యాలయం వైపు కన్నెత్తి చూడలేదు. అజ్ఞాతంలోకి వెళ్లిపోయి అధికార పార్టీ అభ్యర్థుల ఎంపికపై మంతనాలు సాగించారు. ఆయన రూపొందించిన జాబితాలోని వారికే అత్యధిక శాతం టికెట్లు దక్కాయి. కొందరు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తుంటే... ఆయన కారణంగానే తాము అవకాశాలు కోల్పోయామని కొందరు దుమ్మెత్తి పోస్తున్నారు.

## విజయసాయిరెడ్డికి నమ్మిన బంటు

విశాఖపట్నంలో వైసీపీ రాజకీయ వ్యవహారాలన్నీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. ఎలాగైనా మేయర్ పీఠాన్ని దక్కించుకుని... కార్యనిర్వాహక రాజధానికి విశాఖ ప్రజలు ఆమోదం తెలిపారని ప్రచారం చేసుకోవాలని వైసీపీ భావిస్తోంది. జీవీఎంసీలో మొత్తం 98 వార్డులున్నాయి. వైసీపీలో ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఎవరికి టికెట్ ఇవ్వాలనే దానిపై ఆ పార్టీ నేతలు ఒక అంచనాకు రాలేకపోయారు. టికెట్ ఆశిస్తున్న వారంతా విజయసాయిరెడ్డిని కలుస్తుండడంతో ఆయన... 'ఎంపిక' బాధ్యతను ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కీలక బాధ్యతల్లో ఉన్న సదరు వ్యక్తికి అప్పగించారు. వచ్చిన దరఖాస్తులన్నింటిని ఆయన చేతిలో పెట్టి, వారిపై సర్వే చేసి ఓ నివేదికను ఇవ్వాలని కోరారు. అంతే... ఆ మరుసటిరోజు నుంచే ఆ అధికారి విశ్వవిద్యాలయం బాధ్యతలను పక్కన పెట్టేసి తన విద్యార్థులను రంగంలో దించారు. టికెట్లు ఆశిస్తున్న వారి ఆర్థిక స్థోమత, స్థానికుల్లో ఉన్న పేరు, కుటుంబ నేపథ్యం, రాజకీయ అనుభవం, ఎవరి ఆశీస్సులతో రాజకీయాల్లోకి వచ్చారు, బరిలో దిగితే వచ్చే ఫలితం వంటి అంశాలపై సర్వే చేయించి నివేదిక రూపొందించారు. అయితే... సర్వే ఫలితాల ఆధారంగా జాబితా తయారు చేయకుండా, కొన్ని డివిజన్లకు సంబంధించి తనకు కావలసిన వారి పేర్లనే మొదటి వరుసలో పెట్టారనే ఆరోపణలు పార్టీ వర్గాల నుంచే వినిపిస్తున్నాయి. మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్, విశాఖ సిటీలో నియోజకవర్గాల పార్టీ సమన్వయకర్తలు సూచించిన పేర్లతో ఈ జాబితా తయారు చేసినట్లు తెలుస్తోంది. సర్వేలో గట్టి అభ్యర్థి అని తేలినా... సిఫారసు లేకపోతే పక్కన పెట్టేశారు. ఐదేళ్లు తెలుగుదేశం పార్టీలో ఉండి... ఈ నెల 10వ తేదీన వైసీపీ కండువా కప్పుకొన్న ఓ నాయకుడు తన సామాజిక వర్గానికి చెందిన నాయకుడితో వెళ్లి విశ్వవిద్యాలయానికి చెందిన ఆ అధికారిని కలిశారు. అంతే... ఆయన కోరుకున్న వార్డులో వైసీపీ తరపున పోటీ చేయడానికి టికెట్ వచ్చేసింది. ఇలాంటి సిత్రాలు చాలా జరిగాయి.

## అంతా పూర్తయ్యాకే విధుల్లోకి..

మూడు రోజులుగా విశ్వవిద్యాలయానికి రాని ఆ కీలక అధికారి... టికెట్ల కేటాయింపు మొత్తం పూర్తయి, నామినేషన్ల గడువు ముగియడానికి గంట ముందు... అంటే శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు మళ్లీ విధుల్లోకి వచ్చారు.

# జైలు నుంచి ప్రమాణ స్వీకారానికే!

- టీడీపీ నేతలపై హత్యాయత్నం ఘటనలో... ప్రధాన నిందితుడే మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి
- మాచర్లలో 31 వార్డులకు 26 ఏకగ్రీవం
- 5 వార్డులకు పోటీ నామినేషన్లు దాఖలు
- వారూ ఉపసంహరించుకునేలా ఎత్తులు

గుంటూరు, మార్చి 13: టీడీపీ నేతలపై హత్యాయత్నం కేసులో అరెస్టయిన వైసీపీ నాయకుడు తురకా కిశోర్ జైలు నుంచి నేరుగా మాచర్ల మున్సిపల్ చైర్మన్ ప్రమాణస్వీకారానికి రానున్నారు. సంచలనం సృష్టించిన ఈ కేసులో కిశోర్ ప్రధాన నిందితుడు. దాడి జరిగిన తరువాత ఆయన 13వ వార్డు కౌన్సిలర్‌గా నామినేషన్ వేశారు. కిశోర్‌తో పాటు మిగిలిన ఇద్దరు నిందితులు మల్లెల గోపీ, బత్తుల నాగరాజులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ 15 రోజులు రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. మాచర్ల మున్సిపాలిటీలో మొత్తం 31వార్డులు ఉండగా 26చోట్ల పోటీ లేకపోవడంతో వైసీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లయింది. మరో 5వార్డులకు పోటీ నామినేషన్లు దాఖలయ్యాయి. అందులో కిశోర్ పోటీ చేస్తున్న వార్డు నుంచి టీడీపీకి చెందిన షేక్ సైదా బరిలో ఉన్నారు. టీడీపీ ముఖ్య నాయకులైన బుద్దా వెంకన్న, బొండా ఉమాపై హత్యాయత్నం ఘటనతో మాచర్లలో ఆ పార్టీ శ్రేణులు ఆందోళనకు గురయ్యాయి. దీనికితోడు ఆ పార్టీ స్థానిక నేతలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా తీవ్రస్థాయిలో బెదిరింపులు వచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అక్కడ పోటీకి టీడీపీ నాయకులు వెనుకంజ వేశారు. ఐదు వార్డుల్లో పోటీలో నిలిచిన ఐదుగురు కూడా నామినేషన్లు ఉపసంహరించుకునేలా వైసీపీ నేతలు ఎత్తులు వేస్తున్నట్లు చెబుతున్నారు. అదే జరిగితే మొత్తం మున్సిపాలిటీ ఏకగ్రీవమై ఎన్నికలు నిర్వహించే అవకాశమే ఉండదు.

## దాడికి చైర్మన్ పీఠం నజరానా

టీడీపీ నేతలపై హత్యాయత్నం కేసులో నిందితుడు తురకా కిశోర్‌కు ఏకంగా మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కనుంది. గతంలో ఎటువంటి పదవులు నిర్వహించకపోయినా ఏకంగా చైర్మన్ పదవిని చేపట్టే అవకాశం లభించింది. మాచర్ల మున్సిపల్ చైర్మన్ పదవి బీసీ జనరల్‌కు రిజర్వు అయింది. అదే సామాజిక వర్గానికి చెందిన కిశోర్ 13వ వార్డు కౌన్సిలర్‌గా గురువారం నామినేషన్ దాఖలు చేశారు. దాడి కేసులో పోలీసుల అదుపులో ఉన్నప్పటికీ బెయిలబుల్ కేసు నమోదు చేసిన పోలీసులు 41ఎ నోటీసు ఇచ్చి స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు. ఒంటరిగా వెళ్లి దొంగచాటుగా నామినేషన్ వేసిన కిశోర్ స్టేషన్‌కు వచ్చిన తర్వాత 307 సెక్షన్ కింద హత్యాయత్నం కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించారు.

### మాచర్ల ఘటనలో ముగ్గురు అరెస్టు

- నిందితులపై నాన్‌బెయిలబుల్ కేసు
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేశ్‌కుమార్

అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా మాచర్లలో టీడీపీ నేతలపై జరిగిన దాడి ఘటనపై విచారణ జరిపి, నిందితులను అరెస్ట్ చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేష్‌కుమార్ తెలిపారు. ఈ ఘటనలో పాల్గొన్న ముగ్గురిపై 307, 153 తదితర సెక్షన్ల కింద పోలీసులు నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేశారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీరు డ్యూటీలో ఉన్న పోలీసు అధికారి విధులకు ఆటంకం కలిగించడం, ప్రజాప్రతినిధులపై దాడులు చేసేందుకు ప్రయత్నించడంపై కలెక్టర్ నివేదిక ఆధారంగానే వారిని పోలీసులు నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద అరెస్టు చేశారని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో శాంతిభద్రతల విషయంలో అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలిచ్చిందని రమేశ్‌కుమార్ తెలిపారు.



రాజ్యసభకు నామినేషన్ వేస్తున్న వర్ల రామయ్య

## ఆత్మ ప్రబోధంతో నాకు ఓటేయండి

- వైసీపీ ఎమ్మెల్యేలకు వర్ల రామయ్య వినతి
- రాజ్యసభకు టీడీపీ అభ్యర్థిగా నామినేషన్

అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఏపీ నుంచి జరుగుతున్న రాజ్యసభ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా వర్ల రామయ్య శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. అసెంబ్లీ కార్యదర్శి బాలకృష్ణమాచార్యులుకు రెండు సెట్ల నామినేషన్లు సమర్పించారు. అనంతరం వర్ల రామయ్య విలేకరులతో మాట్లాడారు. 'వాస్తవానికి మా పార్టీకి ఉన్నది 23 మంది ఎమ్మెల్యేలు మాత్రమే. కానీ రాజ్యసభలో దళిత వాణి, డాక్టర్ అంబేడ్కర్ భావజాలాన్ని గట్టిగా వినిపించాలంటే నాకే సాధ్యం. అందుకే 175 మంది ఎమ్మెల్యేలలో ముఖ్యమంత్రిని పక్కన బెట్టినా 174 మంది శాసనసభ్యులకు విజ్ఞప్తి చేస్తున్నా. ఒక్కసారి ఆలోచించండి. ఆత్మప్రబోధంతో ఓటేయండి. నేను అంబేడ్కర్‌వాదిగా పార్లమెంటులో నిలబడతా. వైసీపీలో ఉన్న 30-35 మంది దళిత ఎమ్మెల్యేలు ఆత్మపరిశీలన చేసుకోవాలి' అని కోరారు. అంబానీ, సోనియాగాంధీ కుట్రల వల్లే వైఎస్ఆర్ హత్యకు గురయ్యారని జగన్ నాడు యువతను రెచ్చగొట్టడంతో చోటుచేసుకున్న ఘటనల్లో కేసులు నమోదైన వారిలో 90శాతం దళిత బిడ్డలే ఉన్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ముఖేష్ అంబానీ సన్నిహితుడు నత్వానీకి సీటు విషయంలో జగన్ సహకరించిన తీరు వేలాది దళిత కుటుంబాల్లో కడుపు మంట రగిలించిందని చెప్పారు.

## పార్టీ మారే ఉద్దేశం లేదు : శిద్దా

'నాకు పార్టీ మారే ఉద్దేశం లేదు' అని మాజీ మంత్రి, టీడీపీ నేత శిద్దా రాఘవరావు ప్రకటించారు. తాను పార్టీ మారుతున్నానంటూ కొన్ని చానళ్లలో వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని శుక్రవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. పార్టీ మారుతున్నట్లు వస్తున్న కథనాలను ఆయన ఖండించారు.

## 28 నుంచి అసెంబ్లీ.. 30న ఓటాన్ అకౌంట్!

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు జగన్ ప్రభుత్వం సమాయత్తమవుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ నెల 28వ తేదీన శాసనసభ ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ప్రసంగిస్తారు. మరునాడు ఆదివారం సెలవు. 30వ తేదీన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను.. 31వ తేదీన ద్రవ్య వినిమయ బిల్లును ప్రవేశ పెడతారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఏప్రిల్ మొదటివారంలో స్థానిక సంస్థల విజయోత్సవాలను నిర్వహించాక.. పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలను జరపాలని యోచిస్తున్నట్లు సమాచారం.

## 'హెబియస్ కార్పస్' విచారణకు ఏకరూప పద్ధతి

అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): హెబియస్ కార్పస్ పిటిషన్ల విచారణకు ఏకరూప పద్ధతి/ప్రామాణిక పద్ధతిని పేర్కొంటూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒక కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టుతోపాటు మైనర్ పిల్లల అపహరణకు సంబంధించి కేంద్ర హోంశాఖ ఇచ్చిన సూచనల ఆధారంగా ఈ విచారణ పద్ధతిని రూపొందించినట్లు జీవోలో పేర్కొన్నారు. దీని ప్రకారం, కనిపించకుండా పోయిన వ్యక్తుల సమాచారం మొత్తాన్ని జనరల్ డైరీలో పొందుపరచాలని.. ఇలాంటి కేసులకు అవసరమైతే జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, కనిపించకుండా పోయిన వ్యక్తి జాడ తెలిసే వరకూ విచారణ కొనసాగాలని ఆదేశించారు.

## కుల పత్రాలపై పిటిషన్ కొట్టివేత

ప్రతిపక్షాలకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కులధ్రువీకరణ పత్రాలు, నో డ్యూ సర్టిఫికెట్లను కొంతమంది అధికారులు ఉద్దేశపూర్వకంగా జారీ చేయడం లేదని, అధికార పార్టీ ప్రోద్బలంతోనే వారు ఈ పనికి పాల్పడుతున్నారని పేర్కొంటూ టీడీపీ నేత బుద్దా వెంకన్న దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టివేసింది. బాధితులైన అభ్యర్థులు పిటిషన్లు దాఖలు చేస్తే పరిశీలిస్తామని స్పష్టం చేసింది. కులధ్రువీకరణ సర్టిఫికెట్లు ఇవ్వకపోతే ఎన్నికల ట్రిబ్యునల్‌కు వెళ్లాలని చీఫ్‌జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎన్.జయసూర్యలతో కూడిన ధర్మాసనం శుక్రవారం సూచించింది.

## రాష్ట్రంలో 32 విద్యుత్ చార్జింగ్ స్టేషన్లు

అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు రాజస్థాన్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంట్స్ లిమిటెడ్ ముందుకొచ్చింది. ఏపీ రెన్యువబుల్ ఎనర్జీ కార్పొరేషన్ ఈ మేరకు ఆ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రంలో 32 చోట్ల చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటుచేయనున్నారు. విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి తదితర ప్రాంతాల్లో ఇవి అందుబాటులోకి వస్తాయి.

## 'కిక్కులోనూ నొక్కుడే'పై విచారణ

అమరావతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మద్యం బ్రాండ్ల విషయంలో జరుగుతున్న గోల్‌మాల్ వ్యవహారంపై విచారణ చేపట్టాలని ఎక్సైజ్ శాఖ నిర్ణయించింది. పాపులర్ బ్రాండ్లకు ఆర్డర్లు వెళ్లడం లేదని, కమీషన్లు ఇచ్చిన వారికే ఆర్డర్లు వెళ్తున్నాయనే ఆరోపణలపై 'కిక్కులోనూ నొక్కుడే' శీర్షికన గత నెల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఇప్పుడు స్పందించింది. ఈ కథనంలోని అంశాలపై విచారణ చేసి మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వినీత్ బ్రిజ్‌లాల్ అన్ని జిల్లాల అసిస్టెంట్ కమిషనర్లకు ఆదేశాలు జారీచేశారు. ఆదేశాలతో పాటు 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని కూడా వారికి పంపారు.

## వాటర్ గ్రిడ్‌పై సీఎం సమీక్ష

అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వాటర్ గ్రిడ్ నిర్మాణం.. నిర్వహణలకు సంబంధించిన కార్యాచరణపై పంచాయతీరాజ్ శాఖతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమీక్షలో పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి ద్వివేది, వగాస్ ఆక్వా సీఈవో సంజీవ్ శర్మ, ఎండీ రాజన్ జైప్రకాశ్, డైరెక్టర్ కేఎల్ నారాయణ, వైటల్ కేపిటల్ ఎండీ విద్యావత్సల్ హాజరయ్యారు.

## 17 నుంచి 'ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్' మెయిన్స్

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ మెయిన్ (ఆన్‌లైన్) పరీక్ష షెడ్యూల్ ప్రకారం ఈ నెల 17 నుంచి 19 వరకు జరుగుతుందని ఏపీపీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. 17న ఉ.9.30 నుంచి 11.10 గం. వరకు జనరల్ ఇంగ్లీషు, జనరల్ తెలుగు (ఈ రెండూ విడివిడిగా క్వాలిఫై కావాలి), సా.3 నుంచి 5.30 గం. వరకు పేపర్-1 జనరల్ స్టడీస్-మెంటల్ ఎబిలిటీ, 18న ఉ.9.30 నుంచి 12 గం. వరకు పేపర్-2 మ్యాథ్స్, సా.3 నుంచి 5.30 గం. వరకు పేపర్-3 జనరల్ ఫారెస్ట్రీ-1, 19న ఉ.9.30 నుంచి 12గం.వరకు పేపర్-4 జనరల్ ఫారెస్ట్రీ పేపర్లలో పరీక్షలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

## ఈ-నామ్ వేదికతో 22 మార్కెట్ల అనుసంధానం

న్యూఢిల్లీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని 216 వ్యవసాయ మార్కెట్లలో ఇంతవరకు 22మార్కెట్లను ఈ-నామ్ వేదికతో అనుసంధానించినట్లు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ వెల్లడించారు. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌లో పారదర్శకత కోసమే ఈ-నామ్ విధానమని స్పష్టం చేశారు. శుక్రవారం రాజ్యసభలో వైసీపీ నేత వి.విజయసాయి రెడ్డి అడిగిన ఒక ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు.

## తూర్పు, గాజుల కాపు వర్గాన్ని ఓబీసీగా గుర్తించండి

న్యూఢిల్లీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కడ జీవిస్తున్నా, స్థిరపడినా తూర్పు కాపు, గాజుల కాపు సామాజికవర్గాలను ఓబీసీలుగా గుర్తించాలని వైసీపీ ఎంపీ రఘురామకృష్ణంరాజు కేంద్రాన్ని కోరారు. శుక్రవారం లోక్‌సభలో కేంద్ర సామాజిక న్యాయశాఖ పద్దులపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో అధికంగా తూర్పు కాపు, గాజుల కాపు సామాజికవర్గాలకు ఓబీసీ రిజర్వేషన్లు కల్పిస్తున్నా ఇతర ప్రాంతాల్లో ఉంటున్న ఆ వర్గాలకు రిజర్వేషన్లు అమలు కావడం లేదని తెలిపారు. కాగా, కింది స్థాయి నుంచి అత్యున్నత స్థాయికి ఎదిగిన ప్రధాని మోదీ నాయత్వంలో సామాజిక న్యాయశాఖకు నిధుల కేటాయింపులో పెద్దపీట వేయడం శుభపరిణామమని వ్యాఖ్యానించారు.

# నాడు దూకుడు..నేడు దాటవేత

- 'మంగళగిరి'లో నాన్ బెయిలబుల్
- 20మంది అరెస్టు..ఏడుగురు జైల్లోనే
- రాజధానిలో ఇంకా సాగుతున్న వేట
- 'మాచర్ల'లో మొదట బెయిలబుల్
- దాడికి కారణంగా ముగ్గురే గుర్తింపు
- వారిలో ఒకరు నామినేషనూ దాఖలు
- తప్పకే అరెస్టు..హత్యాయత్నం కేసు



మాచర్ల ఎమ్మెల్యే కారుపై రాళ్ళు రువ్వడంతో అద్దం పగిలిన దృశ్యం (ఫైల్)



టీడీపీ నేతలపై దాడి చేస్తున్న తురకా కిశోర్(ఫైల్)

జిల్లా అదే! ఒకచోట ఆందోళన జరుపుతున్న రైతుల మధ్యకు వచ్చిన అధికార పార్టీ ఎమ్మెల్యే వాహనంపై జరిగిన దాడి! మరోచోట... బాధిత నేతలకు భరోసా ఇచ్చి, దాడులపై ఫిర్యాదు చేసేందుకు వెళ్తున్న విపక్ష నాయకుల వాహనంపై దుడ్డుకర్రతో దాడి చేసి, లోపలున్న నాయకులను కూడా కర్రతో కుళ్ల బొడిచిన ఘటన! అధికార పార్టీ నాయకుడి వాహనంపై దాడి చేసిన రైతులపై కఠిన సెక్షన్ల కింద అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించారు. విపక్ష నేతలను దుడ్డుకర్రతో కొట్టి గాయపరిచిన వ్యక్తిని మాత్రం... 'సేఫ్'గా స్టేషన్ బెయిలు ఇచ్చి పంపించారు. తర్వాత 'తప్పని సరి' పరిస్థితుల్లో అరెస్టు చేశారు. ఇదీ... పోలీసుల వైఖరి!

రాజధానిని అమరావతిలోనే ఉంచాలంటూ ఉద్యమిస్తున్న రైతులు గత జనవరి 7న జేఏసీ పిలుపు మేరకు మంగళగిరి వద్ద జాతీయ రహదారిని దిగ్బంధించారు. ఈ రహదారిపై ఉన్న కాజా టోల్‌గేట్ సమీపంలో రైతులు, వివిధ పార్టీల కార్యకర్తలు జాతీయ రహదారిపై ధర్నా చేస్తుండగా మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కారు అటువైపు వచ్చింది.

ఆ కారును రైతులు చుట్టుముట్టి జై అమరావతి అంటూ నినాదాలు చేశారు. ఆ సమయంలో గన్‌మెన్ రైతుపై దురుసుగా వ్యవహరించి నెట్టి వేశారు. దీంతో ఆగ్రహించిన రైతులు గన్‌మెన్‌పై దాడికి యత్నించారు. రాళ్ళు రువ్వడంతో ఎమ్మెల్యే కారు అద్దం పగిలింది. ఈ ఘటనపై మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పిన్నెల్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు పలు నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

అమరావతి ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటున్న వారే లక్ష్యంగా విడతల వారీగా అరెస్టులు చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 20 మందిని నిందితులుగా గుర్తించారు. వారిలో కొందరు ముందస్తు బెయిల్ పొందగా, పది మంది మాత్రం పదిరోజులకుపైగా జైలులో రిమాండ్‌లో ఉన్నారు. వారిలో ముగ్గురు గురువారం బెయిల్‌పై విడుదలయ్యారు.

**స్టేషన్ బెయిలు ఇచ్చి పంపించి:** నామినేషన్లు పడకుండా టీడీపీ అభ్యర్థులను వైసీపీ కార్యకర్తలు అడ్డుకోవడంపై పరిశీలనకు ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, మాజీ ఎమ్మెల్యే బొండా ఉమా బుధవారం మాచర్ల వెళ్లారు. అక్కడ వారు ప్రయాణిస్తున్న వాహనాలపై వైసీపీ యువజన నేత తురకా కిశోర్ తన బృందంతో హంతకదాడులకు పాల్పడటం అందరూ చూస్తూనే ఉన్నారు. అంతకుముందు వైసీపీ కార్యకర్తలు చేసిన దాడిలో టీడీపీ న్యాయసలహాదారు కిశోర్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తురకా కిశోర్‌సహా ముగ్గురే దాడిలో పాల్గొన్నట్టు గుర్తించారు. తామే సుమోటోగా కేసు నమోదుచేసి.. బెయిలబుల్ సెక్షన్లతో సరిపెట్టారు. దీంతో గురువారం కిశోర్ స్వేచ్ఛగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ ఘట్టం ముగిసిన కొద్దిగంటలకే హత్యాయత్నం కింద నాన్‌బెయిలబుల్ కేసు కిశోర్‌పై నమోదు చేశారు. ఈ కేసులో శుక్రవారం అరెస్టు చేసి.. రిమాండ్‌కు తరలించారు.

\- గుంటూరు

# టీడీపీకి కేఈ ప్రభాకర్ గుడ్‌బై

- పార్టీకి రాజీనామా చేసిన కర్నూలు నేత
- ఎమ్మెల్సీగా కొనసాగుతానని వెల్లడి
- కోట్ల, టీజీల పెత్తనమే రాజీనామాకు కారణమని ఆరోపణ
- 3 కార్పొరేటర్ స్థానాలు అడిగితే ఇవ్వలేదని విమర్శ
- ఆయన చెప్పేవన్నీ అబద్ధాలు.. 5 సీట్లిచ్చాం
- వాయిస్ రికార్డులు కూడా ఉన్నాయ్: టీజీ భరత్
- వెళ్లిపోవడానికి సాకులు వెతుక్కున్నారు: కోట్ల



కర్నూలు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్ శుక్రవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లుకు పంపారు. అయితే, టీడీపీ ద్వారా లభించిన ఎమ్మెల్సీ పదవికి మాత్రం రాజీనామా చేయబోనని వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ కర్నూలులో మీడియాతో మాట్లాడుతూ.. జిల్లా పార్టీలో కోట్ల, టీజీ కుటుంబాల పెత్తనం ఎక్కువైందని ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో తన అనుచరులకు కార్పొరేటర్ స్థానాలను కేటాయించలేదని అందువల్లే టీడీపీకి రాజీనామా చేయాల్సి వచ్చిందన్నారు. "ఇతర పార్టీల నుంచి వచ్చిన వారే టీడీపీలో అధికారం చెలాయిస్తున్నారు. కర్నూలు సహా నంద్యాల పార్లమెంటు నియోజకవర్గాల్లో జోక్యం చేసుకుంటున్నారు. పార్టీపరంగా మేం ప్రాతినిధ్యం వహిస్తున్న డోన్‌లోనూ వారే నిర్ణయాలు తీసుకుంటున్నారు. దీంతో కార్యకర్తలకు న్యాయం జరగడం లేదు. కర్నూలు కార్పొరేషన్‌లో పోటీకి మాకు 3 కార్పొరేటర్ స్థానాలు ఇవ్వాలని కోరాం. అయినా ఇవ్వలేదు. అందుకే పార్టీకి రాజీనామా చేశాను" అని చెప్పారు. తాను ఏ పార్టీలో చేరబోయేదీ త్వరలో ప్రకటిస్తానని ప్రభాకర్ తెలిపారు. "నేను ఎమ్మెల్సీగా పోటీ చేసినప్పుడు వైసీపీ అధినేత జగన్ నాపై ఎవరినీ పోటీకి పెట్టలేదు. నాలాంటి నాయకుల విలువ ఆయనకు తెలుసు" అని వ్యాఖ్యానించారు.

## వెళ్లడానికి అదో సాకు: కోట్ల

తమ మధ్య వ్యక్తిగతంగా, రాజకీయంగా ఎలాంటి విభేదాలూ లేవని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ నేత కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి అన్నారు. కేఈ ప్రభాకర్ పార్టీ మారడానికి లేనిపోని విషయాలను సాకుగా చూపుతున్నారని మండిపడ్డారు. టీడీపీలో తాను ఎవరిపైనా పెత్తనం చేయలేదని, ఇతరుల నియోజకవర్గాల్లోనూ జోక్యం చేసుకోలేదని అన్నారు. పెత్తనం చేయడానికి తాము అధికార పార్టీలో లేమని, ప్రతిపక్షంలో ఉండి పెత్తనం చేయడం ఎలా సాధ్యమవుతుందో చెప్పాలని ప్రశ్నించారు.

## విలువలు పెరగవు: భరత్

కేఈ ప్రభాకర్ చెప్పేవన్నీ అబద్ధాలని కర్నూలు నియోజకవర్గం టీడీపీ సమన్వయకర్త టీజీ భరత్ అన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో తొలుత 3 కార్పొరేటర్ స్థానాలు అడిగారని, తర్వాత 5 కావాలని పట్టుబట్టారని అయినా ఇచ్చామని తెలిపారు. దీనికి సంబంధించి ప్రభాకర్‌తో జరిపిన చర్చల తాలూకు వాయిస్ రికార్డులు తమ వద్ద ఉన్నాయన్నారు. పార్టీ మారాలంటే ధైర్యంగా మారాలే తప్ప పక్క వాళ్లపై ఆరోపణలు చేసి వెళ్తే విలువలు పెరగవని భరత్ హితవు పలికారు.



# రాజీ.. నామాలే!

- పదవికి రాజీనామా చేశాకే వైసీపీలోకి రావాలన్నారు
- రాజీనామా చేయకుండానే.. వైసీపీలోకి ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలు
- రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ

అమరావతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): 'ఇతర రాజకీయ పక్షాలకు చెందిన ఎమ్మెల్యేలు వైసీపీలో చేరాలంటే ముందస్తుగా శాసనసభ సభ్యత్వాలకు రాజీనామా చేయాల్సిందే. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి అఖండ మెజారిటీ ఇచ్చారు. ఇతర పార్టీల గుర్తుపై గెలిచిన శాసనసభ్యులను వైసీపీలోకి చేర్చుకోం. ఒకవేళ వారంతట వారు వస్తే.. కచ్చితంగా సభ్యత్వాలకు రాజీనామా చేయాలి' అని అసెంబ్లీ వేదికపై వైసీపీ అధినేత, సీఎం జగన్మోహన్ రెడ్డి గతంలో స్పష్టం చేశారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి కూడా తెలుగుదేశం ఎమ్మెల్యేలు వారి పదవులకు రాజీనామా చేశాకే వైసీపీలోకి తీసుకుంటామని విశాఖలో ఇటీవల వెల్లడించారు. కానీ వైసీపీ ప్రస్తుత వ్యవహార శైలి ఇందుకు విరుద్ధంగా ఉందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. స్వీయ నిబంధనకు జగన్ నీళ్లొదిలేసినట్లుగా ఉందని అంటున్నాయి. తెలుగుదేశం ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ, మద్దాలి గిరి, కరణం బలరామకృష్ణమూర్తి ఉదంతాలను ప్రస్తావిస్తున్నాయి. వీరు ముగ్గురూ టీడీపీకి దూరంగా ఉంటూ.. వైసీపీతో సఖ్యతతో మెలుగుతున్నారు. జగన్మోహనరెడ్డి విధానాలు తమను ఆకర్షించాయని ప్రశంసలు గుప్పిస్తున్నారు. టీడీపీ బీ-ఫాంపై గెలిచినప్పటికీ.. తమను ప్రత్యేకంగా గుర్తించాలంటూ వల్లభనేని వంశీ, మద్దాలి గిరి కోరారు. వారి కోరిక మేరకు అసెంబ్లీలో వారికి ప్రత్యేకంగా స్థానాలు కేటాయించారు. గురువారం ముఖ్యమంత్రిని ప్రకాశం జిల్లా చీరాల టీడీపీ ఎమ్మెల్యే కరణం బలరాం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జగన్‌ను కలిశారు. ఈ భేటీ మర్యాదపూర్వకమేనని చెబుతున్నా.. బలరాం తెలుగుదేశం పార్టీకి గుడ్‌బై చెప్పి వైసీపీలోకి జంప్ చేశారని అంటున్నారు. దీనికి బలం చేకూర్చేలా మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ మాట్లాడారు. తమ జిల్లాలోని నేతలందరమూ కలుస్తామని.. బలరాంతోనూ సఖ్యతగా ఉంటామని చెప్పారు. వీటన్నిటినీ నిశితంగా గమనిస్తున్న రాజకీయ విశ్లేషకులు.. స్వీయ నిబంధనకు సీఎం నీళ్లొదిలేశారనిపిస్తోందని వ్యాఖ్యానిస్తున్నారు. 'దేశంలోనే అత్యున్నత ఆదర్శ రాజకీయాలు చేస్తాం. గతంలో వైసీపీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను టీడీపీ సంతలో పశువులను కొన్నట్లుగా కొన్నది. ఇలాంటి నీతి బాహ్యమైన రాజకీయాలను వైసీపీ చేయదు. దేశానికే దిక్సూచిలా వ్యవహరిస్తాం' అని సీఎం అయిన కొత్తలో శాసనసభలో ఆయన చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తున్నారు.

# రాష్ట్రంలో అరాచక ప్రభుత్వం

**దేవాలయ, మాన్సాస్ భూములపై కన్నేసిన వైసీపీ: కన్నా**

దాసన్నపేట(విజయనగరం), మార్చి 13: "రాష్ట్రంలో అరాచక ప్రభుత్వం నడుస్తోంది. స్థానిక ఎన్నికలు సజావుగా సాగే పరిస్థితులు లేవు. వైసీపీ నాయకులు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రేక్షక పాత్ర పోషిస్తోంది" అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ విజయనగరంలో ఆరోపించారు. ఎన్నికల్లో నామినేషన్ వేసిన బీజేపీ, జనసేన నాయకులను నిర్దాక్షిణ్యంగా అనర్హులుగా ప్రకటించడం దారుణమన్నారు.

## ఎన్నికలు రద్దు చేయండి.. గవర్నర్‌కు పీసీసీ వినతి



గవర్నర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

విజయవాడ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): "ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలను తక్షణమే రద్దు చేయాలి. తగిన సమయం ఇచ్చి తిరిగి ఈ ఎన్నికలను నిర్వహించాలి. రాష్ట్రంలో జరిగిన ఏకగ్రీవాల్లో 95 శాతం బలవంతంగా జరిగినవే" అని పీసీసీ గవర్నర్‌కు ఫిర్యాదు చేసింది. శుక్రవారం పీసీసీ చీఫ్ శైలజానాథ్, డాక్టర్ గంగాధర్, నరహరశెట్టి నరసింహరావు తదితరులు రాజ్‌భవన్‌లో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను కలిశారు. స్థానిక ఎన్నికలు జరుగుతున్న తీరుపై ఆయనకు ఫిర్యాదు చేశారు.

### ముస్లింలీగ్‌తో కాంగ్రెస్ జట్టు.. నేడు సీపీఎం మధుతో భేటీ

స్థానిక సంస్థల ఎన్నికల్లో ముస్లిం లీగ్ పార్టీతో కలిసి పోటీ చేయాలని కాంగ్రెస్ నిర్ణయించినట్లు శైలజానాథ్ వెల్లడించారు. సీఏఏ, ఎన్ఆర్సీ విషయంలో పోరాడుతున్న అన్ని పక్షాలను కలుపుకుని ఒక కూటమిగా ఏర్పడాలని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఇప్పటికే ముస్లిం లీగ్ పోరాటం చేస్తోంది. దీనితో పాటుగా సీపీఎంను కూడా కలుపుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇందులో భాగంగా ఆ పార్టీ కార్యదర్శి పి.మధుతో శైలజానాథ్ శనివారం భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## ఆంధ్రలో అప్రజాస్వామిక విధానాలు: నాదెండ్ల

రాజమహేంద్రవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): "ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ప్రస్తుతం నెలకొన్న అప్రజాస్వామిక విధానాలు ఎప్పుడూ లేవు. స్థానిక ఎన్నికల్లో నామినేషన్లు కూడా వేయకుండా అధికార వైసీపీ అడ్డుకుంటోంది. ప్రజలను, ప్రతిపక్షాలను కూడా భయభ్రాంతులకు గురి చేస్తోంది. గతంలో ప్రజాస్వామ్యాన్ని గౌరవించి సొంత ఆస్తులను కూడా త్యాగం చేసి రాజకీయాలు చేసేవారు. ఇవాళ పరిస్థితిని చూస్తుంటే బాధ కలుగుతోంది" అని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. జనసేన నేతలు, అభ్యర్థులపై రాయలసీమలో దౌర్జన్యం చేశారన్నారు. సీఎం జగన్ 90 శాతం సీట్లు గెలవాలని పిలుపునివ్వడంతో మంత్రులు, నేతలు రెచ్చిపోయి వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారన్నారు.

### నేడు, రేపు రాజమహేంద్రవరంలో పవన్ పర్యటన

జనసేన అధినేత పవన్ కల్యాణ్ శని, ఆదివారాల్లో రాజమహేంద్రవరంలో పర్యటిస్తున్నారని తెలిపారు. 14న పార్టీ ఆవిర్భావ సమావేశం నిర్వహించి ఆరేళ్లలో పార్టీ పరిస్థితిని సమీక్షిస్తామని తెలిపారు. అదే రోజు సాయంత్రం ధవళేశ్వరం రామపాదాల రేవు వద్ద 'మన నది - మన నుడి' కార్యక్రమంలో భాగంగా గోదావరికి హారతి ఇచ్చి రచ్చబండ నిర్వహిస్తారన్నారు.

## ఎన్నికల కమిషన్ నిద్రపోతోంది: సీపీఐ

అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన ఎన్నికల కమిషన్ నిద్రపోతోంది. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంతగా ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులపై దాడులు, నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుపడటం, ఇళ్ళకు వెళ్ళి బెదిరింపులకు దిగడం చోటు చేసుకొంటున్నాయి. డీజీపీని కోర్టులో నిలువు జీతం వేసినా ప్రభుత్వానికి సిగ్గు లేదు" అని సీపీఐ నేతలు కె. రామకృష్ణ, ముప్పాళ్ళ నాగేశ్వరరావు, రావుల వెంకయ్య ధ్వజమెత్తారు.

## శాంతిభద్రతలకు ఢోకా లేదు: డీజీపీ



అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ భద్రతా చర్యలు తీసుకున్నామని డీజీపీ గౌతం సవాంగ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాంతిభద్రతలకు ఢోకా లేదన్నారు. ఈ అంశంపై రాజకీయ కోణంలో ఆరోపణలు చేయొద్దని, రాజకీయ ఆరోపణల్లోకి పోలీసులను లాగొద్దని పార్టీలకు, నాయకులకు ఆయన సూచించారు. ఏ పార్టీ వారు ఫిర్యాదు ఇచ్చినా తీసుకుని తక్షణమే విచారణ చేస్తున్నామన్నారు. ఎన్నికల సంఘంతో సమన్వయం చేసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రత్యేకించి మాచర్ల ఘటనపై చట్టపరంగా ముందుకెళ్తున్నామని ప్రకటించారు. ఆ ఘటనలో ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేశామని, వారు గురజాల సబ్‌జైల్లో ఉన్నారని డీజీపీ వివరించారు.

## తాడిపత్రి ఎమ్మెల్యేకు సుతిమెత్తని ఆంక్ష

**15న ప్రచారం నిర్వహించకూడదని కమిషన్ ఉత్తర్వులు**

అమరావతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆయన తాడిపత్రి వైసీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఇటీవల ఆయన తాడిపత్రి మున్సిపాలిటీలో చీరలు, బట్టలు పంచిపెట్టినట్లు ఫిర్యాదులొచ్చాయి. ఈ సంఘటనపై ఎన్నికల పరిశీలకులు క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. ఆ మున్సిపాలిటీలోని శ్రీరాములపేటలో చీరలు పంపిణీ చేసినట్లు నిర్ధారించారు. దానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్పందించింది. అయితే ఆ ఎమ్మెల్యేకు వేసిన శిక్ష ఏంటంటే.. ఆయన ఈ నెల 15న ఎన్నికల ప్రచారం చేయకూడదట. తలుపుచెక్కతో నువ్వొకటంటే తమలపాకుతో నేను రెండు అంట.... అన్న సామెతను ఎన్నికల కమిషన్ రివర్స్‌లో అమలు చేసిందంటున్నారు. తలుపు చెక్కతో నువ్వు రెండంటే తమలపాకుతో సుకుమారంగా నేను ఒకటంటాను అన్నట్లు ఉందని చెప్పుకుంటున్నారు.

## వైసీపీకి వార్డు సచివాలయ ఉద్యోగి ప్రచారం!

విజయనగరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు ఓటు వేయాలని సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగి కె.శ్రీకాంత్‌ను అధికారులు ఎన్నికల విధుల నుంచి తప్పించారు. విజయనగరం జిల్లా సాలూరు మున్సిపాలిటీలోని వార్డు సచివాలయంలో ఇటీవలే ఉద్యోగం సంపాదించిన ఆయన.. వైసీపీ తరపున సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నాడు. సచివాలయాలకు వస్తున్న మహిళలు, వృద్ధులకు కూడా ఓటుపై సూచనలు ఇస్తున్నట్లు సమాచారం.

## పురపాలికల్లో ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్: రాష్ట్రంలోని 12 నగరపాలక సంస్థలు, 75 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో నామినేషన్ల దాఖలకు గడువు ముగిసింది. చివరి రోజైన శుక్రవారం ఒక్కరోజే 15,160 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో కార్పొరేషన్లకు 5,010, పురపాలక సంఘాలు, నగర పంచాయతీలకు 10,150 నామినేషన్లు దాఖలయ్యాయి. కాగా.. గడువు ముగిసేసరికి మొత్తం 18,240 నామినేషన్లు దాఖలయ్యాయి. 12 నగర పాలకసంస్థల్లో మొత్తం 671 డివిజన్లకు, 75 పురపాలక, నగర పంచాయతీల్లో 2,123 వార్డులకు ఈ నెల 23వ తేదీ ఎన్నికలు జరగనున్నాయి. కాగా, కర్నూలు జిల్లావ్యాప్తంగా పలు జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్లను వివిధ కారణాలతో రిటర్నింగ్ అధికారులు తిరస్కరించారు. జిల్లావ్యాప్తంగా 51 జడ్పీటీసీ స్థానాలకు 10 నామినేషన్లు, 804 ఎంపీటీసీ స్థానాల్లో 255 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 48 జడ్పీటీసీ స్థానాలకు సంబంధించి 314 మంది బరిలో నిలిచారు. శుక్రవారం ఒక్కరోజే 27 మంది అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 61 జడ్పీటీసీ స్థానాలకు 486 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇప్పటి వరకు 54 మంది అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. 1,086 ఎంపీటీసీ స్థానాలకు 5,563 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో 246 నామినేషన్లు తిరస్కరణకు గురవగా, 5,317 నామినేషన్లు ఆమోదం పొందాయి. కాగా.. కృష్ణాజిల్లాలో ఎనిమిది ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఎదురుమొండి, రేమాలవారి పాలెం, కోరుకొల్లు-2, దండిగానపూడి, వడాలి, బొమ్ములూరు, ప్రసాదంపాడు-3 ఎంపీటీసీ స్థానాల నుంచి వైసీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, ప్రసాదంపాడు -2 స్థానం నుంచి టీడీపీ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# వైసీపీలో రోడ్డెక్కిన అసంతృప్తి

**పాలకోడేరులో మహిళా నేత నిరసన.. సీనియర్లకు గౌరవం లేదు: మాజీ మంత్రి జానీ**

పాలకోడేరు, గుంటూరు, మార్చి 13: స్థానిక పోరులో వైసీపీలోని విభేదాలు, అసంతృప్తులు బయటపడుతున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలం శృంగవృక్షంకు చెందిన మహిళా నేత కటిక శ్రీదేవి ఏకంగా పాదయాత్రను ప్రారంభించారు. పార్టీలో మొదటి నుంచి ఉన్న వారికి విలువ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జడ్పీటీసీగా నామినేషన్ వేసిన ఆమెకు పోటీగా గొల్లలకోడేరు మాజీ సర్పంచ్ పెద్దిశెట్టి సుబ్రహ్మణ్యం సతీమణి లక్ష్మీ తులసి నామినేషన్ వేశారు. దీంతో అసంతృప్తికి గురైన శ్రీదేవి, తన మద్దతుదారులతో కలిసి గ్రామ చెరువులో దిగి నిరసన తెలిపారు. అనంతరం నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని రాజధానికి పాదయాత్రగా బయలుదేరారు. మరోవైపు గుంటూరులో మాజీ మంత్రి మహమ్మద్ జానీ మీడియా ముందుకొచ్చారు. ముగ్గురు సీఎంల వద్ద మంత్రిగా పనిచేసిన తనకు కనీస గౌరవం లేకుండా పోతోందని వాపోయారు. తన కుమారుడికి, ఐదు సార్లు కార్పొరేటర్‌గా గెలిచిన అఫ్సర్‌కు టికెట్ ఇవ్వాలని కోరితే ఇవ్వలేదన్నారు. సీనియర్లను గుర్తించాలని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేసిన జానీ.. పార్టీ కోసమే పనిచేస్తానని చెప్పారు.



మద్దతుదారులతో పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు నుంచి అమరావతికి పాదయాత్ర చేస్తున్న వైసీపీ మహిళా నేత శ్రీదేవి

**కరోనా కన్నా**

# జగనే డేంజర్!

- ఆ వైరస్‌కన్నా ఈ వైరసే ప్రమాదం
- పోటీకి ఎవరికీ చాన్సివ్వని ఉన్మాదం
- ఇంతదానికసలు ఎన్నికలెందుకు?
- రద్దు చేసి మొత్తం నామినేట్ చేసుకోండి
- ఆడవాళ్ళ జాకెట్లలో చేతులు పెట్టి నామినేషన్ పత్రాలు లాక్కొంటారా?
- ప్రజాస్వామ్యమా.. ఆటవికరాజ్యమా?
- టీడీపీ అధినేత చంద్రబాబు ఆగ్రహం



అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ ప్రపంచాన్ని వణికిస్తుంటే జగన్ ఉన్మాద వైరస్ రాష్ట్రాన్ని భయభ్రాంతులకు గురిచేస్తోందని తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. ఆ వైరస్ కంటే ఈ వైరస్ ఇంకా ప్రమాదకరంగా మారిందని, ఈ ఉన్మాదం ఆవరించిన రాష్ట్రంలో వైసీపీ తప్ప మరే పార్టీ ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి లేదన్నారు. చివరకు బీజేపీ నేతలు కూడా ఢిల్లీకి రాయాల్సి వచ్చిందని ధ్వజమెత్తారు. తమ పార్టీ నేత వర్ల రామయ్యతో కలిసి శుక్రవారం సాయంత్రం ఆయన ఇక్కడి మంగళగిరిలోని జాతీయ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. "ఇది ప్రజాస్వామ్యమా... ఆటవిక రాజ్యమా? గెలుపే కావాలనుకొంటే మొత్తం ఎన్నికలు రద్దు చేసి అన్ని పదవుల్లో మీ (వైఎస్ జగన్‌ను ఉద్దేశించి) వాళ్లనే నామినేట్ చేసుకొంటే పోయేది. ఎన్నికల్లో ఇన్ని దారుణాలు ఈ రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగం" అని చంద్రబాబు పేర్కొన్నారు. తమ పార్టీ నేతలు ప్రాణాలకు తెగించి ఎన్నికల్లో పోటీ చేయడానికి ముందుకు వచ్చినా వారిని అసలు నామినేషన్లు కూడా వేయనీయడం లేదని, చివరకు మునిసిపాలిటీల్లో ఒక్క వార్డులో కూడా నామినేషన్లు వేయనీయకుండా అడ్డగించడం దుర్మార్గమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆకాశం నుంచి ఊడిపడ్డారా? ఆయన ప్రజలతో ఎన్నిక కాలేదా? డోన్ మునిసిపాలిటీలో ఎవరూ నామినేషన్లు వేయకూడదా? పంచాయతీరాజ్ మంత్రి నియోజకవర్గం పుంగనూరులో అరాచకాలకు అడ్డే లేకుండా పోయింది. ఆ మంత్రికి కనీసం సిగ్గు కూడా లేదు. తిరుపతిలో కూడా నామినేషన్లు వేయనీయని పరిస్థితిని మొదటిసారి చూశాం. దుర్మార్గాలను కడప నుంచి చిత్తూరు జిల్లాకు కూడా పాకిస్తున్నారు. కడప జిల్లాలో ప్రజాస్వామ్యం ఎక్కడ ఉందా అని వెతుక్కోవాల్సి వస్తోంది. జమ్మలమడుగు, ఎర్రగుంట్లలో కూడా పోటీ చేయడానికి ఎవరూ ముందుకు రాని పరిస్థితి! మాచర్లలో మొత్తం 31 వార్డులూ ఏకగ్రీవం. పోటీ చేయాలనుకొన్న టీడీపీ నేతలను ఇళ్ల లోనే అరెస్టు చేశారు. ఎంత దిగజారాలో అంత దిగజారి చివరకు పోలీసులతో టీడీపీ నేతలను కిడ్నాప్ చేయిస్తున్నారు. గతంలో ఐదు శాతం నేరగాళ్లు ఉండేవారు. ఇప్పుడు ఆ సంఖ్యను 70- 80 శాతానికి తీసుకువెళ్లిన ఘనత వైసీపీదే. మీకు నిజంగా ప్రజలపై నమ్మకం ఉంటే ఎన్నికలు సాఫీగా జరగనిచ్చేవారు. ఆ నమ్మకం లేకే రౌడీయిజాన్ని నమ్ముకొన్నారు. రాబోయే రోజుల్లో మీకూ అదే ఎదురవుతుందని గుర్తుంచుకోండి" అని ఆయన హెచ్చరించారు.

### వీరంగాలకు ఈ వీడియోలే సాక్ష్యం

రాష్ట్రంలో వివిధ నియోజకవర్గాల్లో చోటు చేసుకొన్న పరిణామాలకు సంబంధించి కొన్ని వీడియోలను చంద్రబాబు విలేకరుల సమావేశంలో ప్రదర్శించారు. "తెనాలిలో అడుసుమిల్లి వెంకటేశ్వరరావు అనే టీడీపీ నేత ఇంటిపై అర్ధరాత్రి మద్యం బాటిళ్లు తెచ్చి వైసీపీ నేతలు దాచారు. అది సీసీ కెమెరాల్లో రికార్డయింది. పొద్దున్నే ఎక్సయిజ్ నేతలు వచ్చి నేరుగా వాటిని దాచిన చోటుకు వెళ్లి స్వాధీనం చేసుకొని టీడీపీ నేతను అరెస్టు చేశారు. గుంటూరు జిల్లాలో రేపల్లె నియోజకవర్గంలో టీడీపీ నేత గడ్డివాములో బాటిళ్లు పెట్టి కేసు నమోదు చేశారు. చిత్తూరు జిల్లాలో టీడీపీ నేత కామేశ్ యాదవ్ ఇంట్లో కూడా మందు బాటిళ్లు పెట్టి కేసు పెట్టారు. చూడబోతే కల్తీ సారా తయారు చేసి ప్రాణాలు తీసి ఆ నేరాలు కూడా టీడీపీ వారిపై నెట్టినా నెట్టవచ్చని అనిపిస్తోంది" అని ఆందోళన వ్యక్తం చేశారు. పుంగనూరులో మునిసిపల్ నామినేషన్ల సందర్భంగా జరిగిన సంఘటనలు అరాచకానికి పరాకాష్ఠ అని చంద్రబాబు చెప్పారు. "వైసీపీ నేతలు లాక్కొని చించివేస్తున్నారని.. ఒక మహిళ తన జాకెట్లో నామినేషన్ పత్రం దాచుకొని ప్రభుత్వ కార్యాలయం వద్దకు వచ్చింది. అయినా, వదలకుండా ఆమె జాకెట్లో చేతులు పెట్టి ఆ పత్రం లాక్కొనే ప్రయత్నాన్ని వైసీపీ నేతలు చేశారు. దిశ చట్టం గురించి చెబుతారు. ముఖ్యమంత్రి, పంచాయితీరాజ్ మంత్రిని ఈ నేరానికి ఈ చట్టం కింద నమోదు చేయాలి. మరో ఎస్టీ మహిళ అదే పుంగనూరులో నామినేషన్ వేయడానికి వస్తే తరిమేశారు. అయినా ఆమె పట్టుదలగా బురఖా వేసుకొని వస్తే అది కూడా తీయించి కొట్టి పంపారు. ఆమె భర్తను చితకబాదారు. ఎస్సీ ఎస్టీలకు నామినేషన్లు వేసే హక్కు లేదా? కడప జిల్లా రాయచోటిలో ఒక ముస్లిం మైనారిటీ వ్యక్తి నామినేషన్ వేయడానికి వస్తే అతనిని తరిమేశారు. ధర్మవరంలో పోలీసులే టీడీపీ వారిని బయటకు తోసివేశారు. ఏం వ్యవహారాలు ఇవి? మీ పదవుల కోసం రాష్ట్రాన్ని తగలబెడతారా" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

### మాచర్లలో ఇంత దుర్మార్గమా?

టీడీపీ నేతలపై పట్టపగలు హత్యాయత్నానికి ఒడిగట్టిన వైసీపీ నేతకు స్టేషన్ బెయిలు ఇచ్చి బయటకు పంపడం అధికార దుర్వినియోగానికి పరాకాష్ఠగా చంద్రబాబు దుయ్యబట్టారు. "పోలీస్ ఐజీ స్వయంగా మాచర్ల వెళ్లి దాడికి కారకులైన వారిపై హత్యాయత్నం కేసు పెడుతున్నట్లు చెప్పారు. కానీ తర్వాత అవి తీసేసి రూ. రెండు వందలు, ఐదు వందలు ఫైన్లు వేసే సెక్షన్ల కింద కేసు పెట్టారు. సాయంత్రానికి స్టేషన్లోనే బెయిల్ ఇచ్చేశారు. రాజధాని ప్రాంతంలో డ్రోన్‌ను అడ్డుకొన్నారన్న పేరుతో రైతులను ఎనిమిది రోజులు జైల్లో పెట్టారు. వైసీపీ ఎంపీ నందిగం సురేశ్‌ను అడ్డుకొన్నారని అభియోగం మోపి 14 రోజులు జైల్లో ఉంచారు. చట్టం కొందరికి చుట్టం..మరి కొందరికి శాపమా? ఎన్నికలు నిర్వహించే పద్ధతి ఇదేనా?' అని ప్రశ్నించారు. టీడీపీ వారికి మాచర్లలో ఏం పనని మంత్రులు ఎలా ప్రశ్నిస్తారని మండిపడ్డారు. "మాచర్ల ఈ రాష్ట్రంలో లేదా? అదేమైనా వారి ప్రైవేట్ ద్వీపమా? అక్కడి ప్రజలకు రక్షణ అవసరం లేదా? నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం ఒక దుర్మార్గమైతే, ఆతర్వాత ఏకంగా 162 చోట్ల టీడీపీ అభ్యర్థుల నామినేషన్లను స్క్రూటినీలో తొలగించారు. ఇంకా బరిలో ఉన్న అభ్యర్థుల ఇళ్లపై దాడి చేసి ఉపసంహరించుకోవాలని ఒత్తిడి తెస్తున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ఉన్మాద వైరస్‌కు ప్రజలే శాస్తి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. "కోర్టులు మొట్టికాయలు వేసినా ఈ ఉన్మాదం ఆగడం లేదు. పోలీస్ శాఖ లొంగిపోయింది. ఎన్నికల కమిషన్ చేష్టలుడిగి చూస్తోంది. ఈ సమయంలో ప్రజలే తగిన శాస్తి చేయాలి' అని ఆయన పిలుపునిచ్చారు. కొందరు నాయకులు పోవచ్చునని, తమకు ప్రజలే అభ్యర్థులని... కొత్త నాయకులను ప్రజలే తయారు చేసుకొంటారని ఒక ప్రశ్నకు సమాధానంగా చంద్రబాబు వ్యాఖ్యానించారు.

## సీఎం హెచ్చరికలతోనే అరాచకాలు

**పదవుల కోసం రాష్ట్రం పరువు తీస్తున్నారు: టీడీపీ విమర్శ**

అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): "సానుకూల ఫలితాలు రాకపోతే పదవుల నుంచి పీకేస్తానని ముఖ్యమంత్రి హెచ్చరించారు. దీంతో వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు స్థానిక సంస్థల ఎన్నికల్లో అరాచకానికి పాల్పడుతున్నారు. వాళ్ల పదవుల కోసం రాష్ట్రం పరువు తీస్తున్నారు. బిహార్‌కు మించిన స్థాయిలో రాష్ట్రాన్ని దిగజారుస్తున్నారు" అని తెలుగుదేశం పార్టీ విమర్శించింది. శుక్రవారం ఇక్కడ టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆ పార్టీకి చెందిన శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చిన రాజప్ప విలేకరులతో మాట్లాడారు. "ఫ్యాక్షనిస్టు ఫాసిస్టుగా మారితే ఎలా ఉంటుందో చూస్తున్నాం. భయపెట్టి లోబర్చుకొనే ప్రయత్నం జరుగుతోంది. దీనిపై గవర్నర్‌కు రెండు మూడుసార్లు విన్నవించాం. ఆయన ఇప్పటికైనా స్పందించి కొంత అదుపు చేయాలి. డీజీపీకి, ఎన్నికల కమిషన్‌కు ఎన్ని ఫిర్యాదులు ఇచ్చినా ఉపయోగం ఉండటం లేదు. ప్రతిపక్ష పార్టీలు నామినేషన్లు కూడా వేసే పరిస్థితి లేదు. దీనిపై మేం కోర్టులను ఆశ్రయిస్తున్నాం. గవర్నర్, కోర్టులే తగిన ఆదేశాలు ఇవ్వాలని మా మనవి" అని యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. ప్రభుత్వాలు దారి తప్పినపుడు వాటికి బుద్ధి చెప్పడానికే రాజ్యాంగం ప్రజలకు ఓటు ఆయుధం ఇచ్చిందని, దానిని ప్రయోగించి అధికారంలో ఉన్నవారికి పాఠం చెప్పాలని ఆయన విజ్ఞప్తి చేశారు. స్వయంగా డీజీపీకి కోర్టు మొట్టికాయలు వేసినా పోలీస్ శాఖలో చలనం లేదని, ఇంకా పాత పద్ధతిలోనే వ్యవహరిస్తోందని చిన రాజప్ప విమర్శించారు. డీజీపీని కోర్టు చీవాట్లు పెట్టడంపై ముఖ్యమంత్రి ప్రజలకు సమాధానం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

### నాడు ఐఏఎస్‌లు.. నేడు ఐపీఎస్‌లు: లోకేశ్

వ్యవస్థల్ని భ్రష్టుపట్టించడంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నంబర్ 1 అని తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ విమర్శించారు. తండ్రి హయాంలో తప్పుడు పనులు చేసి ఐఏఎస్ అధికారులను జైలుకి పంపారు. ఇప్పుడు ఐపీఎస్ అధికారులను కోర్టు మెట్లు ఎక్కించి చీవాట్లు పెట్టిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు లోకేశ్ శుక్రవారం ట్వీట్ చేశారు. సోషల్ మీడియాలో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రశ్నించినందుకు టీడీపీ కార్యకర్తను 14 రోజులు రిమాండ్‌కు పంపారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో టీడీపీ కార్యాకర్తలపై హత్యాయత్నం చేసిన స్థానిక వైసీపీ నాయకుడికి మాత్రం స్టేషన్ బెయిల్ ఇచ్చాం అని ఒకసారి... తూచ్..అతను పారిపోయాడని మరోసారి చెప్తారా? అని ధ్వజమెత్తారు.

# శరవేగంగా పోలవరం పూర్తిచేస్తాం

- మేము ఖర్చు చేసిన రూ.3వేల కోట్లు ఇవ్వండి
- నాబార్డు నిధులు నేరుగా ప్రభుత్వానికే పంపాలి
- 'స్థానిక' గ్రాంటుగా రూ.5వేల కోట్లు ఇవ్వాలి
- విలేకరుల సమావేశంలో ఆర్థికమంత్రి బుగ్గన
- పలువురు కేంద్ర మంత్రులతో భేటీ

న్యూఢిల్లీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేయడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, నీతిఆయోగ్ సభ్యుడు ప్రొ.రమేశ్‌చంద్(వ్యవసాయం), అవినాష్‌మిశ్రా(ఇరిగేషన్)లతో ఆయన విడివిడిగా భేటీ అయ్యారు. అనంతరం ఆంధ్రాభవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి తమ ప్రభుత్వం ఖర్చు చేసిన రూ.3వేల కోట్లను తక్షణమే రీయింబర్స్ చేయాలని ఆర్థికమంత్రిని కోరామని, ఆమె సానుకూలంగా స్పందించారని చెప్పారు. అలాగే ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నుంచి ఇవ్వాల్సిన నిధులు నాబార్డు బ్యాంకు రుణంగా ఇస్తోందని, వీటిని నాబార్డు నుంచి పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) ద్వారా కాకుండా నేరుగా తమ ప్రభుత్వానికే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, గజేంద్ర సింగ్ షెకావత్‌లకు విజ్ఞప్తి చేసినట్లు బుగ్గన తెలిపారు. శ్రీకాకుళంజిల్లాలోని ఉద్దానం ప్రాంతంలో వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టుతోపాటు గోదావరి జిల్లాల్లో తాగునీటి పథకాలపై చర్చించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు గ్రాంటు రూపంలో ఇవ్వాల్సిన రూ.5వేలకోట్లను తక్షణమే విడుదల చేయడానికి చర్యలు తీసుకోవాలని నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. నీతిఆయోగ్ సభ్యులతో కూడా వ్యవసాయం, సాగునీటి పథకాల ప్రతిపాదనలపై చర్చించినట్లు తెలిపారు. రెవెన్యూ తగ్గడంలేదని, ప్రస్తుతం 8శాతం వృద్ధిరేటు ఉన్నదని ఒక ప్రశ్నకు బదులిచ్చారు.

### ప్రాథమిక అనుమతులిచ్చాం: జావడేకర్

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి తమ మొదటి హయాంలోనే ప్రాథమిక అనుమతులు ఇచ్చేశామని కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ స్పష్టం చేశారు. శుక్రవారం లోక్‌సభలో వైసీపీ ఎంపీ రఘురామకృష్ణం రాజు అడిగిన ఓ ప్రశ్నకు కేంద్ర మంత్రి సభలో మౌఖికంగా సమాధానం ఇచ్చారు. ఇప్పటికే జారీ చేసిన ప్రణాళిక ప్రకారం నీటి నిల్వ చేసుకోవచ్చని, రైతులకు ప్రయోజనం కలగాలని ఆశిస్తున్నానని అన్నారు.

# వలంటీర్లు మొదలెట్టారు!

- గ్రామాల్లో వైసీపీకి అనుకూలంగా ప్రచార జోరు
- అధికార పార్టీకే ఓటు వేయాలంటూ ప్రలోభాలు
- ఎప్పుడూ కనపడేది మేమేనంటూ ఓటర్లపై ఒత్తిడి
- ఓటేయకపోతే పెన్షన్లు కూడా రావంటూ బెదిరింపు
- ఎదురు చెప్పలేని నిస్సహాయ స్థితిలో లబ్ధిదారులు

అమరావతి/ ఏలూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ కార్యకర్తల దందా ప్రారంభమైంది. ఎన్నికల్లో తమ ప్రతాపం చూపించేందుకు గ్రామ, వార్డు వలంటీర్లను ఆయుధంగా వాడుకుంటున్నారని ఆరోపణలొస్తున్నాయి. మిమ్మల్ని వలంటీర్లుగా నియమించిందే ఎన్నికల కోసమని, అధికార పార్టీ అభ్యర్థికి అండగా ఉండాలని సాక్షాత్తు పార్టీ నేతలే పిలుపునిస్తున్నారని చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి వేతనం తీసుకుంటున్న వలంటీర్లు ఎన్నికల్లో అధికార పార్టీకి మద్దతుగా ప్రచారం చేస్తున్నారని ఆరోపణలొస్తున్నాయి. ఇప్పటికే ప్రతి వలంటీర్‌కు గ్రామాల్లో 50కుటుంబాలు, పట్టణాల్లో 100ఇళ్లకు మ్యాపింగ్ చేశారు. ప్రభుత్వ సేవలన్నీ వారిద్వారానే అందేలా చర్యలు తీసుకున్నారు. అధికార పార్టీకి ఓట్లేయాలని ఇప్పుడు వారే ఓటర్లను ప్రలోభపెడుతున్నారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఎప్పుడూ అందుబాటులో ఉండేది తామేనని, అధికార పార్టీకి ఓట్లేస్తేనే పథకాలన్నీ సజావుగా అందుతాయని, లేకపోతే ఆగిపోతాయని బెదిరిస్తున్నారని ఆరోపిస్తున్నాయి. వచ్చే నెల 1న పింఛను పొందాలంటే వైసీపీకే ఓటు వేయాలని ఒత్తిడి చేస్తున్నారని చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున ప్రభుత్వ కార్యక్రమాలేవీ అమలు కావడం లేదు. ఈ నేపథ్యంలో వలంటీర్లు ఇళ్లకు తిరుగుతూ ఆయా కుటుంబ సభ్యులతో మాటలు కలిపి ఎన్నికల ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. కడప, ప్రకాశం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో వలంటీర్ల దందా ఎక్కువైందంటున్నారు. గ్రామాల్లో ఇప్పటికీ ఇళ్లపట్టాల పంపిణీకి వివరాలు కావాలని, ఆరోగ్యశ్రీ కార్డు ఇస్తామని ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. ఆధార్ కార్డు జిరాక్స్ కోసమో, రేషన్‌కార్డు నంబరు కావాలనో ఏదో సాకుతో ఇళ్లకు వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారని, వారు చెప్పినదానికి సరేననడం తప్ప ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నామని పలువురు పెన్షన్‌దారులు పేర్కొంటున్నారు. షాపుల నుంచి మద్యాన్ని గ్రామాలకు తరలించి ఓటర్లకు పంచడంలో కూడా వలంటీర్లను వాడుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

### సహకరించకపోతే ఉద్యోగం మానేయండి

కొన్నిచోట్ల పార్టీకి సహకరించని వలంటీర్లను స్థానిక నేతలు బెదిరిస్తున్నారనిచెబుతున్నారు. అలాంటివారంతా ఎన్నికల తర్వాత ఉద్యోగం మానుకోవాలని హుకుం జారీ చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఎన్నికల్లో డబ్బు పంపిణీపై వలంటీర్లకు సూచనలు చేస్తున్నారని, ఒక్కొక్కరు ఎంతమందికి డబ్బు పంచాలో కూడా లెక్కలు కడుతున్నారని తెలుస్తోంది. పట్టణాల్లోనూ వార్డు వలంటీర్లు ప్రచారం ప్రారంభించారు. పెన్షన్లు, ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నయానా, భయానో ఓటర్లను ప్రభావితం చేసే పనిలో వలంటీర్లు బిజీగా ఉన్నారని ఆరోపణలొస్తున్నాయి. ఎన్నికల కమిషన్ దృష్టి సారించాలని, వలంటీర్ల సేవలకు కూడా కోడ్ వర్తింపజేయాలని విపక్ష నేతలు కోరుతున్నారు.

### వలంటీర్లూ.. రుణం తీర్చుకోండి!

"కేవలం సీఎం జగన్ వల్లే మీకు ఉద్యోగాలొచ్చాయి. ఆయన రుణం తీర్చుకోవాలంటే ఈ 20 రోజులు మీరు కష్టపడండి. పార్టీకి కలిసొచ్చేలా చూడండి. ఇదేదో మేము అన్నమాటే కాకుండా మీ అంతట మీరుగా ఒకింత స్పీడ్‌గా వ్యవహరించండి."

**- వలంటీర్లతో ప్రత్యేక సమావేశంలో చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా**

మీకు ఇంటి స్థలం అందాలా? వద్దా? ఫ్యాన్ వైపు మళ్లండి. లేదంటే మీకే నష్టం.

మీకు పథకాలన్నీ అందుతున్నాయి కదా.. రాబోయే పథకాలు కూడా మేమే ఇవ్వాలి. చూసి ఓటేయండి.

ఇప్పటిదాకా చూసీచూడనట్టు పోయాం. వేరే పార్టీకి వేస్తే అసలు సీను బయటపడుతుంది. జాగ్రత్త.

ఈసారి అన్ని ఎన్నికల్లోనూ ఫ్యాను స్పీడ్‌గా తిరగాలి. దానికోసం ఏం చేయాలో మీకు తెలుసు కదా.

రేషన్ కార్డులు ఇంకా అందాల్సి ఉంది. మీరు కాదు కూడదనుకుంటే అసలు కార్డే రాకుండా పోతుంది. వైసీపీకి ఓటేశారనుకోండి.... ఎంచక్కా మీ ఇంటికే వచ్చి ఇస్తాం.

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఓటర్లతో కొందరు వలంటీర్ల సంభాషణ ఇది.

### గ్రామ వలంటీర్‌పై టీడీపీ ఫిర్యాదు

పాచిపెంట: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న విజయనగరం జిల్లా పాచిపెంట గ్రామానికి చెందిన గ్రామ వలంటీరు తట్టికాయల జయప్రకాశ్‌పై టీడీపీ నాయకులు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. పాచిపెంట ఎంపీటీసీ-2 స్థానానికి వైసీపీ తరపున నామినేషన్ వేసిన తట్టికాయల గౌరీశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ఫేస్‌బుక్‌లో కోరాడని పేర్కొన్నారు. సదరు సమాచారాన్ని డౌన్‌లోడ్ చేసి ఫిర్యాదుకు జతపరిచారు.




పెనుగులాటలో కిందపడిపోయిన శరవణ

# అదే అరాచకం



పదో వార్డుకు టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ వేయడానికి వచ్చిన మన్నెం శ్రీనివాసులును బయటకు తోసేస్తున్న వైసీపీ కార్యకర్త





2.11 గంటలకు రెండో అంతస్తులోని మెట్ల పక్కనుంచి బాక్సుతో వెళుతున్న చిత్రం (ఇన్‌సెట్) అక్రమంగా తెచ్చి వాటర్ ట్యాంక్ పక్కన పెట్టిన మద్యం సీసాల బాక్సు

(మొదటి పేజీ తరువాయి)

అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడుగడుగునా అడ్డుకున్నారు. కులధ్రువీకరణ పత్రాలు, నో డ్యూస్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా అధికారులపై ఒత్తిడి తేవడంతోనే సరిపెట్టకుండా నామినేషన్ల దాఖలుకు చివరిరోజైన శుక్రవారం.. ఆ పత్రాలను లాక్కువెళ్లడం, చించిపడేయడం వంటి అక్రమాలకు ఒడిగట్టారు. చిత్తూరు జిల్లా తిరుపతి, పుంగనూరులో ఇలాంటి చర్యల కారణంగా టీడీపీ అభ్యర్థులు పలు చోట్ల నామినేషన్లు వేయలేకపోయారు. పుంగనూరులో ఎన్నికల కార్యాలయాల వద్ద వైసీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో మోహరించాయి. పట్టణంలో సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) అనే పార్టీ తరపున నామినేషన్లు వేసేందుకు పలువురు అభ్యర్థులు పెద్దసంఖ్యలో మద్దతుదారులతో కలసి నామినేషన్ల కేంద్రానికి వెళ్లగా వైసీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. వైసీపీ కార్యకర్తలు, పోలీసులు కలిసి ముస్లింలపై దాడి చేయగా ఏడుగురు గాయపడ్డారు. వారు కూడా రెచ్చిపోయి రాళ్లు రువ్వారు. ఎస్ఐ తిప్పేస్వామి గాయపడ్డారు. కాగా పట్టణంలోని ఎల్ఐసీ కాలనీ మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో నామినేషన్లు వేసేందుకు వెళ్లిన టీడీపీ అభ్యర్థులు మంజుల, విజయమ్మ నుంచీ వైసీపీ కార్యకర్తలు నామినేషన్ పత్రాలు లాక్కున్నారు. దీంతో టీడీపీ అభ్యర్థి విజయమ్మ నడిరోడ్డుపైనే బైఠాయించి పెట్రోలు మీద పోసుకుని నిప్పంటించుకోవడానికి యత్నించారు. 16వ వార్డు టీడీపీ అభ్యర్థి శ్రీకాంత్ నామినేషన్ పత్రాలను వైసీపీ కార్యకర్తలు లాక్కుని పారిపోయారు. మేలుపట్లలో టీడీపీ అభ్యర్థి జీవనజ్యోతి నామినేషన్ పత్రాలను కేంద్రంలోనే లాక్కున్నారు. 5వ వార్డు టీడీపీ అభ్యర్థి షాజహాన్ నామినేషన్ పత్రాలు లాక్కోవడంతో పాటు తలపై కొట్టి తీవ్రంగా గాయపరిచారు. తిరుపతిలోని నాలుగో డివిజన్‌లో ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి తనయుడు అభినయ్‌రెడ్డి బరిలో ఉన్నారు. ఆయనపై నామినేషన్ వేసేందుకు నోటరీ అఫిడవిట్ సిద్ధం చేసుకుంటున్న టీడీపీ మహిళా అభ్యర్థిని న్యాయవాది ఇంట్లోనే బెదిరించారు.

### తాడిపత్రి, ధర్మవరాల్లో దౌర్జన్యకాండ

అనంతపురం జిల్లా ధర్మవరం, తాడిపత్రి నియోజకవర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యేలు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి కనుసన్నల్లో ఆ పార్టీ శ్రేణులు ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులపై పేట్రేగిపోయారు. తాడిపత్రిలో స్థానిక ఎన్నికల కార్యాలయంలో పెద్దారెడ్డి తిష్ఠవేశారు. టీడీపీ అభ్యర్థులు నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారు. ఇది తెలిసి మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి అక్కడకు వచ్చారు. ఎమ్మెల్యే నామినేషన్ సెంటర్‌లో ఎలా ఉంటారని అధికారులను, పోలీసులను ప్రశ్నించారు. ధర్మవరం మున్సిపాలిటీ 20వ వార్డుకు టీడీపీ అభ్యర్థిగా ప్రమీల నామినేషన్ వేసేందుకు వెళ్లగా.. ఆమె పత్రాలను వైసీపీ కార్యకర్తలు లాక్కుని.. చించేసి పరారయ్యారు.

### ఉపసంహరించకుంటే...

శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం లింగాలవలస ఎంపీటీసీ స్థానానికి టీడీపీ అభ్యర్థి అన్నెపు లీలావతి నామినేషన్ ఉపసంహరించుకోవాలని వైసీపీ అభ్యర్థి శ్రీలత భర్త శ్రీనివాసరావు బెదిరించారు. పిడుగురాళ్ల మున్సిపాలిటీ 9వ వార్డులో టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు వెళ్లిన చల్లగుండ్ల సీత పత్రాలను వైసీపీ నేతలు లాక్కొని కాల్వలో పడేశారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం వెంపలో ఎంపీటీసీ అభ్యర్థిగా జనసేన తరపున నామినేషన్ వేసిన గిడ్డం లక్ష్మి కిడ్నాప్ కలకలం రేపింది. విజయనగరం జిల్లాలో వైసీపీ ప్రలోభాలతో ఇద్దరు టీడీపీకి చెందిన జడ్పీటీసీ అభ్యర్థులు నామినేషన్లను శుక్రవారం ఉపసంహరించుకున్నారు. మెరకముడిదాం వైసీపీ అభ్యర్థి, మంత్రి బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) పోటీ చేస్తున్నారు. టీడీపీ అభ్యర్థిగా బూర్లి విజయలక్ష్మి నామినేషన్ వేశారు. ఆమె శుక్రవారం నామినేషన్ ఉపసంహరించుకుని వైసీపీలో చేరారు. సీతానగరం మండలంలో టీడీపీ అభ్యర్థి పెంకి ప్రసాద్ కూడా ఉపసంహరించుకున్నారు.

### బుర్ఖాలో వెళ్లినా తరిమేశారు

చిత్తూరు జిల్లా పుంగనూరులోని రహ్మత్‌నగర్‌కు చెందిన బి. కృష్ణమూర్తి భార్య బి. రాజమ్మ 15వ వార్డు నుంచి టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు సిద్ధమైంది. పలమనేరు రోడ్డులోని సచివాలయం వద్ద వైసీపీ నాయకులు తిష్ఠవేసి ఇతర పార్టీల వాళ్లు ఎవరు వచ్చినా నామినేషన్లు లాక్కుని పత్రాలు చింపివేసి దౌర్జన్యం చేస్తుండటంతో ముందు జాగ్రత్తగా బుర్ఖా వేసుకుని వెళ్లింది. ఆమెతో పాటు భర్త కృష్ణమూర్తి, మరో వ్యక్తి ప్రతిపాదకునిగా వెంట ఉన్నారు. అయినా వైసీపీ నేతలు దౌర్జన్యంగా ఆమె బుర్ఖా తీయించి పత్రాలు లాక్కుని కొట్టి తరిమేశారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

## సమయానికి వచ్చినా తిరస్కరణ

**తూ**ర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం పురపాలక సంఘం ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వెంకటరమణ నామినేషన్‌ను అధికారులు అడ్డగోలుగా తిరస్కరించారు. శుక్రవారం నామినేషన్ ఫీజు చెల్లించి 21వ వార్డు నుంచి నామినేషన్ వేయడానికి ఆయన వెళ్లారు. ఒకటో కౌంటర్‌కు నామినేషన్ పత్రంతో వెళ్తే అక్కడ ఎక్కువ మంది అభ్యర్థులు ఉండడంతో నామినేషన్ పత్రాలపై అధికారులు వరుస సంఖ్య వేసి ఇచ్చారు. తీరా తన వంతు వచ్చేసరికి నామినేషన్ తీసుకోబోమని, మూడో కౌంటర్‌కు వెళ్లాలని అధికారులు సమాధానం ఇచ్చారు. అక్కడకు వెళ్తే సమయం మించిపోయిందనే సాకుతో తీసుకునేందుకు తిరస్కరించారు. తుని మునిసిపాలిటీ 13వ వార్డు నుంచి టీడీపీ అభ్యర్థిగా అమిర్తి నాగసుజాత నామినేషన్ వేసేందుకు రాగా.. ఆమె వెంట వచ్చిన ప్రతిపాదకురాలు రావి కొండమ్మను వైసీపీ నేతలు పక్కకు లాక్కెళ్లారు. 14వ వార్డు నుంచి టీడీపీ అభ్యర్థి షేక్ వల్లీ వెంట ఉన్న ప్రతిపాదకుడు గింజాల జానీని పోలీసులు అడ్డుకున్నారు. వైసీపీ నేతలు జానీని అక్కడి నుంచి ఎత్తుకుపోయారు. దీంతో రెండుచోట్లా టీడీపీ నామినేషన్లు పడలేదు.

## నడిచొచ్చిన మద్యం!

- టీడీపీ అభ్యర్థి ఇంట్లో 'ఖద్దరు' దొంగలు
- మద్యం సీసాలు పెట్టి... పోలీసులను పంపి...
- అక్రమంగా అరెస్టు చేసేందుకు కుట్రలు
- సీసీ ఫుటేజీతో వెనక్కుతగ్గిన ఎక్సైజ్ అధికారులు

తెనాలి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అది గుంటూరు జిల్లా తెనాలిలోని 4వ వార్డులో టీడీపీ తరపున నామినేషన్ వేసిన అడుసుమల్లి వెంకటేశ్వరరావు ఇల్లు. శుక్రవారం తెల్లవారుజామున 2.10గంటలకు ఆ ఇంటి ముందు ఒక ద్విచక్ర వాహనం వచ్చి ఆగింది. దానిపై వచ్చిన ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు మెల్లగా భవనం ప్రహరీ ఎక్కి లోపలకు దిగితే, రెండోవ్యక్తి మద్యం సీసాలున్న బాక్సును అతడికి అందించాడు. గోడ దూకిన వ్యక్తి ముఖానికి కర్చీఫ్ కట్టుకుని అడుగులో అడుగు వెసుకుంటూ మెట్లెక్కి డాబాపై ఉన్న వాటర్‌ట్యాంక్ పక్కన ఆ బాక్సు పెట్టి 2.12గంటల కల్లా మళ్లీ గోడదూకి వచ్చిన వాహనంపైనే వెళ్లిపోయాడు. సీన్ కట్ చేస్తే... శుక్రవారం ఉదయం 7గంటలకే ఎక్సైజ్, సివిల్ పోలీసులు అదే భవనం దగ్గరకు వచ్చారు. రావడంతోనే వాటర్ ట్యాంక్ ఎక్కడుంది? మీ ఇంట్లో మద్యం సీసాలున్నాయని సమాచారం వచ్చింది. చెక్ చెయ్యాలి అని ఇంట్లో ఉన్న మహిళలను అడుగుతూ ఎక్కడా వెతక్కుండా నేరుగా డాబాపైకి వెళ్లి రెండే నిమిషాల్లో 45 సీసాలున్న బాక్సును కిందికి తీసుకొచ్చారు. "మీ భర్త ఎన్నికల్లో పోటీ చేస్తున్నాడా... మద్యం సీసాలు దాచిపెట్టినందుకు అరెస్టు చెయ్యాలి. ఆయనను వెంటనే వచ్చి లొంగిపొమ్మని చెప్పండి" అంటూ సీన్ క్రియేట్ చేశారు. అధికార పార్టీలోని ఖద్దరు దొంగలు దర్శకత్వం వహించినట్టు కనిపిస్తున్న ఈ సన్నివేశం సీసీ కెమేరాల పుణ్యమాని బెడిసికొట్టింది. సీసీ కెమేరా ఫుటేజీలో క్లియర్‌గా కనిపిస్తుంటే అరెస్టు ఎలా చేస్తారంటూ పోలీసులను మహిళలు నిలదీశారు. అసలు వాటర్ ట్యాంక్ దగ్గరే బాక్సు ఉందని మీకెలా తెలుసు, మీరే పెట్టించారా అంటూ ఎదురు తిరగడంతో వెనక్కు తగ్గిన పోలీసులు చివరకు ఆ ఇంట్లో అద్దెకు ఉంటున్న కార్తీక్‌ను అరెస్టుచేసి వెంట తీసుకువెళ్లారు. విషయం మీడియాలో గుప్పుమనడంతో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎక్సైజ్ స్టేషన్‌కు వచ్చి ఆరు గంటల పాటు బైఠాయించారు. స్టేషన్ బయట టీడీపీ నాయకులు, కార్యర్తలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. నిజమైన దోషులను పట్టుకోవాలని, అక్రమంగా తమ పార్టీ అభ్యర్థులను అరెస్టుచేస్తే ఊరుకోబోమంటూ భీష్మించడంతో చివరకు పోలీసులు వారిని వదిలేశారు. తమకు సమాచారం రావటంతోనే దాడి చేశామని, మద్యం సీసాలు ఎక్కడ కొనుగోలు చేశారో విచారించి చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. కాగా, అడుసుమల్లి వెంకటేశ్వరరావును పోటీ నుంచి విరమించుకోవాలని ముందురోజే కొందరు ఫోన్‌లో బెదిరించారు. వ్యాపారాలున్న నీకు రాజకీయాలెందుకని, తప్పుకోకుంటే ఇబ్బంది పడతావని హెచ్చరించారు. అయినా లొంగకపోవటంతో అక్రమ మద్యం కేసులు పెట్టేందుకు కుట్రపన్నారు. అయితే ఈ కేసును ఛేదించటానికి పోలీసులకు పెద్దగా సమయం పట్టదంటున్నారు. వాహనం వచ్చిన సమయంలో రోడ్డుపై అమర్చిన సీసీ కెమేరా ఫుటేజీలు తీసినా ఇట్టే దొరికిపోతారు. అవి పనిచేయటం లేదనుకుంటే, పట్టుకున్న మద్యం సీసాల బ్యాచ్ నంబర్‌ల ద్వారా అవి ఏ మద్యం దుకాణానికి, ఏ బార్‌కు వెళ్లాయనేది కూడా నిముషాల్లో వచ్చే సమాచారమే. ఆ వైన్ షాప్ దగ్గర అమర్చిన సీసీ కెమేరా ఫుటేజీ పరిశీలిస్తే వాటిని కొనుగోలు చేసిన వ్యక్తులను క్షణాల్లో పట్టేసినట్టే. ఇదీ దొరకలేదనుకుంటే, వెంకటేశ్వరరావు ఇంటిపైన వాటర్ ట్యాంక్ దగ్గర మద్యం సీసాలున్నాయని సమాచారం అందించిన వ్యక్తిని పట్టుకున్నా దాని వెనకున్నదెవరనే సమాచారం రాబట్టడం పెద్దకష్టం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## మమ్మల్ని బతకనివ్వరు... నేను చచ్చిపోతా

- ఎమ్మెల్యే కాళ్ల మీదపడ్డ టీడీపీ నేత

ఒంగోలు(క్రైం), మార్చి13: అన్నా మమ్మల్ని బతకనివ్వరు. నేను చచ్చిపోతానంటూ ప్రకాశం జిల్లా అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ కాళ్ళు పట్టుకొని ఒక గ్రామ నేత బోరున విలపించాడు. ఈ ఘటన ఒంగోలు ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. బల్లికురవ మండలం వేమవరానికి చెందిన 13 మంది తెలుగుదేశం వర్గీయులను ఆర్డీఓ కార్యాలయంలో బైండోవర్ చేసేందుకు బల్లికురవ పోలీసులు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అక్కడకు రాగా బాధితులంతా గొల్లుమన్నారు. బ్రహ్మయ్య అనే నేత ఎమ్మెల్యే కాళ్లు పట్టుకొని రక్షించమంటూ బోరుమన్నాడు. కౌన్సెలింగ్ పేరుతో పోలీసులు బల్లికురవ పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్ళి చితకబాదారన్నారు. మీకు రాజకీయాలు కావాలంటరా అని అక్కడ ఎస్సై, మరో ప్రత్యేకాధికారి చిత్రహింసలకు గురిచేశారని ఎమ్మెల్యే రవికుమార్‌కు విన్నవించారు. తాము అంతా ఊరు వదిలిపెట్టి ఎక్కడో ఉంటున్నామని, ఎన్నికలు సందర్భంగా కౌన్సెలింగ్ పేరుతో కొడుతూ భయపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ టీడీపీ వారిని పోటీ నుంచి తప్పుకోవాలంటూ పోలీసులు బెదిరిస్తున్నారని తెలిపారు. కౌన్సెలింగ్ పేరుతో తీసుకెళ్లిన పోలీసులు వారిని చిత్రహింసలకు గురిచేయడం సరియైన చర్య కాదన్నారు. టీడీపీ వారిని భయభ్రాంతులకు గురిచేసి పోటీ నుంచి తప్పుకునే విధంగా పోలీసులు చర్యలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని



ఎస్పీ దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. తమ పార్టీ వర్గీయులకు రక్షణ కల్పించి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేశారు. అనంతరం ఎస్పీ సిద్ధార్థ కౌశల్‌ను కలిసి అద్దంకి నియోజకవర్గంలో జరుగుతున్న అధికారపార్టీ దౌర్జన్యాలు, పోలీసుల బెదిరింపులు, చర్యలపై ఫిర్యాదు చేశారు.

### నెల్లూరులో బలవంతంగా ప్రత్యర్థుల నుంచి సంతకాలు

**నె**ల్లూరు జిల్లాలో అధికార పార్టీ విజయానికి పోలీసులే రంగంలోకి దిగారు. ప్రత్యర్థులను కేసులతో బెదిరించి మరీ నామినేషన్ల ఉపసంహరణ పత్రాలపై బలవంతంగా సంతకాలు చేయిస్తున్నారు. సూళ్లూరుపేట ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు వైసీపీకి ఏకగ్రీవం చేయడానికి ఓ పోలీసు అధికారి.. టీడీపీ, ఇతర ప్రతిపక్షాల అభ్యర్థులను స్టేషన్‌కు పిలిపించారు. విత్‌డ్రా చేసుకొంటారా, లేక కేసులు పెట్టమంటారా అని బెదిరించారు. వారి నుంచి ఉపసంహరణ పత్రాలపై సంతకాలు తీసుకున్నారు. ఇదే అధికారి దొరవారిసత్రంలో టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థిని ఉపసంహరణకు అంగీకరించకపోవడంతో ఆమె కొడుకును నిర్బంధించి బలవంతంగా ఉపసంహరించుకునేలా చేశారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీకి నామినేషన్లు వేయడానికి వచ్చిన బీజేపీ అభ్యర్థులను వైసీపీ కార్యకర్తలు అడ్డుకుని నామినేషన్ పత్రాలు లాక్కెళ్లినా పోలీసులు మౌనం పాటించారు. సర్వేపల్లి మండలం పొదలకూరు బిట్-3 ఎంపీటీసీ స్థానానికి నామినేషన్ వేసిన టీడీపీ అభ్యర్థి ఆదాల సుగుణమ్మ ఇంటిని కూల్చడానికి అధికారులు జేసీబీతో వెళ్లారు. మీ ఇల్లు కాలువ గట్టున ఉంది.. కూల్చేస్తామని బెదిరించారు. ఆమె కుటుంబం తిరగబడడంతో వెనుదిరిగారు.

### అధికారులే రహస్యంగా చించేస్తున్నారు

**క**ర్నూలు జిల్లాలో వైసీపీ నేతలు ఏకగ్రీవ ఎన్నికల కోసం రణరంగం సృష్టిస్తున్నారు. అభ్యర్థుల నామినేషన్లను అధికారులతో తిరస్కరింపజేస్తున్నారు. టీడీపీ అభ్యర్థుల నామినేషన్లు స్వీకరించిన కొందరు అధికారులు.. తామే వాటిలోని కీలక పత్రాలను చించేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో మండలం నుంచి నాలుగు రోజులుగా పదుల సంఖ్యలో నామినేషన్లను కుంటి సాకులతో అధికారులు రద్దు చేస్తున్నారు. దీని వెనుక ఓ మంత్రి ఉన్నట్లుగా తెలుస్తోంది. కడప జిల్లాలో నామినేషన్లు ఉపసంహరించుకోకుంటే అక్రమ మద్యం, ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులు పెడతామని ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులను పోలీసులే బెదిరిస్తున్నారు. కమలాపురం, బద్వేలు, జమ్మలమడుగు, రాయచోటి, మైదుకూరు నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి ఉంది.

## మీరే ఏలుకోండి!

- వైసీపీ అకృత్యాలకు నిరసన..
- కొన్ని చోట్ల పోటీకి టీడీపీ దూరం
- డోన్‌ను బుగ్గనకు దానం చేస్తున్నాం: కేఈ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రవ్యాప్తంగా స్థానిక ఎన్నికల్లో పాలక పక్షం వైసీపీ శ్రేణుల దాడులు, దౌర్జన్యాలు.. పోలీసుల బెదిరింపులపై ప్రతిపక్ష టీడీపీ తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తోంది. ఎన్ని ఫిర్యాదులు చేసినా ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, ఎస్పీలు చర్యలు తీసుకోకపోవడంతో కొన్ని చోట్ల ఎన్నికల బరి నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నారు. ప్రధానంగా టీడీపీ అధినేత చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరులో వైసీపీ, పోలీసుల అక్రమాలను భరించలేక.. తంబళ్లపల్లె, శ్రీకాళహస్తి, పుంగనూరు నియోజకవర్గాల్లో ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు టీడీపీ నేతలు ప్రకటించారు. అలాగే ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న డోన్ నియోజకవర్గంలో పోలీసులను అడ్డుపెట్టుకుని తమ నేతలు, కార్యకర్తలను భయభ్రాంతుల్ని చేస్తున్నారని మాజీ ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి మండిపడ్డారు. ఓటమి భయంతో అక్రమాలకు తెరలేపారని.. వ్యాపారాలు చేసుకోలేరని, ఫ్యాక్టరీలు నడపలేరని, పెండింగ్ బిల్లులు రావని పోలీసులు టీడీపీ అభ్యర్థులను హెచ్చరించడం వంటివి గతంలో తామెన్నడూ చూడలేదన్నారు. పోలీసులు వైసీపీ ఏజెంట్లుగా మారి.. టీడీపీ అభ్యర్థులకు రాత్రివేళ వెళ్లి మహిళలను బెదిరిస్తున్నారని ధ్వజమెత్తారు. అందుకే డోన్ మున్సిపల్ ఎన్నికలను బహిష్కరిస్తున్నామని ప్రకటించారు. వైసీపీకి డోన్ మున్సిపల్ చైర్మన్ పదవిని దానంగా ఇస్తున్నామని చెప్పారు. తంబళ్లపల్లె, శ్రీకాళహస్తి, పుంగనూరుల్లో అధికార పార్టీ నేతలు, శ్రేణుల అకృత్యాలకు.. వారికి పోలీసు యంత్రాంగం సహకరించిన తీరుకు నిరసనగా ఈ మూడు నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించింది. అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, దాడులు, దౌర్జన్యాలు, నామినేషన్ పత్రాలను లాక్కోవడం, చించివేయడం, నామినేషన్ల తిరస్కరణ వంటి చర్యలకు పాల్పడ్డారని, దీంతో స్వేచ్ఛగా ఎన్నికలు జరిగే అవకాశం లేనందున బహిష్కరిస్తున్నట్టు శ్రీకాళహస్తి, పుంగనూరు నియోజకవర్గాల ఇన్‌చార్జులు బొజ్జల సుధీర్‌రెడ్డి, అనీషారెడ్డి తెలిపారు. తంబళ్లపల్లెలో ఎన్నికల బహిష్కరణకు మండలస్థాయి నేతలు నిర్ణయం తీసుకున్నారు. కడపలోని కమలాపురంలో టీడీపీ అభ్యర్థులను నామినేషన్లు ఉపసంహరించుకోవాలంటూ పోలీసులు బెదిరించడంపై ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి విరుచుకుపడ్డారు. అభ్యర్థులతో కలిసి కడప కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. కలెక్టర్ హరికిరణ్‌కు ఫిర్యాదు చేశారు. కమలాపురం, పెండ్లిమర్రి, సీకేదిన్నె, వీఎన్‌పల్లె, చెన్నూరు, వల్లూరు మండలాల పరిధిలో 58 ఎంపీటీసీ స్థానాలకు, 6 జడ్పీటీసీ స్థానాలకు టీడీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. శనివారం నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ. దీంతో పోలీసులు కౌన్సెలింగ్ పేరుతో అభ్యర్థులు, వారి బంధువులను స్టేషన్‌కు పిలిపించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, అక్రమంగా గంజాయి, ఎర్రచందనం, అక్రమ మద్యం కేసులు పెట్టాల్సి వస్తుందని, ఎందుకు ఇబ్బందులు పడతారని పోలీసులే వైసీపీ నాయకులకు తొత్తులుగా మారి బెదిరిస్తున్నారని పుత్తా చెప్పారు. ఇలాంటి ఎన్నికలను ఎదుర్కోవడం కన్నా పోటీ నుంచి గౌరవంగా తప్పుకోవడమే ఉత్తమం. పోలీసుల బెదిరింపులకు నిరసనగా ఎన్నికలను బహిష్కరిస్తున్నామని, మూకుమ్మడిగా విత్‌డ్రా చేస్తున్నామని ప్రకటించారు.



## ఫిర్యాదులన్నీ వృథా... ఫలితం లేదు: జేసీ

- స్టేట్ రౌడీలా తయారైన సీఐ భక్తవత్సలరెడ్డి: పంచుమర్తి
- డీజీపీ కోర్టులో సంజాయిషీ... దురదృష్టకరం
- పోలీస్ సంఘం ఇప్పుడు తొడగొడుతుందా?: వర్ల

తాడిపత్రి, మంగళగిరి, మార్చి 13: రాష్ట్రంలో అరాచక, అస్తవ్యస్త, అప్రజాస్వామిక, రాజ్యాంగ వ్యతిరేక పాలన సాగుతోందని టీడీపీ నేతలు విమర్శించారు. మున్సిపల్ నామినేషన్ల సందర్భంగా ఎమ్మెల్యే పెద్దారెడ్డి, ఆయన అనుచరులు 'చంపుతాం, నరుకుతాం, కొడతాం' అంటూ నానా రకాలుగా టీడీపీ అభ్యర్థులను బెదిరించారని మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి అన్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఆయన మాట్లాడారు. పోలీసు అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేదన్నారు. ఈ ప్రభుత్వంపై ఎన్ని ఫిర్యాదులు చేసినా పెన్నులో ఇంకు, కాగితాలు వృథా కావటం తప్ప.. ఫలితం ఉండదన్నారు. వేటి గురించీ పట్టించుకోకుండా చెక్కభజన చేస్తూ తూర్పు తిరిగి దండం పెట్టుకోవటమే ఉత్తమన్నారు. సీఎం జగన్ మున్సిపాలిటీలకు ఎన్నికలు లేకుండా ఎంపిక చేసేలా చట్టాన్ని తీసుకొస్తే ఇలాంటివి చేయాల్సిన అవసరం ఉండదంటూ జేసీ ఎద్దేవా చేశారు. మాచర్ల సీఐ భక్తవత్సలరెడ్డి స్టేట్ రౌడీలా తయారయ్యారని టీడీపీ అధికార ప్రతినిధి పంచుమర్తి అనురాధ అన్నారు. ఇద్దరు ప్రముఖులపై హత్యాయత్నానికి ఒడిగట్టిన వ్యక్తికి ఎవరైనా బెయిల్ ఇస్తారా? అని ప్రశ్నించారు. ముద్దాయిపై 307 సెక్షన్ కింద నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేస్తున్నామని ఐజీ ప్రభాకర్ చెప్పారన్నారు. కానీ, మాచర్ల సీఐ భక్తవత్సలరెడ్డి మాత్రం ముద్దాయికి స్టేషన్ బెయిల్ ఇచ్చారన్నారు. ఐజీ ప్రభాకర్ పవర్‌ఫుల్లా లేక మాచర్ల సీఐ పవర్‌ఫుల్లా? అని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇన్ని అరాచకాలు, దాడులు జరుగుతుంటే కేంద్రం ఎందుకు జోక్యం చేసుకోవడం లేదో అర్థం కావడంలేదని అనురాధ వాపోయారు. "రాష్ట్ర డీజీపీ 5.45 గంటలు కోర్టులో నిలబడి సంజాయిషీ చెప్పుకోవలసి రావడం దురదృష్టకరం. పోలీసులు వ్యవహరిస్తున్న తీరును కోర్టు తప్పుపట్టడంతోపాటు సాక్షాత్తూ డీజీపీ సంజాయిషీ ఇవ్వడం, సెక్షన్ 151ని చదివించడం దేశ పోలీసు చరిత్రలో ఇదే తొలిసారి. ఇది డీజీపీ గౌతమ్ సవాంగ్ జీవితంలో చీకటి రోజు. ఇలాంటి పరిస్థితులు వచ్చినప్పుడు ముఖ్యమంత్రులు రాజీనామా చేసిన సందర్భాలు ఉన్నాయి. జగన్ స్థానంలో వేరే ముఖ్యమంత్రి ఉంటే ఈపాటికి రాజీనామా చేసేవారు" అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. డీజీపీని కోర్టుకు పిలిపించినందుకు పోలీసు సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు కోర్టుపై తొడగొట్టి, మీసం తిప్పుతారా? అంటూ నిలదీశారు. కోర్టు ఎన్నిమార్లు మొట్టికాయలు వేసినా దున్నపోతుపై వర్షం పడిన చందంగా ప్రభుత్వ వ్యవహారశైలి ఉందని ఎద్దేవా చేశారు.



స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న రేణుక

## ప్రేమించి మోసగించాడని ఎన్నికల్లో పోటీ!

- మున్సిపల్ ఎన్నికల్లో ఓ యువతి నామినేషన్
- వైసీపీ నేత తనయుడి తీరుపై వినూత్న నిరసన

అమలాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తనను ప్రేమించి మోసగించిన వైసీపీ నేత తనయుడి తీరుపై ఓ యువతి వినూత్నంగా నిరసన తెలిపింది. మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్ అభ్యర్థిగా ఆమె నామినేషన్ వేసిన ఘటన తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలో చోటుచేసుకుంది. పురపాలక సంఘంలో కీలకంగా వ్యవహరించే సదరు నేత తనయుడు తనను ప్రేమించి మోసగించిన వ్యవహారంపై నిరసన తెలియజేసేందుకు ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్టు సూర్యానగర్‌కు చెందిన బైరిశెట్టి రేణుక వెల్లడించారు. తన తల్లి ధనలక్ష్మితో కలిసి బీసీ మహిళకు కేటాయించిన 15వ వార్డులో నామినేషన్లు దాఖలు చేశారు. పోలీసులు, వైసీపీ నేతల నుంచి తనకు న్యాయం జరగనందుకు నిరసనగానే ఈ మార్గాన్ని ఎంచుకున్నట్టు ఎంబీఏ చదువుకున్న రేణుక చెప్పారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి తనకు జరిగిన అన్యాయాన్ని ఇంటింటికీ తిరిగి ఓటర్లకు చెప్పడమే తన లక్ష్యంగా పేర్కొన్నారు. ఇదే వార్డు నుంచి మాజీ ఎమ్మెల్యే కుడుపూడి చిట్టబ్బాయి కోడలు సత్యశైలజకు పోటీగా రేణుక నామినేషన్ దాఖలు చేయడం వైసీపీ నేతలకు మింగుడుపడటం లేదు. ఈ వ్యవహారం వైసీపీ వర్గాల్లో తీవ్రచర్చకు దారితీసింది.

## జగన్ వద్దన్నా బరిలోకి...!

- నామినేషన్లు వేసిన ముత్తంశెట్టి, ముత్యాలనాయుడు కుమార్తెలు
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కుటుంబం నుంచి ఇద్దరు

విశాఖపట్నం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ తరఫున ప్రజా ప్రతినిధులుగా ఎన్నికై కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నవారు స్థానిక ఎన్నికల్లో తమ కుటుంబ సభ్యులను గానీ, బంధువులను గానీ పోటీకి దించొద్దని ఆ పార్టీ అధినేత జగన్ స్పష్టం చేసినా నాయకులు



నామినేషన్ దాఖలు చేస్తున్న మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కుమార్తె ప్రియాంక

పెద్దగా పట్టించుకోలేదు. విశాఖ జిల్లా మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అనూహ్యంగా తన కుమార్తె ప్రియాంకతో జీవీఎంసీ 6వ వార్డుకు నామినేషన్ వేయించారు. మంత్రి వ్యక్తిగత సహాయకుడు చంద్రరావు భార్య కనకదుర్గకు ఇక్కడ టికెట్ ఇస్తారని ప్రచారం జరిగింది.

- ప్రభుత్వ విప్, మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు కుమార్తె ఈర్లె అనురాధ కె.కోటపాడు జడ్పీటీసీ స్థానానికి నామినేషన్ వేయగా, కుమారుడు రవి దేవరాపల్లి జడ్పీటీసీకి రెబల్‌గా వేశారు.
- గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తన కుటుంబం నుంచి ఇద్దరిని కార్పొరేటర్లుగా పోటీకి దింపారు. నియోజకవర్గంలోని 74వ వార్డు నుంచి కుమారుడు వంశీరెడ్డితో నామినేషన్ వేయించారు. నాగిరెడ్డి తన కోడలు ఎమిలి జ్వాలతో 75వ వార్డుకు నామినేషన్ వేయించారు.
- విశాఖ తూర్పు నియోజకవర్గం పార్టీ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల తన తోటికోడలైన పద్మతో ఒకటో వార్డుకు నామినేషన్ వేయించారు.

### బరిలో అయ్యన్న సతీమణి, కుమారుడు

టీడీపీకి చెందిన మాజీమంత్రి అయ్యన్నపాత్రుడు సతీమణి పద్మావతి నర్సీపట్నం మునిసిపాలిటీలోని 16, 25, 26 వార్డులకు, చిన్న కుమారుడు రాజేశ్ 25, 26 వార్డులకు నామినేషన్లు వేశారు.

## గొడవర్రు ఎంపీటీసీ అభ్యర్థి ఇంటి ముందుభాగం కూల్చివేత

దుగ్గిరాల, మార్చి 13: గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం గొడవర్రు ఎంపీటీసీ అభ్యర్థి ఇల్లు నీటిపారుదలశాఖ స్థలంలో అక్రమంగా నిర్మించారంటూ, ఇంటిముందు నిర్మాణాలను ఎక్స్‌కవేటర్‌తో శుక్రవారం తొలగించారు. గొడవర్రు ఎంపీటీసీగా వైసీపీ రెబల్ అభ్యర్థిగా పోటీలో ఉన్న బహుజంకు రామాంజనేయులు తన నామినేషన్ ఉపసంహరించుకునేందుకు అంగీకరించలేదు. దీంతో ఉద్దేశ్యపూర్వకంగానే ఇంటి ప్రాంగణంలో అక్రమనిర్మాణాల పేరుతో కూల్చి, ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. విజయవాడకు చెందిన నదీ పరివాహకశాఖ శాఖ ఏఈ విజయరాజు పర్యవేక్షణలో తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు..



# ఆ 4 మున్సిపాలిటీల్లో ఎన్నికలు రద్దు చేయండి

- పులివెందుల, మాచర్ల, డోన్, జమ్మలమడుగుల్లో టీడీపీ అభ్యర్థులను అడ్డుకున్నారు
- వైసీపీ నేతలకు అధికారుల అండ
- అక్కడ భారీ భద్రతతో మళ్లీ పెట్టండి
- ఎన్నికల కమిషనర్‌కు చంద్రబాబు లేఖ



అమరావతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నియోజకవర్గంలోని పులివెందుల సహా రాష్ట్రంలో నాలుగు మున్సిపాలిటీల్లో ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలను రద్దు చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్ర ఎన్నికల సంఘాని(ఎస్‌ఈసీ)కి విజ్ఞప్తి చేశారు. పులివెందుల, మాచర్ల, డోన్, జమ్మలమడుగు మున్సిపాలిటీల్లో టీడీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వకుండా వైసీపీ నేతలు అధికార యంత్రాంగం అండతో అడ్డుకున్నారని.. ఈ నేపథ్యంలో ఈ నాలుగు చోట్లా మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని శుక్రవారం రాత్రి ఎన్నికల కమిషనర్ రమేశ్‌కుమార్‌కు లేఖ రాశారు. 'ఈ నాలుగు చోట్లా పోలీసులు యుద్ధ వాతావరణం సృష్టించారు. వైసీపీ వారిని తప్ప మిగిలిన పార్టీల వారిని నామినేషన్లు వేయనివ్వలేదు. టీడీపీ తరఫున పోటీ చేస్తారనుకున్న వారిపై గంజాయి, మద్యం తప్పుడు కేసులు మోపారు. పోలీసులే స్వయంగా ఫోన్లు చేసి పోటీ చేయవద్దని హెచ్చరించారు. పులివెందులలో పోటీ చేస్తే వారి ప్రాణాలకు మేం గ్యారంటీ ఇవ్వలేమన్న స్థాయిలో పోలీసుల బెదిరింపులు సాగాయి.డోన్‌లో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, మాచర్లలో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తమ పదవులను దుర్వినియోగం చేసి పోలీసులను రంగంలోకి దించి టీడీపీ నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారు. జమ్మలమడుగులో పోలీసులు, అధికార పార్టీ గూండాలు చేతులు కలిపి నేరుగా టీడీపీ నేతలను బెదిరించారు. నామినేషన్లు వేస్తే చంపేస్తామన్నారు. ఈ నాలుగు చోట్లా ఎన్నెన్ని నామినేషన్లు దాఖలయ్యాయో... ఎవరెవరు వేశారో పరిశీలన జరపాలని, స్వేచ్ఛాయుత ఎన్నికల కోసం మరోసారి నోటిఫికేషన్ జారీ చేసి ఎన్నికలు నిర్వహించాలి' అని చంద్రబాబు కోరారు. ఈ నాలుగుచోట్లా కేంద్ర భద్రతా బలగాలను దించి వారి ఆధ్వర్యంలో ఎన్నికలు జరపాలని, పోటీ చేసే అభ్యర్థులందరికీ పోలీసు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కడప జిల్లా రాయచోటి మున్సిపాలిటీల్లో 31వ వార్డులో టీడీపీ తరఫున నామినేషన్ వేయడానికి వచ్చిన మహ్మద్ జావేద్ అఖ్తర్‌ను బెదిరించి.. నామినేషన్ పత్రాన్ని లాక్కుని చించివేశారని మరో లేఖలో ఆయన ఎన్నికల సంఘానికి తెలిపారు. ఆ అభ్యర్థికి మళ్లీ నామినేషన్ దాఖలుకు అవకాశం ఇవ్వాలని కోరారు. తిరుపతి, పుంగనూరు, ధర్మవరం మున్సిపాలిటీల్లో దౌర్జన్యాలపైనా ఎస్‌ఈసీకి ఆయన లేఖలు రాశారు. అనంతపురం జిల్లా ధర్మవరంలోని 6, 24, 27, 31 వార్డుల్లో టీడీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను చించేసి, వైసీపీ నేతలు వికృతంగా ప్రవర్తించారని ఆరోపించారు. ఇదంతా చూస్తూ సంబంధిత అధికారులు ప్రేక్షక పాత్ర పోషించారన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లోని 2, 4, 10, 12, 20, 27, 39, 41, 45, 48 వార్డులు, పుంగనూరు మున్సిపాలిటీలో 1, 2, 3, 15 వార్డుల్లో ఇవే పరిస్థితులు చోటు చేసుకున్నాయని వివరించారు. తెనాలి మున్సిపాలిటీలో 4వ వార్డు టీడీపీ అభ్యర్థి ఇంట్లో మద్యం బాటిళ్లు దొరికాయని ఎక్సైజ్ అధికారులు తప్పుడు కేసు పెట్టి, అభ్యర్థి బంధువును అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు.

### ఆ సీఐలను బదిలీచేయండి..

గుంటూరు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, రూరల్ ఎస్పీకి చంద్రబాబు లేఖలు రాశారు. వైసీపీకి మద్దతు పలుకుతున్న మాచర్ల టౌన్ సీఐ రాజేశ్వరరావు, రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డిలను అక్కడి నుంచి తక్షణం బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు గృహ నిర్బంధం చేసిన టీడీపీ నేత చలమారెడ్డిని, ఆయన కుటుంబసభ్యులను తక్షణం విడుదల చేయాలని.. మాచర్ల మున్సిపల్ టీడీపీ అభ్యర్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు, నోడ్యూస్ సర్టిఫికెట్లను వెంటనే జారీ చేయాలని, ప్రతిపక్ష అభ్యర్థులకు భద్రత కల్పించాలని కోరారు.

## పంచాయతీల 'విభజన' నిలిపివేత!

- సోమవారందాకా స్టే విధించిన హైకోర్టు
- 120 గ్రామాల్లో ఎన్నికలు వాయిదా!

అమరావతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కృష్ణ, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, అనంతపురం, కడప, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, చిత్తూరు జిల్లాల్లోని సుమారు 120 గ్రామ పంచాయతీల విలీన, పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను హైకోర్టు సోమవారం వరకు నిలిపివేసింది. దీంతో ఆయా పంచాయతీల్లో ఎన్నికల ప్రక్రియ కూడా వాయిదా పడింది. గ్రామ పంచాయతీల విభజన, పునర్వ్యవస్థీకరణను వ్యతిరేకిస్తూ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్‌రావు ముందు గురు, శుక్రవారాల్లో విచారణ జరిగింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదుల్లో ఒకరైన సీనియర్ న్యాయవాది పి.వీరారెడ్డి వాదనలు వినిపిస్తూ.. "అధికార పార్టీ నేతలకు అనుకూలంగా గ్రామ పంచాయతీలను విభజిస్తున్నారు. వైసీపీ నేతలు, ఎమ్మెల్యేలు చెప్పినట్లుగా విభజనకు సంబంధించిన నోటిఫికేషన్లు జారీ చేశారు. ఎన్నికల ముందు హడావుడిగా చేపట్టిన ఈ విభజన నిబంధనలకు విరుద్ధంగా, హేతుబద్ధత లేకుండా, అశాస్త్రీయంగా సాగుతోంది. అందువల్ల ఆయా గ్రామ పంచాయతీల విభజన, పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలను అడ్డుకోవాలి. ఈ ప్రక్రియకు సంబంధించి పంచాయతీరాజ్ శాఖ జారీ చేసిన జీవోల అమలును నిలిపి వేయాలి" అని హైకోర్టును అభ్యర్థించారు. పిటిషన్లు భారీగా రావడంతో న్యాయమూర్తి తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేశారు. విభజన, పునర్వ్యవస్థీకరణ వ్యవహారం పెండింగ్‌లో ఉన్న పంచాయతీల్లో తదుపరి చర్యలేవీ చేపట్టరాదని ఆదేశించారు.

### అక్కడ ఎన్నికలు వాయిదా

విభజన, విలీన ప్రక్రియ జీవోలపై స్టే విధించడంతో 120 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు వాయిదా పడ్డాయి. కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో... 15న, 17న విడుదల చేయనున్న నోటిఫికేషన్ల నుంచి వీటిని తొలగించారు.

### ఫోన్‌లో కార్యకర్త ఫిర్యాదు

కన్నా లక్ష్మీనారాయణ విశాఖలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతుండగా ఆయనకు గుంటూరు జిల్లా దుర్గి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. బీజేపీ కార్యకర్త ఫోన్‌లో మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో తనను నామినేషన్ ఉపసంహరించుకోవాలని పోలీసులు ఒత్తిడి తెస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఉపసంహరించుకోకపోతే.. ఎస్ఐ వచ్చి సారా అమ్ముతున్నట్టు కేసు పెడతారని, అదే సీఐ వస్తే గంజాయి విక్రయిస్తున్నట్టు కేసు పెడతారని చెప్పి భయపెడుతున్నారని ఆ కార్యకర్త వాపోయాడు.



# ఎంపికలే... ఎన్నికలు లేవు

- మా అభ్యర్థులకు ప్రాణహాని ఉంది
- గవర్నర్‌కు సునీల్ దేవధర్ ఫిర్యాదు
- రాష్ట్రంలో ప్రజాస్వామ్య రహిత ఎన్నికలు
- వైసీపీ ప్రతినిధుల పాత్రలో పోలీసు శాఖ
- నిశ్శబ్ద ప్రేక్షకుడి పాత్రలో ఎన్నికల కమిషన్
- కేంద్ర హోం మంత్రి అమిత్ షాకి కన్నా లేఖ

అమరావతి, విశాఖపట్నం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రలో జరుగుతున్న స్థానిక ఎన్నికల తీరుపై భారతీయ జనతా పార్టీ రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు, కేంద్రం హోం మంత్రి అమిత్ షాకు ఫిర్యాదు చేసింది. రాష్ట్రంలో ఎంపికలే తప్ప ఎన్నికలు జరగడం లేదని వివరించింది. శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ దేవధర్ గవర్నర్‌ని కలిశారు. అధికార పార్టీ నేతలు, కార్యకర్తల నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థులకు ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ రైడీయిజం, గూండాయిజంతో అభ్యర్థులను భయపెడుతున్నారని అన్నారు. బీజేపీ, జనసేన అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని సునీల్ తెలిపారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఇదే అంశంపై అమిత్ షాకు లేఖ రాశారు. వివరాలను ఆయన విశాఖలో మీడియాకు వివరించారు. చరిత్రలో ఎప్పుడూలేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్య రహిత ఎన్నికల విధానం అమలౌతోందన్నారు. తక్షణం కేంద్ర ప్రభుత్వం ఇందులో జోక్యం చేసుకోవాలని కన్నా కోరారు. రాజకీయ అధికార దుర్వినియోగాన్ని ప్రభుత్వ యంత్రాంగమే ప్రోత్సహిస్తోందని లేఖలో తెలిపారు. పంచాయతీరాజ్ చట్టం సవరణ విషయంలో తొందరపాటు ఆర్డినెన్స్ తెచ్చారన్నారు. పోలీసు శాఖ అధికార వైసీపీ ప్రతినిధుల పాత్ర పోషిస్తోందని ఆరోపించారు. అనేక చోట్ల స్వయంగా పోలీసులే ఇతర పార్టీలకు చెందిన నాయకుల్ని అపహరిస్తున్నారని, నామినేషన్లు దాఖలు చేయకుండా తప్పుడు కేసులు పెట్టి, అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని వివరించారు. నామినేషన్ దాఖలు చేయడానికి వచ్చిన గర్భిణీని ఒక పోలీసు అధికారి తన్నారని పేర్కొన్నారు. జగన్ నియమించిన వాలంటీర్లు వైసీపీకి ఓటు వేయకపోతే పథకాలు నిలిపివేస్తామని బెదిరిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. ఎన్నికలకు వాచ్‌డాగ్‌లా ఉండాల్సిన ఎన్నికల కమిషన్ దురదృష్టవశాత్తూ నిశబ్ద ప్రేక్షకుడిలా మారిందన్నారు. ఎన్నికల్లో మద్యం, డబ్బు పంపిణీ చేస్తే కేసులు పెట్టడానికి విపక్ష పార్టీలపై వైసీపీ కన్నేసిందనీ, వారు మాత్రం సొంత మద్యం దుకాణాల ద్వారా మద్యం, వలంటీర్ల ద్వారా డబ్బు పంపిణీ చేయడానికి ముందుగానే ఏర్పాట్లు చేసుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ఎగతాళిగా మారిందన్నారు. కేంద్రం తక్షణం జోక్యం చేసుకోకపోతే పోలింగ్‌లో రక్తపాతం మరింత పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ ఓటరులో విశ్వాసం కలిగించేందుకు కేంద్రం జోక్యం అవసరం అని కన్నా విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, పార్టీ నాయకులు కాశీ విశ్వనాథ రాజు తదితరులు పాల్గొన్నారు.

### శాంతిభద్రతలపై నివేదిక ఇవ్వండి

- గవర్నర్‌ను కోరిన కేంద్ర హోంశాఖ

అమరావతి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతి భద్రతల అంశంపై నివేదిక ఇవ్వాలని గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌ను కేంద్ర హోంశాఖ కోరింది. స్థానిక ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న హింస, అరాచకాలపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు బీజేపీ నేతలు సీఎం రమేశ్, టీజీ వెంకటేశ్, జీవీఎల్ నరసింహరావు ఫిర్యాదు చేశారు. చిత్తూరు జిల్లాలో బీజేపీ-జనసేన అభ్యర్థులపై దాడులు, ఇతర ప్రాంతాల్లో నెలకొన్న హింసాత్మక పరిస్థితులు, బెదిరింపుల నేపథ్యంలో ఈ నివేదిక కోరినట్లు తెలిసింది. మరోవైపు గతంలో కాకినాడలో జరిగిన దాడులపై ఇటీవలే బీజేపీ నేత చినబాబు ఇచ్చిన ఫిర్యాదుపైనా కేంద్ర హోంశాఖ నుంచి రాష్ట్ర హోంశాఖకు తాఖీదు అందింది.

## చేయిదాటితే చర్యలు!

- అమిత్ షా హామీ ఇచ్చారు.. ఎంపీలు జీవీఎల్, రమేశ్, టీజీ వెల్లడి
- పార్లమెంటు భవనంలో భేటీ.. వైసీసీ 'స్థానిక' అరాచకాలపై ఫిర్యాదు
- తొత్తులుగా ఎన్నికల సంఘం, పోలీసులు
- డీజీపీ ప్రోద్బలంతో బీజేపీ అభ్యర్థులపై దాడులు
- నామినేషన్ల ఉపసంహరణకు ఒత్తిళ్లు: బీజేపీ నేతలు

న్యూఢిల్లీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న అరాచక పరిస్థితులు అదుపు కాకుంటే.. అవి చేయి దాటితే చర్యలు తీసుకుంటామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చెప్పారని బీజేపీ ఎంపీలు తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక ఎన్నికల్లో అధికార వైసీపీ నేతలు, జగన్ ప్రభుత్వం చేస్తున్న దాడులు, అరాచకాలపై ఎంపీలు జీవీఎల్ నరసింహారావు, సీఎం రమేశ్, టీజీ వెంకటేశ్ శుక్రవారం పార్లమెంటు భవనంలో హోం మంత్రికి ఫిర్యాదు చేశారు. బీజేపీ అభ్యర్థులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని.. వైసీపీ నేతలు ఏవిధంగా దాడులు చేస్తున్నారో వివరించారు. తక్షణమే జగన్ ప్రభుత్వం ఆగడాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు విజయ్‌చౌక్ వద్ద విలేకరులతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వానికి పోలీసులు, రాష్ట్ర ఎన్నికల సంఘం తొత్తులుగా మారిపోయారని జీవీఎల్ ఆరోపించారు. పోలీసులు వైసీపీ కార్యకర్తల్లా పనిచేస్తూ.. బీజేపీ కార్యకర్తలు, అభ్యర్థులపై దాడులకు తెగబడుతూ.. నామినేషన్లు వేయకుండా అడ్డుపడుతూ.. రక్తపాతం సృష్టించి భయభ్రాంతులను సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. అప్రజాస్వామికంగా వ్యవహరించడం మంచిది కాదని తాము హెచ్చరిస్తున్నా జగన్ ప్రభుత్వంలో మార్పు లేదని.. అందుకే అమిత్‌షాను కలిసి ఫిర్యాదు చేశామని తెలిపారు. సహచర ఎంపీ సుజనా చౌదరి చెన్నై వెళ్లడంతో రాలేకపోయారని చెప్పారు. నామినేషన్లు ఉపసంహరించుకోవాలని బీజేపీ అభ్యర్థులపై ఒత్తిడి తెస్తున్నారని.. డీజీపీ, పోలీసులు కూడా దాడులకు పురిగొల్పుతున్నారని ఆరోపించారు. కేరళ, పశ్చిమ బెంగాల్లో మాదిరిగా జగన్ ప్రభుత్వం అదే పద్ధతిలో వ్యవహరిస్తోందని.. ఇప్పటికైనా కళ్లు తెరవాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. జగన్ ప్రభుత్వ అప్రజాస్వామిక, దుర్మార్గ చర్యలపై ఇప్పటికే అనేక మంది న్యాయస్థానాల్లో కేసులు దాఖలు చేశారని, అవసరమైతే తామూ కోర్టుకు వెళ్తామన్నారు. హైకోర్టు అనేక సందర్భాల్లో మొట్టికాయలు వేస్తున్నా రాష్ట్రప్రభుత్వం బేఖాతరు చేస్తోందని.. పంచాయతీలు, సచివాలయ భవనాలకు వేసిన రంగులను తొలగించాలని ఆదేశించినా పట్టించుకోవడం లేదన్నారు. పరిస్థితులు చేయిదాటితే చర్యలు తీసుకుంటామని అమిత్ షా హామీ ఇచ్చారని సీఎం రమేశ్ చెప్పారు. ప్రభుత్వంతో ఎన్నికల సంఘం, పోలీసులు కుమ్మక్కైతే ఇక ఎన్నికలు నిర్వహించడం అనవసరమని, అభ్యర్థులను అధికారపక్షం వారే ఎంపిక చేసుకోవచ్చని ఎద్దేవా చేశారు. ఈ అరాచకాలపై పంచాయతీరాజ్, న్యాయశాఖ మంత్రులకు కూడా ఫిర్యాదు చేయాలని అమిత్‌షా తమకు సూచించారని తెలిపారు. స్థానిక సంస్థల్లో విజయం సాధించకపోతే మంత్రి పదవులు పీకేస్తానని జగన్ హెచ్చరించడంతో మంత్రులు అన్ని అడ్డదారులూ తొక్కుతున్నారని టీజీ మండిపడ్డారు. ఎన్నికల్లో మద్యం పంపిణీ చేసినా, డబ్బులు పంచినా.. మూడేళ్ల జైలుశిక్షంటూ అధికార పక్షం ప్రత్యర్థులను భయపెట్టడం దారుణమన్నారు.

# ఆరుగురు రెబెల్ మంత్రుల డిస్మిస్

### కమల్‌నాథ్ వ్యూహాత్మక అడుగులు

- బీజేపీ యత్నాలను దెబ్బతీయడమే లక్ష్యం
- బలనిరూపణకు సిద్ధం



భోపాల్, బెంగళూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మధ్యప్రదేశ్ రాజకీయం రసవత్తరంగా మారుతోంది. తిరుగుబాటు చేసిన ఆరుగురు మంత్రులపై ముఖ్యమంత్రి కమల్‌నాథ్ వేటు వేశారు. వారిని డిస్మిస్ చేయాల్సిందిగా ముఖ్యమంత్రి కమల్‌నాథ్ చేసిన వినతికి గవర్నర్ లాల్జీ టాండన్ అంగీకరించి వెంటనే సంతకం చేశారు. ఇది రెబెల్ ఎమ్మెల్యేల్లో వణుకు పుట్టించింది. ప్రస్తుతం బెంగళూరులో మకాం వేసిన 23 మంది ఎమ్మెల్యేలు నిజానికి శుక్రవారం రాత్రికి తిరిగి రావాల్సి ఉంది. వీరు ఇంతకుముందే తమ రాజీనామా లేఖలను తమ ప్రతినిధుల ద్వారా స్పీకర్ ఎన్‌పీ ప్రజాపతికి పంపారు. అయితే వ్యక్తిగతంగా వచ్చి వివరణ ఇవ్వాలని ఆయన కోరడంతో వారు భోపాల్ తిరిగి రావాలని భావించారు. కానీ రెబెల్ మంత్రులను డిస్మిస్ చేయడంతో కమల్‌నాథ్ తదుపరి వ్యూహం తెలియక వారు వెనకడుగు వేశారు. స్వరాష్ట్రం వెళ్లడానికి బెంగళూరులోని దేవనహళ్లి అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. వీరికోసం భోపాల్ నుంచి రెండు ప్రత్యేక చార్టెడ్ విమానాలనూ సిద్ధంగా ఉంచారు. అయితే తిరిగి వెళితే కాంగ్రెస్ ఉచ్చులో ఇరుక్కుంటామేమోనని భయపడ్డ వీరు కొద్దిసేపు విమానాశ్రయంలోనే సమావేశం నిర్వహించి ఆఖరి నిమిషంలో తమ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. స్టార్ హోటల్ నుంచి దేవనహళ్లి శివారులోని ఓ రిసార్ట్‌కు మకాం మార్చారు.

### కమల్‌నాథ్ ఆత్మ 'విశ్వాసం'

అసెంబ్లీలో బలపరీక్షకు తాను సిద్ధమని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ ప్రకటించారు. "మార్చి 16 నుంచి బడ్జెట్ సమావేశాలు మొదలవుతాయి. స్పీకర్ నిర్ణయించే రోజున బల పరీక్ష జరుగుతుంది. ఇందుకు మేం రెడీ. ఓ రాజ్యాంగ పదవిలో ఉన్న నేను ప్రస్తుత సంక్షోభ సమయంలో చేయదగ్గ కనీస విధి ఇది' అని ఆయన అన్నారు. బల పరీక్షలో నెగ్గగలమన్న ఆత్మవిశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. రాష్ట్ర గవర్నర్ లాల్జీ టాండన్‌తో శుక్రవారం ఉదయం సమావేశమైన ఆయన-- బీజేపీ 23 మంది ఎమ్మెల్యేలను చెరపట్టిందని, వారిలో ఆరుగురు మంత్రులు కూడా ఉన్నారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఓ మూడు పేజీల లేఖను ఆయనకు అందజేశారు. 'బీజేపీ భారీగా రాజకీయ బేరసారాలకు పాల్పడుతోంది. విశ్వాస పరీక్ష ఎపుడైనా జరిగే అవకాశం ఉంది. వారిని తక్షణం విడుదల చేయించాలి. గవర్నర్ జోక్యం చేసుకుని తనకున్న అధికారాలను వినియోగించి కేంద్ర హోంశాఖ సహాయంతో వారికి విముక్తి కల్గించాలి' అని కమల్‌నాథ్ పేర్కొన్నారు. బీజేపీ ఎత్తుగడలను చిత్తు చేయడమే లక్ష్యంగా కమల్‌నాథ్ కదులుతున్నారు. ప్రభుత్వం మైనారిటీలో పడ్డప్పటికీ బలపరీక్షకు సిద్ధమని ప్రకటించడం ద్వారా బీజేపీకి సవాల్ విసిరారు.

## ఉన్నావ్ రేపిస్ట్‌కు మరో పదేళ్ల శిక్ష

- బాధితురాలి తండ్రి మరణానికి కారకుడిగా తేల్చిన కోర్టు
- ఇప్పటికే ఆ జన్మాంతం ఖైదు అనుభవిస్తున్న శెంగార్

న్యూఢిల్లీ, మార్చి 13: ఉన్నావ్ అత్యాచార దోషి, బీజేపీ బహిష్కృత ఎమ్మెల్యే కుల్‌దీప్ శెంగార్‌కు ఢిల్లీలోని ఓ కోర్టు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించింది. పోలీసు కస్టడీలో ఉన్నపుడు బాధితురాలి తండ్రిని కొట్టి ఆయన మరణానికి కారణమైనందుకు ఆయనకు, ఆయన సోదరుడు అతుల్ శెంగార్‌కు, మరో ఆరుగురికి కూడా పదేళ్ల జైలు, పది లక్షల జరిమానా విధించింది. మైనారిటీ తీరని బాలికను దారుణంగా రేప్ చేసి చంపేసిన నేరంపై శెంగార్ ఇప్పటికే జీవనకాల(చనిపోయేదాకా) జైలుశిక్ష అనుభవిస్తున్నారు. 'చంపాలన్న ఉద్దేశం ఉండకపోవచ్చు. కానీ బాధితురాలి తండ్రిని కొట్టి చంపడం వల్ల అది శిక్షార్హమైన హత్యేనని(కల్పబుల్ హోమిసైడ్) కోర్టు భావిస్తోంది. ఐపీసీ 304 కింద ఆ నేరానికి ఉన్న గరిష్ఠ శిక్ష పదేళ్ల ఖైదు విధిస్తున్నాం' అని డిస్ట్రిక్ట్ కోర్టు జడ్జి ధర్మేశ్ శర్మ తన తీర్పులో పేర్కొన్నారు. "ఆమె తండ్రిని ఎలాగైనా ఆయుధాల కేసులో ఇరికిద్దామని కుట్రపన్నారు. స్టేషన్‌కు లాక్కొచ్చి లాకప్‌లో పెట్టి తీవ్రంగా కొట్టారు. చావు బతుకుల్లో ఉన్న ఆయనను ప్రభుత్వ ఆసుపత్రికి తీసికెళితే డాక్టర్లు చాలా నిర్లక్ష్యంగా, కసాయివారిలా వ్యవహరించారు. ఇది దారుణం" అని జడ్జి ఘాటుగా విమర్శలు గుప్పించారు. జుడీషియల్ కస్టడీలో ఉన్నపుడు గాయపడి వచ్చిన వ్యక్తికి సరైన చికిత్స అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన డాక్టర్లపై చర్యలు తీసుకోవాల్సిందిగా యూపీ ప్రభుత్వాన్ని ఆదేశిస్తున్నట్లు కూడా తీర్పులో పేర్కొన్నారు.

### స్కూళ్లలో పనిచేసే టీచర్లు, సిబ్బందిపై
## పోలీసు వెరిఫికేషన్

- హాస్టళ్లు, క్రీడా అకాడమీలు.. బాలలతో ముడిపడ్డ ప్రతి సంస్థలో కూడా
- చైల్డ్ పోర్నోగ్రఫీపైనా కఠిన చర్యలు
- పోక్సో నిబంధనల్లో కీలకాంశాలివే

న్యూఢిల్లీ, మార్చి 13: పాస్‌పోర్టు దరఖాస్తుదారులు, కీలక ఉద్యోగాల్లో అభ్యర్థుల గుణగణాలను తెలుసుకునేందుకు.. వారి నేర చరిత్రను గుర్తించేందుకు పోలీసు వెరిఫికేషన్ చేయడం తెలిసిందే. ఇకపై స్కూళ్లు, హాస్టళ్లు, బాలబడి(క్రెష్‌లు), క్రీడా అకాడమీలు.. బాలలతో ముడిపడి ఉన్న ప్రతి సంస్థలో పనిచేసే ఉపాధ్యాయులు, సిబ్బందిపై కూడా ఇదే తరహాలో పోలీసు వెరిఫికేషన్ జరగనుంది. వారి మానసికస్థితి ఏంటి? చిన్నారులపై నేరాలకు పాల్పడే ధోరణి ఉందా? అనే కోణాల్లో పోలీసులు విచారణ జరపుతారు. బాలలపై లైంగిక నేరాల నిరోధ (పోక్సో) నిబంధనలు-2020 ప్రకారం ఇకపై పోలీసు వెరిఫికేషన్ తప్పనిసరి. ఈ నెల 9 నుంచి పోక్సో నిబంధనలు అమల్లోకి వచ్చాయి. చిన్నారుల గుర్తింపును (భౌతికంగా, వర్చువల్‌గా) భద్రపరిచే అంశానికే ఈ నిబంధనలు ప్రాధాన్యతనిచ్చాయి. చైల్డ్ పోర్నోగ్రఫీ విషయంలోనూ పోక్సో చట్టం, నిబంధనలు కఠినంగా ఉన్నాయి. చైల్డ్ పోర్నోగ్రఫీని ఫోన్లు, కంప్యూటర్లలో, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాల్లో కలిగి ఉన్నా.. ఇతరులకు పంపినా, ఇతరులకు చూపినా, చిన్నారులకు చూపించినా కఠిన శిక్షలు ఉంటాయి. ఈ మేరకు పోక్సో నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, విధివిధానాలను రూపొందించుకోవాలంటూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## ఫరూఖ్‌కు విముక్తి

- ఆయనపై ప్రజా భద్రతా చట్టం ఎత్తివేత



శ్రీనగర్, న్యూఢిల్లీ, మార్చి 13: జమ్ముకశ్మీర్ మాజీ సీఎం, సీనియర్ పార్లమెంటేరియన్ ఫరూఖ్ అబ్దుల్లాపై ప్రజా భద్రతా చట్టం (పీఎస్ఏ)ను ఉపసంహరిస్తూ స్థానిక అధికార యంత్రాంగం శుక్రవారం ఆదేశాలిచ్చింది. దీంతో ఏడు నెలలపైగా సమయం అనంతరం ఆయన జన జీవనంలోకి రానున్నారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 ఎత్తివేతతో గతేడాది ఆగస్టు 5న ఫరూఖ్‌ను ముందుజాగ్రత్తగా అదుపులోకి తీసుకున్నారు. సెప్టెంబరు 15న ఆయనపై పీఎస్ఏను ప్రయోగించారు. కఠినమైన ఈ చట్టం కింద ఏ వ్యక్తినైనా విచారణ లేకుండా మూడు నెలల పాటు నిర్బంధించవచ్చు. కాగా, డిసెంబరు 13న మాజీ సీఎం నిర్బంధాన్ని పొడిగించారు. ఈ వ్యవధి ముగియనుండగా.. కలెక్టర్ షాహిద్ ఇక్బాల్ చౌధురి శుక్రవారం ఫరూఖ్ నివాసానికి వెళ్లి విడుదల ఉత్తర్వులిచ్చారు. శ్రీనగర్ ఎంపీ అయిన ఫరూఖ్ ప్రస్తుత పార్లమెంటు సమావేశాలకు హాజరయ్యే ఆలోచనలో ఉన్నారు. తన విడుదల కోసం పార్లమెంటులో గొంతెత్తిన సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన కుమారుడు, మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లాపై పీఎస్ఏను గత నెల 6న పునరుద్ధరించారు. మరోవైపు ఫరూఖ్ విడుదలను స్వాగతించిన కేంద్ర మాజీ మంత్రి చిదంబరం.. జమ్ముకశ్మీర్‌లో నియంతృత్వం, ఏకపక్ష పోకడలు రాజ్యమేలుతున్నాయని ధ్వజమెత్తారు. ఇదే వైరస్ దేశంలోని మిగతా రాష్ట్రాలకూ పాకుతోందని అన్నారు.

## ఫేస్‌బుక్‌తో 'దొరికాడు!'

### బ్యాంకు సీఎండీ కిడ్నాప్.. నిందితుడి గుర్తింపు

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ముంబైలో ఏపీకి చెందిన ఓ బ్యాంకు అధికారిని డిపాజిట్ల పేరుతో పిలిచి, కిడ్నాప్ చేసిన ముఠాలో కీలక నిందితుడిని పోలీసులు గుర్తించారు. విజయవాడ కేంద్రంగా పనిచేస్తున్న ఏపీ మర్చంటైల్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ఏడో బ్రాంచ్‌ని గత నెల 12న ముంబైలో ప్రారంభించారు. బ్యాంకు సీఎండీ బండారు సత్యనారాయణ అక్కడే ఉంటూ మార్కెటింగ్ పనుల్లో బిజీగా ఉండగా.. సీనియర్ సిటిజన్ల పేరుతో ఓ ముఠా ఆయనకు ఫోన్ చేసి, భారీగా డిపాజిట్లు చేస్తామని నమ్మబలికింది. గత శుక్రవారం ముంబైకి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న కమోతేకు పిలిపించుకుని ఆయనను కిడ్నాప్‌చేసింది. ఆయనను చిత్రహింసలకు గురిచేసి రూ.కోటి డిమాండ్ చేసింది. చివరికి రూ. 35 లక్షలు తమ బ్యాంకు ఖాతాకు బదిలీ చేయించుకుని వదలిపెట్టింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కమోతే పోలీసులు ఈ నెల 10న కేసు నమోదు చేశారు. కిడ్నాపర్లు 'వినాయక్ డెకర్స్' పేరుతో ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన ఖాతాకు డబ్బు బదిలీ చేయించుకున్నారు. ఆ ఖాతా నంబరు ఆధారంగా కూపీ లాగినప్పుడు... దానిని వినాయక్ పురోహిత్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నాడని తేలింది. ముంబైలో ఉంటున్న వినాయక్ పురోహిత్ అనే వ్యక్తులను ఫేస్‌బుక్‌లో సెర్చ్ చేయగా... పదిమంది వివరాలు బయటపడ్డాయి. వారందరి ఫొటోలను ఒక్కొక్కటిగా వాట్సాప్‌లో బాధితుడు సత్యనారాయణకు పంపగా, ఒక ఫొటోను గుర్తించారు. దీంతో నిందితుడిని పోలీసులు గుర్తించారు.

## 'అనుబంధా'ల్లో అక్రమాలు

- చేతివాటం ప్రదర్శిస్తోన్న వర్సిటీలు
- ఎడాపెడా ప్రైవేట్ కాలేజీలకు అఫిలియేషన్

అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాలు జారీ చేస్తున్న అనుబంధ (అఫిలియేషన్) ఆదేశాలలో పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రైవేట్ డిగ్రీ కాలేజీలు అడిగిందే తడవుగా నిబంధనలు పాటించకుండా ఎడాపెడా ఆర్డర్లు ఇచ్చే పర్వం కొనసాగుతోంది. వర్సిటీల చట్టంలోని ప్రొవిజన్లను పట్టించుకోవడం లేదు. ఉన్నత విద్యామండలి అప్రూవల్ లేకున్నా, వర్సిటీల పాలకమండళ్ల (ఈసీ) ఆమోదం లేకున్నా బేఫికర్! అలాగే డిగ్రీ కాలేజీల్లో జీరో అడ్మిషన్లు ఉన్నా, తాత్కాలిక ఆదేశాలు సస్పెండ్ చేసినా సరే ఎడాపెడా కాలేజీలకు అఫిలియేషన్ ఆర్డర్లు జారీచేస్తున్నారు. వీసీలతో సంబంధం లేకుండానే నేరుగా డీన్లు కాలేజీలకు అఫిలియేషన్ ఆర్డర్లు ఇస్తున్నారు. అఫిలియేషన్ లేని డిగ్రీ కాలేజీల విద్యార్థులు కూడా పరీక్షలు రాస్తున్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నియమించిన కమిటీ తాజాగా చేపట్టిన విచారణ, శుక్రవారం నాటి డీన్స్ సమావేశం సందర్భంగా పలు అక్రమాలు వెలుగు చూసినట్లు సమాచారం. రాష్ట్రంలో మొత్తం 1153 ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ డిగ్రీ కాలేజీలుండగా.. అందులో నిబంధనలు పాటించని 246 డిగ్రీ కాలేజీలకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. మూడేళ్లుగా అఫిలియేషన్ లేకుండా నడుస్తోన్న 72 కాలేజీలు, 'సున్నా' అడ్మిషన్లు ఉన్న 24కాలేజీలు, 25% కంటే తక్కువ అడ్మిషన్లు కలిగిన 150 కాలేజీలు ఇందులో ఉన్నాయి. అరకొర అడ్మిషన్లతో ఆయా కాలేజీల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.



నామినేషన్ దాఖలు చేస్తున్న కేంద్ర మాజీ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా

## రాజ్యసభకు సింధియా నామినేషన్

- చివరిరోజున దేశవ్యాప్తంగా జోరుగా దాఖలు

భోపాల్, మార్చి 13: కేంద్ర మాజీ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా శుక్రవారం బీజేపీ అభ్యర్థిగా రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు వీడీ శర్మ తదితరులు ఉన్నారు. మంగళవారం కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన సింధియా.. ఆ వెంటనే జేపీ నడ్డా సమక్షంలో బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. కాగా.. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో శుక్రవారం నామినేషన్ల ప్రక్రియ జోరందుకుంది. రాజస్థాన్‌లో మూడు ఖాళీలుండగా.. కాంగ్రెస్, బీజేపీల తరఫున చెరో రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. రెండు ఖాళీలున్న ఛత్తీస్‌గడ్‌లో కాంగ్రెస్ తరఫున రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. హిమాచల్‌ప్రదేశ్‌లో ఒక ఖాళీ ఉండగా.. బీజేపీ నుంచి ఇందు గోస్వామి నామినేషన్ దాఖలు చేశారు. మహారాష్ట్రలో ఏడు ఖాళీలుండగా.. కాంగ్రెస్, శివసేన, ఎన్‌సీపీల నుంచి ముగ్గురు, బీజేపీ నుంచి ఒకరు శుక్రవారం నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్‌సీపీ నేత శరద్‌పవార్, కేంద్రమంత్రి రాందాస్ అథవాలే సహా ముగ్గురు బీజేపీ నాయకులు ఇదివరకే నామినేషన్లు దాఖలు చేశారు. బిహార్ నుంచి రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ సహా ముగ్గురు జేడీయూ-బీజేపీ నాయకులు నామినేషన్లు దాఖలు చేశారు.

### కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు
## డీఏ 4 శాతం పెంపు



న్యూఢిల్లీ, మార్చి 12: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కరవుభత్యం(డీఏ) 4% శాతం పెరిగింది. ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ శుక్రవారం ఈ మేరకు ఆమోదం తెలిపింది. తాజా పెంపుతో డీఏ 21 శాతానికి చేరింది. జనవరి 1 నుంచే పెంపు అమల్లోకి వస్తుంది. చివరిసారిగా గత అక్టోబరులో ఉద్యోగుల డీఏ పెరిగింది. అప్పుడు 5 శాతం పెంపుతో డీఏ 17 శాతానికి చేరింది. తాజా పెంపు కారణంగా ప్రభుత్వంపై రూ.14,595 కోట్ల అదనపు భారం పడనుందని కేంద్ర మంత్రి ప్రకాశ్ జావడేకర్ వెల్లడించారు. డీఏ పెంపుతో 48 లక్షల మంది ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి చేకూరుతుందని ఆయన చెప్పారు.

### ట్రాన్స్‌జెండర్లకు
### రిజర్వేషన్ల కోసం రాజ్యసభలో బిల్లు

న్యూఢిల్లీ, మార్చి 13: పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలలో ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ బీజేడీ ఎంపీ సస్మిత్ పాత్రా శుక్రవారం రాజ్యసభలో ప్రైవేటుమెంబర్స్ బిల్లు ప్రవేశపెట్టారు. దీంతో పాటు కుటుంబంలోని మహిళలపై జరుగుతున్న లైంగిక నేరాలను నిర్వచించి, విధించాల్సిన శిక్షలపై కూడా ఆయన మరో బిల్లు ప్రవేశపెట్టారు. అలాగే మరో సభ్యుడు.. ఎన్నికల ఖర్చుపై ఉన్న పరిమితిని ఎత్తివేయాలని కోరుతూ ఓ ప్రైవేటుమెంబర్స్ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై కేంద్ర న్యాయ మంత్రి రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఎన్నికలు ధన ప్రదర్శనకు వేదిక కారాదని, ఈ బిల్లుకు మద్దతునిస్తే.. ప్రభుత్వం రాజీపడ్డట్టవుతుందని అన్నారు. వీటితో పాటు శుక్రవారం మొత్తం తొమ్మిది ప్రైవేటుమెంబర్స్ బిల్లులు ప్రవేశపెట్టారు.

# కరోనాకు మరొకరు బలి

## ఢిల్లీలో 69 ఏళ్ల వృద్ధురాలి మృతి.. దేశవ్యాప్తంగా 81కి చేరిన కొవిడ్-19 కేసులు

న్యూఢిల్లీ, మార్చి 13: దేశంలో కొవిడ్-19 కేసుల సంఖ్య 81కి చేరింది. అయినప్పటికీ ఆందోళన చెందాల్సిన పని లేదని.. కరోనా వల్ల దేశంలో ఆరోగ్య అత్యవసర స్థితి ఏర్పడలేదని ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ పేర్కొన్నారు. కొవిడ్-19 బారిన పడినవారిలో ఏడుగురికి చికిత్సతో నయమైందని త్వరలో వారిని ఇంటికి పంపుతామని ఆయన పేర్కొన్నారు. మొత్తం రోగుల్లో 71 మంది పరిస్థితి వైద్యపరంగా నిలకడగా ఉందని చెప్పారు. కరోనా ప్రభావిత దేశాల నుంచి ఇప్పటిదాకా 48 మంది విదేశీయులు సహా 1031 మందిని భారత్‌కు తీసుకువచ్చామని.. వారిలో 890 మంది 14 రోజుల ఐసోలేషన్ పూర్తిచేసుకుని వైరస్ నెగెటివ్‌గా తేలడంతో ఇంటికి పంపామని తెలిపారు. వైరస్ వ్యాపిస్తున్న నేపథ్యంలో.. దేశవ్యాప్తంగా 4000 మందిని పరిశీలనలో ఉంచినట్టు ఆయన చెప్పారు. హైదరాబాద్‌లో మృతి చెందిన కలబుర్గివాసి సిద్దిఖీకి కొవిడ్-19 పాజిటివ్ వచ్చినప్పటికీ ఆయన మరణానికి ఇతర ఆరోగ్య కారణాలు కూడా ఉన్నాయని కేంద్ర ఆరోగ్య శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. సిద్దిఖీని నేరుగా తాకిన 46 మందిని గుర్తించి వారిని క్వారంటైన్‌లో ఉంచినట్టు కర్ణాటక వైద్యశాఖ అధికారులు తెలిపారు. వారిలో 31 మందిని హైరిస్క్, 15 మందిని లో-రిస్క్ కేటగిరీలో పెట్టినట్టు చెప్పారు. ఇక, కొత్త కేసుల విషయానికి వస్తే.. మూడు రోజుల క్రితం ఇటలీ నుంచి వచ్చి మానేసర్‌లోని ఆర్మీ క్వారంటైన్‌లో ఉంటున్న ఒక వ్యక్తికి వైరస్ పాజిటివ్‌గా తేలినట్టు ఆర్మీ వర్గాలు ధ్రువీకరించాయి. ఆయనను వెంటనే ఐసోలేషన్ వార్డుకు తరలించారు. అమెరికా నుంచి ఇటీవలే నాగపూర్‌కు వచ్చిన 45 ఏళ్ల వ్యక్తికి, ఆయన భార్యకు కరోనా సోకినట్టు అధికారులు తెలిపారు. పుణేలో కూడా ఒక పాజిటివ్ కేసు నమోదైంది. దీంతో మహారాష్ట్రలో కరోనా కేసులు 17కు పెరిగింది. బెంగళూరులోని తమ కార్యాలయంలో ఒక ఉద్యోగికి (26) కరోనా సోకినట్టు గూగుల్ సంస్థ ధ్రువీకరించింది. కొద్దిరోజుల క్రితం గ్రీస్‌కు వెళ్లొచ్చిన అతడికి వైరస్ పాజిటివ్ వచ్చిందని పేర్కొంది. అతడితో సన్నిహితంగా ఉన్న ఉద్యోగులను స్వీయ గృహనిర్బంధంలో ఉండాల్సిందిగా కోరినట్టు చెప్పింది. ఇంటి నుంచే పనిచేయాల్సిందిగా సిబ్బందికి సూచించింది. అమెజాన్ సంస్థ కూడా హైదరాబాద్‌లోని తమ కార్యాలయ ఉద్యోగుల్లో.. ఇళ్ల నుంచే పనిచేసే వీలున్న వారందరినీ వర్క్ ఫ్రమ్ హోమ్ చేయాల్సిందిగా కోరింది. కరోనా


అహ్మదాబాద్‌లో మాస్కులతో యాగం చేస్తున్న దృశ్యం

అనుమానిత లక్షణాలతో బాధపడుతున్న ఇటాలియన్ జంట, థాయ్‌కు చెందిన మరొకరు కోల్‌కతాలోని ఒక ఆస్పత్రిలో ఐసోలేషన్ వార్డులో చికిత్స పొందుతున్నారు. అటు కేరళలో కరోనా పాజిటివ్‌గా తేలిన ఒక వ్యక్తికి పొరుగింట్లో ఉండే వృద్ధుడు గురువారం మరణించాడు. ఆయన మృతికి కూడా కరోనానే కారణమని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే.. ఆయన గుండెపోటుతో మరణించినట్టు పోస్టుమార్టం చేసిన వైద్యులు చెబుతున్నారు. చైనాలోని వూహాన్ నుంచి తీసుకొచ్చి ఐటీబీపీ క్వారంటైన్‌లో ఉంచిన 112 మందికీ వైరస్ నెగెటివ్‌గా తేలడంతో వారిని త్వరలో విడుదల చేయనున్నారు. ఇరాన్ నుంచి 44 మంది భారతీయులను శుక్రవారం ప్రత్యేక విమానంలో ముంబైకి తీసుకొచ్చారు. ఇటలీ, ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయుల్లో మరికొందరిని శనివారంనాడు ప్రత్యేక విమానంలో తీసుకురానున్నట్టు పౌరవిమానయాన శాఖ అధికారులు తెలిపారు. ఇటలీ నుంచి మరికొందరు భారతీయులు ఆదివారం ఉదయం మన దేశానికి చేరుకోనున్నారు. అయితే.. ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయులకు వైద్యపరీక్షలు చేసేందుకు అక్కడే ఒక ప్రయోగశాలను ఏర్పాటు చేయాలని మన అధికారులు ప్రయత్నించినా, భద్రతా కారణాలరీత్యా ఇరాన్ సర్కారు అనుమతి ఇవ్వలేదు. కరోనా ముప్పు అధికంగా ఉన్న ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, ఇజ్రాయిల్, దక్షిణకొరియా, శ్రీలంక కు ఏప్రిల్ 30 దాకా విమాన సర్వీసులను ఎయిరిండియా రద్దు చేసింది.

### కోర్టుల జాగ్రత్త

#### అత్యవసర కేసులైతేనే విచారణ: సుప్రీం

న్యూఢిల్లీ, ముంబై: కరోనా ముప్పు నేపథ్యంలో.. న్యాయస్థానాల ప్రాంగణంలో వైరస్ ప్రబలకుండా కోర్టులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకునే పనిలో పడ్డాయి. అత్యవసర కేసులను మాత్రమే విచారించాలని.. కోర్టు గదుల్లోకి కేవలం లాయర్లను మాత్రమే అనుమతించాలని సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ హైకోర్టు కూడా శుక్రవారం అత్యవసర సమావేశ నిర్వహించి.. మార్చి 16 నుంచి అత్యవసర కేసులైతేనే విచారించాలని నిర్ణయించింది. తప్పనిసరి అయితే తప్ప కక్షిదారుల వ్యక్తిగత హాజరును కోరకూడదని నిశ్చయించింది. అత్యవసరమైతేనే కోర్టుకు రావాలని న్యాయవాదులకు, కక్షిదారులకు బాంబే హైకోర్టు సూచించింది. హైకోర్టుకు వచ్చినపుడు.. కేంద్ర ఆరోగ్య శాఖ జారీ చేసిన నిబంధనలను పాటించాలని ఆదేశించింది.

### సౌదీ, కువైత్‌లో పరీక్షలు వాయిదా

(గల్ఫ్ నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

కరోనా భయంతో సౌదీ, కువైత్‌లో పలు పరీక్షలను వాయిదా వేశారు. దీంతో తెలుగు విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. గల్ఫ్‌లో పరీక్షలు రాసిన తర్వాత ఎంసెట్, జేఈఈ రాయడానికి సొంత దేశం వెళ్లాలనుకున్నారు. ఇప్పటికే విమాన ప్రయాణాల ఇబ్బందులతో బాధపడుతున్నారు. ఇప్పుడు సౌదీ, కువైత్‌లలో సీబీఎస్ఈ వార్షిక పరీక్షలను నిరవధికంగా వాయిదా వేశారు. గల్ఫ్‌లో భారతీయ విద్యబోధన చేసే పాఠశాలలు 50కు పైగా ఉన్నాయి. అవన్నీ సీబీఎస్ఈకు అనుబంధంగా ఉండగా, అందులో వేలాది మంది తెలుగు ప్రవాసీయుల పిల్లలు చదువుతున్నారు. గల్ఫ్ దేశాలన్నీ విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించాయి. కానీ, 10, 12వ తరగతి పరీక్షలు మాత్రం ఇప్పటి వరకు యథావిధిగా కొనసాగాయి. కానీ శుక్రవారం నుండి ఈ పరీక్షలనూ వాయిదా వేయాలని సౌదీ అరేబియా, కువైత్ దేశాల ప్రభుత్వాలు ఆదేశించాయి. యూఏఈ సహా మిగిలిన దేశాల్లోనూ ముందుందు పరీక్షలు యథావిధిగా కొనసాగుతాయా? లేదా అన్నది కచ్చితంగా చెప్పలేని పరిస్థితి ఉంది. పరీక్షలు రాసిన అనంతరం విద్యార్థులందరూ తెలుగు రాష్ట్రాల్లో డిగ్రీ కోర్సుల్లో చేరడానికి సన్నాహాలు చేసుకున్నారు. వారిలో చాలా మంది జేఈఈ, ఎంసెట్ రాయడానికి కోచింగ్ తీసుకుంటున్నారు. పరీక్షల అనంతరం తన ఇద్దరు బిడ్డలను విజయవాడకు పంపించాలనుకున్నానని, ఇప్పుడు అయోమయంలో పడ్డామని సౌదీలో పని చేసే గుంటూరు జిల్లా బాపట్లకు చెందిన మోహమ్మద్ ఆసీఫ్ అన్నారు. మళ్లీ పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారో తెలియట్లేదని కువైత్‌లో పని చేసే వరంగల్ కు చెందిన జె.శ్రీనివాస్ చెప్పారు. మరో వైపు, విమానాలను రద్దు చేయడంతో విద్యార్థులు రాసిన సమాధాన పత్రాలను ఏ విధంగా న్యూ ఢిల్లీలోని సీబీఎస్ఈ కేంద్రానికి పంపించాలనే దానిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు.



### చికెన్‌పై భయాందోళనలు తొలగించండి: వెంకయ్య

న్యూఢిల్లీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చికెన్, కోడి గుడ్లు తినడం వల్ల కరోనా సోకదనే భరోసాను ప్రజల్లో కలిగించాలని.. వారిలో భయాందోళనలను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని ఐసీఎంఆర్ డీజీ ప్రొఫెసర్ బలరాం భార్గవకు ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆదేశించించారు. ఈ వదంతులపై ప్రజలకు సమాధానం ఇవ్వాలని, సరైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలని, అవగాహన కల్పించాలని సూచించారు. అఖిల భారత పౌల్ట్రీ బ్రీడర్స్ సంఘం ప్రతినిధులు ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుణ్ని కలిసి పౌల్ట్రీ పరిశ్రమను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. దీంతో వెంకయ్య వెంటనే ఐసీఎంఆర్ డీజీతో ఫోనులో మాట్లాడి తగిన ఆదేశాలిచ్చారు. అలాగే, పౌల్ట్రీ రంగంపై కరోనా ప్రభావం పడకుండా ప్రత్యేక చొరవ తీసుకోవాలని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్‌కు సూచించారు.

### ప్రముఖ విద్యాసంస్థలు బంద్!

ఐఐటీ కాన్పూర్‌లో మార్చి 29 దాకా అన్ని తరగతులను, పరీక్షలను నిలిపివేస్తున్నట్టు వర్సిటీ వర్గాలు ప్రకటించాయి. అటు ఐఐటీ ఢిల్లీ కూడా శనివారం అర్ధరాత్రికల్లా హాస్టల్‌లో ఉన్న విద్యార్థులందరినీ ఖాళీ చేయాలని ఆదేశించింది. మార్చి 31 దాకా ఐఐటీ ఢిల్లీలో అన్ని కార్యక్రమాలనూ రద్దు చేశారు. ఢిల్లీలోని జేఎన్‌యు, జామియా మిలియా వర్సిటీ కూడా మార్చి 31 దాకా సెలవులిచ్చారు.

### ఆ తొమ్మిది మంది.. కనబడుటలేదు

కరోనా ప్రభావిత దేశాల నుంచి ఇటీవల పంజాబ్‌లోని లూధియానాకు వచ్చిన ఏడుగురు వ్యక్తులు కనిపించకుండా పోయారు. ఆరా తీయగా వారు ఇచ్చిన చిరునామాలు కూడా తప్పుడువని తేలింది. దీంతో వారిని కనుగొనేందుకు అధికారులు నానా తంటాలు పడుతున్నారు. మరోవైపు.. కేరళలోని అలప్పుజ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో ఐసోలేషన్ వార్డు నుంచి ఇద్దరు బ్రిటిషర్లు పారిపోయారు. వారి ఆచూకీ కోసం అధికారులు గాలిస్తున్నారు.

# ప్రపంచం బంద్

- 5,000 దాటిన కరోనా మృతుల సంఖ్య
- ఇటలీలో ఒక్క రోజే 250 మంది మృతి

వాషింగ్టన్, మార్చి 13: కరోనా మహమ్మారి ప్రపంచాన్ని స్తంభింపజేస్తోంది. పాఠశాలలు, కార్యాలయాలు, వ్యాపార వాణిజ్య సంస్థలు మూతపడుతున్నాయి. రోగులతో ఆస్పత్రులు నిండిపోతున్నాయి. మార్కెట్లు నష్టాల్లో కూరుకుపోతున్నాయి. ఎక్కడికక్కడ ప్రయాణాలపై ఆంక్షలు అమలులోకి వచ్చాయి. వివిధ దేశాల్లో ఆటల పోటీలకే కాదు.. అమెరికా అధ్యక్ష ఎన్నిక ప్రచార సభలకూ బ్రేక్ పడింది. వాయిదా పడిన కార్యక్రమాలకు లెక్కలేదు. కరోనా సోకిన లేదా క్వారంటైన్‌లోకి వెళ్లినవారిలో పలువురు రాజకీయ నాయకులూ ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా కరోనా మరణాల సంఖ్య 5,043కి చేరింది. కరోనా కేంద్ర స్థానమైన చైనాలో 3,176, ఇటలీలో 1,266, ఇరాన్‌లో 514మంది మరణించారు. ఇటలీలో శుక్రవారం ఒక్కరోజే 250 మంది కరోనాతో రాలిపోయారు. కేసుల సంఖ్య 2,547 పెరిగి మొత్తం 17,660కు చేరింది. ప్రపంచవ్యాప్తంగా కేసుల సంఖ్య 1,34,300కి పెరిగింది. శుక్రవారం నాడు చైనాలో ఏడుగురు మృతిచెందారు. కెన్యా, ఇథియోపియా, సూడాన్, ఉక్రెయిన్, నార్వే తొలి కేసులు నమోదయ్యాయి. కొవిడ్-19కు ఇప్పుడు యూరప్ కేంద్రంగా మారిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) పేర్కొంది. ఇటలీలో మృతుల సంఖ్య 1,000కి చేరింది. గురువారం ఒక్కరోజే కొత్తగా 15,000 కేసులు నమోదయ్యాయి. యూరప్ ప్రముఖ సాకర్ టీం 'రియల్ మాడ్రిడ్' తన ఆటగాళ్లందర్నీ క్వారంటైన్‌లో ఉంచింది. ఓ ఆటగాడికి కరోనా సోకినట్లు తేలడంతో ఈ నిర్ణయం తీసుకుంది. స్లొవేకియా అంతర్జాతీయ విమానాశ్రయాలను మూసివేసింది. రొమేనియా ప్రధాని లుడొవిక్ ఒర్బన్ క్వారంటైన్‌లోకి వెళ్లారు. కరోనా సోకిన ఒక సెనేటర్ పాల్గొన్న సమావేశంలో ఆయన కూడా పాల్గొనడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్‌లో వైరస్ కేసుల సంఖ్య 10,000, మరణాల సంఖ్య 500 దాటింది. ఈ నేపథ్యంలో తమపై ఆంక్షలు వెంటనే ఎత్తివేయాలని ఇరాన్ సుప్రీం నేత సలహాదారుడైన అలీ అక్బర్ వెలయాటి, ఇరాన్ సీనియర్ ఉపాధ్యక్షుడు, పలువురు మంత్రులు, ఎంపీలు, రివల్యూషనరీ గార్డ్ సభ్యులు, ఆరోగ్య శాఖ అధికారులకు కూడా కరోనా సోకింది. ఈ నెల 28న ప్రేక్షకులు లేకుండా హార్స్ రేస్ నిర్వహిస్తామని దుబాయ్ ప్రకటించింది. ప్రపంచంలోనే అత్యధిక ప్రైజ్ మనీ ఇచ్చే పందెం ఇది. జపాన్‌లో అత్యవసర పరిస్థితిని ప్రకటించే అధికారాన్ని ప్రధాని షింజో అబేకు కట్టబెడుతూ జపాన్ ఒక చట్టాన్ని ఆమోదించింది. సింగపూర్‌లో కొత్తగా 13మందికి కరోనా సోకింది. వారిలో ఓ భారతీయుడు ఉన్నారు. 36ఏళ్ల ఆ వ్యక్తి ఫిబ్రవరి 21 నుంచి మార్చి 1వరకు భారత్‌లో ఉన్నట్లు గుర్తించారు.

### రోమ్‌లో చర్చిల మూసివేత

కరోనా వ్యాప్తిని నియంత్రించే చర్యల్లో భాగంగా రోమ్‌లోని కేథలిక్ చర్చిలను మూసివేశారు. తిరిగి ఏప్రిల్ 3 తర్వాత తెరుచుకోనున్నాయి. జెరూసలేంలో సామూహిక ప్రార్థనల్లో 100 మందిలోపే పాల్గొనాలని క్రైస్తవ, ముస్లిం, యూదు నాయకులు నిర్ణయించారు. ఈజిప్టు మసీదుల్లో 15 నిమిషాలకు మించకుండా ప్రార్థనలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. కరోనా ప్రభావం హాలీవుడ్‌పైనా పడింది. సినిమాల షూటింగ్, విడుదల, ఉత్సవాలు వాయిదాపడ్డాయి. రోజూ వేలాది మంది సందర్శించే డిస్నీలాండ్, దాని థీమ్ పార్కులు శనివారం నుంచి మూతపడనున్నాయి. తాము కోలుకుంటున్నామని హాలీవుడ్ సూపర్‌స్టార్ టామ్ హాంక్స్, ఆయన భార్య రీటా విల్సన్ ట్వీట్ చేశారు. ఏప్రిల్ 1 నుంచి 5వరకు జరగాల్సిన ఇండియా ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ లాస్ ఏంజెలెస్‌ను వాయిదా వేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తనకు కరోనా నిర్ధారణ అయిందని ఆస్ట్రేలియా హోం మంత్రి పీటర్ డటన్ తెలిపారు. కొద్ది రోజుల కిందటే ఆయన అమెరికా నుంచి తిరిగొచ్చారు. అమెరికాలో ఇవాంకా ట్రంప్ సహా పలువురు ప్రముఖులను ఆయన కలిశారు. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో భార్య సోఫీ గ్రెగరీ ట్రూడోకు, న్యూయార్క్‌లో ఉన్న ఫిలిప్పైన్స్ ఒక దౌత్యవేత్త కూడా వైరస్ బారినపడ్డారు.

### అమెరికాలో భారత్ 24 గంటల హెల్ప్‌లైన్లు

అమెరికాలో భారత దౌత్య కార్యాలయం 24గంటల హెల్ప్‌లైన్లను ఏర్పాటు చేసింది. కరోనా ఎఫెక్ట్ ఎవరెస్ట్ పర్వతాన్నీ తాకింది. పర్వతారోహకులను కొన్నాళ్లపాటు అనుమతించబోమని నేపాల్ ప్రకటించింది. ఆన్-అరైవల్ టూరిస్టు వీసాల జారీని నిలిపివేసింది. ఇప్పటికే టిబెట్ నుంచి ఎవరెస్ట్‌ను అధిరోహించడానికి ఉన్న మార్గాన్ని చైనా మూసివేసింది.

# రాష్ట్రమంతా కరోనా కలకలం!

- విజయవాడలో మూడు అనుమానిత కేసులు
- పాలకొల్లులో అనుమానిత వ్యక్తికి చికిత్స
- మక్కా యాత్రకు వెళ్లొచ్చిన కడప మహిళ
- జ్వరం, దగ్గు లక్షణాలతో రిమ్స్‌కు తరలింపు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రవ్యాప్తంగా కరోనా కలవరం కొనసాగుతోంది. శుక్రవారం అనేక చోట్ల కరోనా కేసులు వెలుగుచూశాయనే పుకార్లు కలకలం సృష్టించాయి. విజయవాడలో మరో రెండు కరోనా అనుమానిత కేసులను వైద్యులు గుర్తించినట్టు మీడియాలో వార్తలు వచ్చాయి. అవి నిజం కాదని అధికారులు స్పష్టం చేశారు. ఢిల్లీకి చెందిన వస్త్ర వ్యాపారి దగ్గు, జలుబుతో కృష్ణా జిల్లా నూజివీడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లాడు. అది కరోనా కేసేనంటూ ప్రచారం సాగింది. కానీ.. అతనికి కరోనా లేదని.. దగ్గు, జలుబు, ఆయాసంతోపాటు గుండె, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నాడని, అతిగా మద్యం సేవించడం వల్ల లివర్ సమస్యలున్నాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ నరేంద్రసింగ్ తెలిపారు. మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి పంపామని తెలిపారు. ఇలాంటి కేసే మరొకటి మచిలీపట్నంలోనూ వెలుగులోకి వచ్చింది. కానీ.. అనుమానితుడు డాక్టర్ అన్న కొడుకు కావడంతో అతన్ని ఇంట్లోనే ఉంచి వైద్యం అందిస్తున్నట్లు సమాచారం. విజయవాడ నగరంలోని పడవలరేవు సెంటరుకు చెందిన ఒక వ్యక్తి కరోనా లక్షణాలతో బాధపడుతున్నట్లు ప్రచారం జరగడంతో వైద్యాధికారులు అతన్ని తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. గురువారం రాత్రి ఇండిగో విమానంలో గన్నవరంచేరుకున్న వ్యక్తిలో కరోనా లక్షణాలు కనిపించడం లేదని కృష్ణా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి టి.ఎస్ఆర్.మూర్తి శుక్రవారం తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఒక వ్యక్తికి కరోనా పాజిటివ్ అనే ప్రచారం సాగింది. ఇది నిజం కాదని, గల్ఫ్ నుంచి వచ్చిన వ్యక్తికి వైద్య పరీక్షలు నిర్వహించామని, ఆయనకు కరోనా లక్షణాలు లేవని వైద్యాధికారులు తెలిపారు.

### కడపలో అనుమానిత కేసు

ఇటీవల మక్కాకు వెళ్లొచ్చిన కడప మహిళ (64) తీవ్ర జ్వరం, దగ్గుతో బాధపడుతుండడంతో ఆమెను రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. ఆమె ఈనెల 3న మక్కా నుంచి బెంగళూరు మీదుగా ప్రొద్దుటూరు చేరుకున్నారు. ఈనెల 7న కడపకు వచ్చారు. అప్పటి నుంచి జ్వరం, దగ్గుతో బాధపడుతుండడంతో వైద్య బృందం ఆమెను రిమ్స్‌లోని ఐసోలేషన్ వార్డుకు తరలించింది. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగానే ఉందని రిమ్స్ సూపరింటెండెంట్ గిరిధర్ వెల్లడించారు. ఆమె నమూనాలను తిరుపతిలోని స్విమ్స్‌కు పంపామని చెప్పారు. 48 గంటల్లో ఆ నివేదిక వస్తుందన్నారు. కాగా.. ఉపాధి కోసం గల్ఫ్ దేశాల బాట పట్టినవారు కరోనా వైరస్ దెబ్బకు స్వదేశాలకు పయనమవుతున్నారు. ఫిబ్రవరి 10 నుంచి ఇప్పటి వరకు సుమారు 153 మంది విదేశాల నుంచి పోరుమామిళ్ల మండలానికి వచ్చినట్టు అధికారులు గుర్తించారు. వారిలో ఒక్క కరోనా కేసు కూడా నమోదు కాలేదని వైద్యాధికారి శివక్రిష్ణ చెప్పారు.


కడపలో ఇటలీ నుంచి వచ్చిన యువకుడి వివరాలు తెలుసుకుంటున్న శివక్రిష్ణ బృందం

### శ్వాసకోశ వ్యాధులకు పీహెచ్‌సీల్లో ప్రత్యేక ఓపీ విభాగం

కరోనా కేసులు క్రమేపీ పెరుగుతున్న దృష్ట్యా ప్రభుత్వం అప్రమత్తమైంది. జ్వరం, దగ్గు, జలుబు, జ్వరం, ఆయాసం వంటి లక్షణాలతో వచ్చే వారికోసం ఇకపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక ఓపీ నిర్వహించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి త్వరలో ఆదేశాలు వెలువడే అవకాశం ఉందని గుంటూరు వైద్య కళాశాల మైక్రోబయాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్, కరోనా వైరస్ కంట్రోల్ యూనిట్ స్టేట్ రీసోర్స్‌పర్సన్ డాక్టర్ కొల్లి ప్రశాంతి తెలిపారు. గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం కొవిడ్-19పై పీహెచ్‌సీ వైద్యులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. కరోనా వైరస్ లక్షణాలతో వచ్చే బాధితుల్లో ఒకవేళ నిజంగా ఆ వైరస్ ఉంటే ఇతరులకు వ్యాపించకుండా ఓపీ వేరుగా నిర్వహించాలని ఆమె సూచించారు. విదేశాల నుంచి వచ్చిన 15 రోజుల్లోపు జ్వరం, దగ్గు, జలుబు, ఆయాసం వంటి లక్షణాలతో చికిత్సకు వచ్చే వారిని కొవిడ్-19 బాధితులుగా అనుమానించాలని ఆమె తెలిపారు.

# 'బేర్' లైన్స్!

- విమాన చార్జీలు నేల చూపులు
- కరోనా దెబ్బకు ధరలు తగ్గిస్తున్న సంస్థలు
- విజయవాడ టు హైదరాబాద్ రూ.987
- ఢిల్లీ, ముంబై, చెన్నై రూట్లకూ తగ్గుదల

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

కరోనా దెబ్బకు ఎయిర్‌లైన్స్ నేల చూపులు చూస్తున్నాయి. పక్షం రోజులుగా కరోనా భయం వణికిస్తుండడంతో విమానయాన సంస్థలు కల్లోలానికి గురవుతున్నాయి. ముందస్తుగా బుక్ చేసుకున్న వారు తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకుంటున్నారు. దీంతో రోజువారీ ఆక్యుపెన్సీ తగ్గిపోవడంతోపాటు రానున్న రోజుల్లోనూ ప్రయాణికుల సంఖ్య భారీగా తగ్గే అవకాశం ఉండడంతో విమాన సంస్థలు కలవరపాటుకుని గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో మనుగడ కోసం చార్జీలను బాగా తగ్గించివేస్తున్నాయి. ఎంతలా అంటే ఆర్టీసీ బస్సుల చార్జీ కంటే విమానాల చార్జీలే తక్కువ అనేంతగా..!

విజయవాడ విమానాశ్రయం నుంచి దేశీయంగా పలు నగరాలకు తిరిగే విమాన సర్వీసుల ధరలు ఈ నెల చివరి వారం నుంచి భారీగా తగ్గబోతున్నాయి. స్పైస్‌జెట్, ఇండిగో వంటి సంస్థలు మార్చి 28 నుంచి జూన్ మొదటి వారం వరకు రూ.1000 నుంచి రూ.2000 లోపు చార్జీలు తగ్గించాయి. ఎయిరిండియా సైతం ఇదే బాటలో ఉంది. ప్రాంతీయంగా 'ఉడాన్' పథకంలో విమానాలను నడుపుతున్న 'ట్రూ జెట్' కూడా విజయవాడ నుంచి నడిపే సర్వీసుల చార్జీని భారీగా తగ్గించింది. ఈ మేరకు తమ బుకింగ్ వెబ్‌పోర్టల్స్‌లో ప్రకటించాయి. స్పైస్‌జెట్ మరో అడుగు ముందుకు వేసి 'ఫ్రీ సీట్ - ఫ్రీ మీల్' పేరుతో బంపర్ ఆఫర్ ప్రకటించింది. కేవలం టాక్స్ తప్పితే అదనంగా ఎలాంటి చార్జీ వసూలు చేయడం లేదన్నది దీని సారాంశం. విమానయాన సంస్థల నుంచి ఇలాంటి భారీ ఆఫర్లు గతంలో ఎప్పుడూ వెలువడలేదు. కరోనా కారణంగా మరో ఆరు నెలల వరకు ఈ ప్రభావం ఉండవచ్చని విమానయాన సంస్థల ప్రతినిధులు భావిస్తున్నారు. ఈ పరిణామం పట్ల ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఆందోళన చెందుతోంది. దీన్ని ఎయిర్‌లైన్స్ క్రాష్‌గా అభివర్ణిస్తోంది. కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వశాఖ దేశవ్యాప్తంగా ఎంతమంది ప్రయాణికులు తగ్గిపోయారన్న దానిపై విమానాశ్రయాల నుంచి నివేదిక కోరింది. 'ఆంధ్రజ్యోతి' సేకరించిన సమాచారం మేరకు విజయవాడ విమానాశ్రయం నుంచి మార్చి 10 వరకు 70 రోజులకు గాను ప్రయాణికుల సంఖ్య 6 శాతం తగ్గిపోయింది. అలాగే ఫ్లైట్ మూవ్‌మెంట్స్ కూడా 8 శాతం తగ్గిపోయాయి.

కరోనా ప్రభావం కారణంగా ప్రయాణికుల సంఖ్య తగ్గిపోవటంతో విమానయాన సంస్థలు చార్జీలు భారీగా తగ్గించాయి. విజయవాడ విమానాశ్రయం నుంచి దేశీయంగా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ఢిల్లీ, ముంబై, విశాఖ, తిరుపతి, కడప వంటి ప్రాంతాలకు విమాన సర్వీసులు నడుస్తున్నాయి. మార్చి 28 నుంచి మే రెండో వారం వరకు విజయవాడ-హైదరాబాద్‌కు రూ.987 చార్జీగా ఇండిగో, స్పైస్‌జెట్ ప్రకటించాయి. ప్రస్తుతం హైదరాబాద్‌కు ఎకానమీ ఫేర్ రూ.1740గా ఉంది. సీజన్‌లో అయితే రూ.3 వేలు నుంచి రూ.5 వేలు ధర పలికిన సందర్భాలు కూడా ఉన్నాయి. మార్చి 28 నుంచి రూ. 987కే హైదరాబాద్‌కు ఈ రెండు సంస్థలు చార్జి చేయబోతున్నాయి. అంటే విజయవాడ నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ స్లీపర్ బస్సు చార్జీతో సమానమైన ధరకే విమానంలో ప్రయాణించవచ్చన్న మాట! విజయవాడ నుంచి మిగిలిన రూట్లలో చూస్తే ప్రధానంగా ఢిల్లీకి మార్చి 28 నుంచి నెల రోజుల పాటు ఎకానామీ క్లాస్ ధర రూ.3,807 మాత్రమే! ఢిల్లీకి సగటు ధర రూ. 6500-7500 మధ్య ఉంటుంది. ముంబైకి స్పైస్‌జెట్ విమానంలో చార్జీ ప్రస్తుతం రూ. 5750 ఉండగా, ఏప్రిల్ 11 నుంచి రూ. 4954గా ఉంది. ఇదే స్పైస్‌జెట్ సంస్థ విజయవాడ నుంచి బెంగళూరుకు సేవర్ క్లాస్‌లో రూ. 5781 వసూలు చేస్తోంది. మార్చి 27న దీని ధర రూ.2,420 కాగా ఆ మరుసటి రోజు నుంచి జూలై వరకు రూ.1997గా నిర్ణయించింది. విజయవాడ-చెన్నైకు ప్రస్తుతం స్పైస్‌జెట్ రూ.7934 వసూలు చేస్తోంది. ఏప్రిల్‌లో రూ.3,852 చార్జి చేయనుంది. ట్రూజెట్ సంస్థ కూడా చార్జీలను తగ్గించింది. ప్రస్తుతం ఈ సంస్థ హైదరాబాద్‌కు రూ.1910 వసూలు చేస్తోంది. ఏప్రిల్ 15 నుంచి రూ.1001గా నిర్ణయించింది.

# మాస్కులు, గ్లౌజులు ఇవ్వండి!

- ఎన్నికల సిబ్బందికి కరోనా భయం

విజయవాడ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న సిబ్బంది కరోనా భయంతో తమకు మాస్కులు, గ్లౌజులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల విధుల శిక్షణ సందర్భంగా వీరు తమ భయాలు, ఆందోళనలను ఏకరువు పెడుతుండటంతో రిటర్నింగ్ అధికారులు విషయాన్ని జిల్లా ఎన్నికల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చినట్టు తెలుస్తోంది. కృష్ణాజిల్లాలో 2మున్సిపల్ కార్పొరేషన్లు, 3మున్సిపాలిటీలు, 3నగర పంచాయతీలు, 961 గ్రామ పంచాయతీలకు కేవలం పక్షం వ్యవధిలో ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో 33వేల మంది ఉద్యోగులు విధులు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళ్లడం, వేలాది మంది ఓట్లు వేయటానికి రానుండటంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. అయితే మాస్కులు, గ్లౌజులు కొనుగోలు చేయడం జిల్లా ఎన్నికల యంత్రాంగం పరిధిలో ఉండదు. విషయాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నివేదించి, వారి సూచనల మేరకే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

# 1897 చట్టంతో కట్టడి!

- రాష్ట్రంలో మినీ హెల్త్ ఎమర్జెన్సీ
- కరోనా నియంత్రణకు చట్టం అమలు
- వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ

అమరావతి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కోరలు చాస్తున్న కరోనాను కట్టడి చేసేందుకు రాష్ట్రప్రభుత్వం మినీ ఎమెర్జెన్సీని ప్రకటించింది. దేశవ్యాప్తంగా కొవిడ్-19 పాజిటివ్ కేసుల సంఖ్య పెరగడం, ఏపీలో తొలి కేసు నమోదు కావడంతో అప్రమత్తమైన ప్రభుత్వం కరోనా నియంత్రణకు కేంద్రం సూచనల మేరకు బ్రిటిష్ కాలం నాటి 1897 చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఈ చట్టానికి 'ఆంధ్రప్రదేశ్ అంటువ్యాధి కొవిడ్-19 రెగ్యులేషన్ 2020'గా నామకరణం చేస్తూ శుక్రవారం నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. దీని ప్రకారం శుక్రవారం నుంచే ఈ చట్టం రాష్ట్ర మొత్తం అమలులోకి వచ్చింది. ఇది ఏడాదిపాటు అమల్లో ఉంటుంది. ఈ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు రాష్ట్రస్థాయిలో ఆరోగ్యశాఖ డైరెక్టర్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన్ పరిషత్ కమిషనర్‌కు మరిన్ని అధికారాలు అప్పగించింది. జిల్లాస్థాయిలో కలెక్టర్, వైద్యాధికారి, బోధనాసుపత్రి సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్లకు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

### వైద్య సంస్థల విధులు...

- రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య సంస్థలు పూర్తిగా కరోనా నియంత్రణ కోసం పని చేయాలి.
- అవసరమైన చోట ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేసుకుని అనుమానితులను చికిత్స అందించాలి.
- విదేశాల నుంచి వచ్చిన వ్యక్తులకు దగ్గు, జలుబు, శ్వాససంబంధింత వ్యాధులు లేకపోయినా 14 రోజుల పాటు ఇంటిలోనే ఐసోలేషన్‌లో ఉండాలి.
- అనుమానుతులను 14 రోజులు ఇంటిలోనే ఐసోలేషన్‌లో ఉంచాలి. వైద్య సంస్థలు కానీ, వ్యక్తులు కానీ, అధికారులు కానీ ఆరోగ్యశాఖ అనుమతి లేకుండా మీడియాకు సమాచారం ఇవ్వడానికి వీల్లేదు. ఒకవేళ అందిస్తే దీన్ని శిక్షార్హమైన నేరంగా పరిగణిస్తారు.

### చట్టం అధికారాలివే..

- కరోనా లక్షణాలున్న వారిని సెక్షన్-6 ప్రకారం సంబంధింత అధికారాలున్న వారు మాత్రమే చేర్చుకోవాలి.
- అనుమానితులు ఎవరైనా చికిత్సకు నిరాకరిస్తే అధికారులు బలవంతంగా వారిని ఆస్పత్రికి తరలించొచ్చు.
- ఒక ప్రదేశంలో కరోనా కేసు నమోదైతే ఆ ప్రాంతంపై జిల్లా కలెక్టర్‌కు కొన్ని నిర్ణయాలు తీసుకునే అధికారం ఉంది. ప్రవేశాల నిషేధం, పాఠశాలలు, సినిమా హాళ్లు, వాణిజ్య సంస్థలు, కార్యాలయాలు, బహిరంగ సమావేశాలను నియంత్రించవచ్చు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఐపీసీ సెక్షన్ 188 ప్రకారం శిక్షార్హులు.


TRUE VALUE
MARUTI SUZUKI
DON'T SWEAT THIS SUMMER!
Don't face the scorching heat this summer. Get yourself a quality pre-owned car from True Value and make your drive comfortable.



Get ₹ 5,000 Worth of Accessories Free*
Attractive Finance Scheme*
*T&C apply.
Free Evaluation to your Old Car at all our Arena & NEXA outlets
A wide range of diesel cars to choose from.
SWIFT 235 - UNITS ₹ 2 50 000 onwards
DZIRE 175 - UNITS ₹ 3 00 000 onwards
ERTIGA 25 - UNITS ₹ 5 00 000 onwards
Ciaz 20 - UNITS ₹ 5 00 000 onwards
Download the App here.
For enquiry, SMS TRUE to 53636 | Call at 1800 102 1800 | Visit www.marutisuzukitruevalue.com
TRUE VALUE CERTIFIED CARS · HASSLE-FREE DOCUMENTATION · VERIFIED CAR HISTORY · UP TO 1 YEAR WARRANTY & 3 FREE SERVICES
TRUE VALUE CERTIFIED
Vijayawada: Varun Motors: 8142344744 | Mithra Auto Agency: 8886063544 Enikepadu: Santosh Auto: 9209094999 | Varun Motors: 9866686667 Kanuru: 7799787967 Eluru: Novelty Reddy & Reddy Motors: 9951902899 Bhimavaram: Novelty Reddy & Reddy Motors: 9948828555 Guntur: Jayalakshmi Automotives: 9618599199 Nellore: Bhargavi Automobiles: 9248788999 Ongole: Jayalakshmi Automotives: 9949033433 Andhra Prabha Colony: Mithra Auto Agency: 8886063463.

# భారత్-దక్షిణాఫ్రికా వన్డే సిరీస్ రద్దు





లఖ్‌నవ్ ఎయిర్‌పోర్ట్‌లో రాహుల్, కోహ్లీ

సఫారీలతో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్ కూడా అనూహ్యంగా రద్దయింది. తొలి మ్యాచ్ ధర్మశాలలో జరగాల్సి ఉన్నా వర్షంతో వీలు కాలేదు. ఇక లఖ్‌నవ్, కోల్‌కతాలో మిగిలిన వన్డేలను ప్రేక్షకులు లేకుండా నిర్వహిస్తామని బీసీసీఐ ఇదివరకే ప్రకటించింది. కానీ ఐపీఎల్‌పై నిర్ణయం తీసుకొన్న కొన్ని గంటల్లోనే ఈ సిరీస్‌ను కూడా ప్రస్తుతానికి రద్దు చేస్తున్నామని బోర్డు తెలిపింది. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది ఇరు బోర్డులు చర్చించుకున్నాక తెలుస్తుందని కార్యదర్శి జై షా అన్నారు. నిజానికి ఆదివారం జరగాల్సిన రెండో వన్డే కోసం ఇరు జట్ల ఆటగాళ్లు ఇప్పటికే లఖ్‌నవ్ చేరుకున్నారు. శుక్రవారం ప్రాక్టీస్ సెషన్ కోసం బోర్డు షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. అంతలోనే ఈ నిర్ణయం తీసుకోవడంతో అటు ఆటగాళ్లు కూడా ఆశ్చర్యపోయారు. ఇక డికాక్ సేన శుక్రవారం సాయంత్రమే ఢిల్లీకి చేరుకుని అందుబాటులో ఉన్న తొలి విమానంలోనే స్వదేశానికి వెళ్లే ప్రయత్నం చేసింది. 'ఇప్పటికే ఐపీఎల్‌ను వాయిదా వేశాం. ఇలాంటి పరిస్థితిలో ఈ సిరీస్‌ను నిర్వహించడం సముచితం కాదు. దేశం చాలా విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటోంది' అని బోర్డు అధికారి ఒకరు తెలిపారు.



# ఏప్రిల్ 15 వరకు ఐపీఎల్ వాయిదా

## ప్రకటించిన బీసీసీఐ

**ముంబై:** భారత్‌లో క్రికెట్‌కు కరోనా సెగ గట్టిగానే తగులుతోంది. శుక్రవారం రెండు సంచలనాత్మక నిర్ణయాలు వెలువడ్డాయి. ధనాధన్ క్రికెట్‌కు మారుపేరుగా నిలిచే ఐపీఎల్-13వ సీజన్‌ను ఇప్పట్లో నిర్వహించరాదని బీసీసీఐ నిర్ణయించింది. ఈనెల 29 నుంచి జరగాల్సిన ఈ లీగ్‌ను దేశంలో కొవిడ్-19 ప్రమాదకరంగా మారడంతో ఏప్రిల్ 15 వరకు సస్పెండ్ చేస్తున్నట్టు తెలిపింది. అయితే పోటీలు మున్ముందు కూడా జరుగుతాయా లేదా అనే విషయంలో స్పష్టత లేదు. ఒకవేళ ఏప్రిల్ మధ్య నెలలో పరిస్థితులు అనుకూలంగా మారే అవకాశం ఉండొచ్చని బోర్డు అభిప్రాయపడుతోంది. అందుకే ఏప్రిల్ 16 నుంచి జూన్ 5 వరకు జరపాలని భావిస్తోంది. అప్పుడైనా ప్రేక్షకులకు అనుమతి ఉండడం సందేహమే..

**ఖాళీ స్టేడియాల్లో జరుపుదామని..:** ప్రజలు పెద్ద ఎత్తున గుమికూడకుండా చూడాలన్న కేంద్రం సూచన మేరకు ప్రేక్షకులకు అనుమతి లేకుండా లీగ్‌ను ఖాళీ స్టేడియాల్లో జరుపుతామని గురువారమే బోర్డు తెలిపింది. అంతలోనే ఈ నిర్ణయం తీసుకున్నారు. వాస్తవానికి ప్రేక్షకులు లేకున్నా విదేశీ ఆటగాళ్లను ప్రత్యేక అనుమతితో భారత్‌కు రప్పించాలని ఆయా ఫ్రాంచైజీలు బోర్డును కోరాయి. కానీ పర్యాటక వీసాలను కూడా కేంద్రం శుక్రవారం నుంచే రద్దు చేయడంతో మరో దారి లేకపోయింది. ఇక విదేశీ ఆటగాళ్లు ఏప్రిల్ 15 వరకు భారత్‌లోకి అడుగుపెట్టే వీలు లేదు.

ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ ఉన్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) కోసం అభిమానులు మరికొంత కాలం వేచి చూడాల్సిందే. కరోనా వైరస్ ధాటికి అభిమానులెవరినీ స్టేడియాల్లోకి అనుమతించకూడదని నిర్ణయం తీసుకున్న మరుసటి రోజే బీసీసీఐ షాక్ ఇచ్చింది. ఈ లీగ్‌ను షెడ్యూల్ ప్రకారం జరపకుండా వచ్చే నెల 15 వరకు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది. మరి.. ఆతర్వాత పరిస్థితిపై స్పష్టత లేదు. ఇక ఇప్పటికే దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌కు కూడా ప్రస్తుతానికి మంగళం పాడేశారు.. మొత్తంగా దేశంలో దాదాపుగా క్రీడా ఈవెంట్లన్నీ ఒక్కొక్కటిగా వాయిదా పడుతూనో, లేదా రద్దవుతూనో వస్తున్నాయి.

ఎందుకంటే కొవిడ్-19ను అరికట్టే భాగంలో ఉద్యోగ, దౌత్య మినహా అన్ని విభాగాల వీసాలను భారత ప్రభుత్వం రద్దు చేసింది. క్రికెటర్లంతా బిజినెస్ వీసా కిందికి వస్తారు కాబట్టి వారికి 15 తర్వాతే అనుమతి ఉంటుంది. విదేశీ స్టార్ ఆటగాళ్లు లేకపోతే ఐపీఎల్ కళ కోల్పోవడం ఖాయం. అందుకే బోర్డు అధ్యక్షుడు గంగూలీ, కార్యదర్శి జై షాలతో పాటు ఐపీఎల్ అధికారులు... ఈ వాయిదా నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని అన్ని ఫ్రాంచైజీలకు తెలిపారు. అలాగే తాజా పరిస్థితిని అంచనా వేసేందుకు శనివారం జరిగే ఐపీఎల్ పాలకమండలి సమావేశానికి ముందే జట్ల యజమానులతో భేటీ కానున్నారు. 'ఆటగాళ్లు, జట్ల యజమానులతో పాటు అభిమానుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, వారికి సురక్షితమైన క్రికెట్ వినోదం అందించాలనే ఈ నిర్ణయం తీసుకున్నాం. ఐపీఎల్-13వ సీజన్‌ను ఈనెల 29 నుంచి ఏప్రిల్ 15 వరకు సస్పెండ్ చేస్తున్నాం. ఈ వైరస్‌ను ఎదుర్కొనేందుకు యువజన, క్రీడల మంత్రిత్వ శాఖతో పాటు ఆరోగ్య శాఖతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళతాం' అని బీసీసీఐ ప్రకటించింది. మరోవైపు ఈ వాయిదాతో కొవిడ్-19పై ఓ అంచనాకు వచ్చే సమయం దొరుకుతుందని బోర్డు భావిస్తోంది. అప్పటికైనా తగ్గుముఖం పడుతుందా.. లేక చేయిదాటుతుందో తేలుతుందని.. ఆ తర్వాతే లీగ్‌పై నిర్ణయానికి రావచ్చని బోర్డు వర్గాల సమాచారం.

**ఇప్పటికే రాష్ట్రాలు దూరం:** ఇటీవలి వరకు బోర్డు అధ్యక్షుడు గంగూలీ లీగ్ నిర్వహణపై ధీమా వ్యక్తం చేస్తూ వచ్చాడు. కానీ ఆయా రాష్ట్రాలు మాత్రం మ్యాచ్‌ల నిర్వహణపై చేతులెత్తేశాయి. మహారాష్ట్ర, కర్ణాటక ఇప్పటికే స్పష్టతనిచ్చాయి. తాజాగా ఢిల్లీ ప్రభుత్వం కూడా నెల రోజులపాటు తమ దగ్గర జరిగే అన్ని క్రీడా ఈవెంట్లను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఫిరోజ్‌షా కోట్లా హోం గ్రౌండ్ కావడంతో బీసీసీఐకి మరో దారి లేకపోయింది.

### ఏప్రిల్ 16 నుంచి జరిగితే..

షెడ్యూల్ ప్రకారం ఐపీఎల్ ఈనెల 29 నుంచి మే 24 వరకు 56 రోజుల పాటు జరగాల్సి ఉంది. ఒకవేళ ఏప్రిల్ 16 నుంచి లీగ్‌ను జరిపితే అంతర్జాతీయ భవిష్య టూర్ ప్రోగ్రాంను బట్టి 40 రోజుల పాటే సమయముంటుంది. దీంతో లీగ్‌ను త్వరగా ముగించాలంటే డబుల్ హెడర్ (ఒకే రోజు రెండు మ్యాచ్‌లు)లను ఎక్కువ జరపాల్సి ఉంటుంది. అప్పట్లో కేవలం ఐదు డబుల్ హెడర్ మ్యాచ్‌లే ఉంటాయని ఐపీఎల్ ప్రకటించింది. కానీ పరిస్థితి ఇప్పుడు పూర్తి విరుద్ధంగా మారిపోయింది. అన్నింటికన్నా ముందు రాష్ట్ర ప్రభుత్వాలు మ్యాచ్‌లకు అనుమతినివ్వాల్సి ఉంటుంది. ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక ఇప్పటికే చేతులెత్తేసినా ఈ మూడు ఫ్రాంచైజీలకు లఖ్‌నవ్, రాజ్‌కోట్, ఇండోర్, రాయ్‌పూర్, విశాఖ వేదికలు సిద్ధంగా ఉన్నాయని బోర్డు తెలిపింది. మరోవైపు ప్రేక్షకులను అనుమతించకపోతే జట్లు స్పాన్సర్‌షిప్‌తో పాటు గేట్ మనీ కూడా భారీగానే కోల్పోవాల్సి ఉంటుంది. ఈ నష్టానికి తోడు ఆతిథ్య రాష్ట్ర సంఘాలకు ఫ్రాంచైజీలు రూ. 50 లక్షలు ఇవ్వాల్సి రావడంతో మరింత దెబ్బ పడినట్టే.

### 'ప్రజల భద్రత కోసమే'..



'ప్రస్తుతానికైతే ఐపీఎల్ వాయిదాకు కట్టుబడి ఉన్నాం. ఎందుకంటే ప్రజల భద్రతకు తొలి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. అందుకే లీగ్‌పై ఈ నిర్ణయం తీసుకున్నాం. ఆ తర్వాతే మ్యాచ్‌లను ఎలా నిర్వహించాలనేది చూద్దాం. ఇప్పుడే ఏమీ చెప్పలేం. అయితే షెడ్యూల్ ప్రకారం ఆడకపోవడమైతే ఫ్రాంచైజీలకు ఇష్టం లేదు. కానీ మరో అవకాశం లేకపోయింది' **- బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ**

## ఫిడే గ్రాండ్ ప్రీ చెస్‌లో హారికకు ఏడోస్థానం

**లుసానే:** ఫిడే మహిళల గ్రాండ్ ప్రీ చెస్‌లో తెలుగమ్మాయి ద్రోణవల్లి హారిక నిరాశపరిచింది. శుక్రవారం జరిగిన ఆఖరిదైన పదకొండో రౌండ్లో ఉక్రెయిన్ గ్రాండ్‌మాస్టర్ మరియా ముజిచెక్‌తో గేమ్‌ను హారిక డ్రా చేసుకొంది. దీంతో ఓవరాల్‌గా 5.5 పాయింట్లతో హారిక ఏడోస్థానంతో టోర్నీని ముగించింది. జార్జియా గ్రాండ్‌మాస్టర్ నానా జాగ్నిదె చాంపియన్‌గా నిలిచింది. అలెగ్జాండ్రా గోర్యాచ్కినాతో కలిసి నానా ఏడు పాయింట్లతో సంయుక్తంగా టాప్‌లో నిలిచింది. దీంతో ఇద్దరి మధ్య జరిగిన టైబ్రేక్‌లో మెరుగైన స్కోరు చేసిన నానా టోర్నీ విజేత ట్రోఫీని అందుకుంది.

## ఆసీస్ ఘన విజయం





కివీస్‌తో తొలి వన్డే

**సిడ్నీ:** వరుసగా ఐదు వన్డేల పరాజయం తర్వాత ఆస్ట్రేలియా కోలుకుంది. న్యూజిలాండ్‌తో శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో ఆసీస్ 71 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఓపెనర్లు వార్నర్ (67), ఫించ్ (60), లబుషేన్ (56) రాణించారు. ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో ఆసీస్ 0-3తో వైట్‌వాష్ అయింది. అంతకుముందు భారత్‌తో జరిగిన రెండు వన్డేల్లోనూ ఓటమి పాలైంది. కరోనా భయంతో ఖాళీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య జట్టు 50 ఓవర్లలో 7 వికెట్లకు 258 రన్స్ చేసింది. సోధికి 3 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత కివీస్ 41 ఓవర్లలో 187 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ గప్టిల్ (40), లాథమ్ (38) మాత్రమే రాణించారు. కమిన్స్, మార్ష్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి.



**రిచర్డ్‌సన్‌కు నెగెటివ్:** ఆసీస్ పేసర్ కేన్ రిచర్డ్‌సన్ కొవిడ్-19 టెస్టులో నెగెటివ్ రావడంతో జట్టు ఊపిరిపీల్చుకుంది. గొంతు నొప్పితో బాధపడిన కేన్‌ను ముందు జాగ్రత్త చర్యగా మ్యాచ్‌కు దూరంగా ఉంచి గురువారం టెస్టులకు పంపారు. నివేదికలో నెగెటివ్ ఫలితం రావడంతో హోటల్ గది నుంచి జట్టుతో కలిసేందుకు సిడ్నీ మైదానానికి వెళ్లాడు.

### షేక్‌హ్యాండ్ ఇచ్చి షాకై..

కరోనా వైరస్ ఉధృతికి షేక్‌హ్యాండ్ ఇచ్చుకోవడానికి క్రికెటర్లు భయపడుతున్నారు. శుక్రవారం టాస్ వేశాక ఆసీస్-కివీస్ జట్ల కెప్టెన్లు ఫించ్, విలియమ్సన్ కూడా అలవాటులో పొరపాటుగా షేక్‌హ్యాండ్ ఇచ్చుకుని ఒక్కసారిగా షాక్ తిన్నట్టు ప్రవర్తించారు. కేన్ తన అరచేతిని చూసుకోగా ఫించ్ అయ్యో.. అన్నట్టుగా నోరెళ్లబెట్టాడు. ఆ తర్వాత ఇరువురు చిరునవ్వుతో తమ మోచేతులతో చిన్నగా తాకి పెవిలియన్‌కు వెళ్లారు.

## సింధుకు నిరాశ

- ఆల్ ఇంగ్లండ్ నుంచి అవుట్
- క్వార్టర్స్‌లో ఒకుహర చేతిలో ఓటమి



**బర్మింగ్‌హామ్:** ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్ల పేలవ ఫామ్ కొనసాగుతోంది. ఇప్పటికే కిడాంబి శ్రీకాంత్, సైనా నెహ్వాల్ ఇంటిబాట పట్టగా.. బరిలో మిగిలిన స్టార్ షట్లర్ పీవీ సింధు కూడా నిరాశపరిచింది. సింగిల్స్ క్వార్టర్స్‌లో జపాన్ ఏస్ షట్లర్ నొజొమి ఒకుహర చేతిలో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. శుక్రవారం జరిగిన పోరులో ఒకుహర 12-21, 21-15, 21-13తో సింధుపై గెలిచి గతేడాది వరల్డ్ చాంపియన్‌షిప్ ఫైనల్లో ఓటమికి ప్రతీకారం తీర్చుకుంది. సింధు ఓటమితో ఈ టోర్నీలో భారత్ పోరు పూర్తిగా ముగిసినట్టయింది.



## సౌరాష్ట్ర కొత్త చరిత్ర

### తొలిసారి రంజీ ట్రోఫీ కైవసం

**రాజ్‌కోట్:** సౌరాష్ట్ర జట్టు ఎట్టకేలకు రంజీట్రోఫీ సాధించింది. బెంగాల్‌తో జరిగిన ఫైనల్లో మొదటి ఇన్నింగ్స్ ఆధారంగా టైటిల్ పట్టేసి చరిత్ర సృష్టించింది. ఆ జట్టు సారథి జయదేవ్ ఉనాద్కట్ (2/96) మరోసారి మెరిశాడు. ఓవర్‌నైట్ స్కోరు 354/6తో శుక్రవారం ఆఖరి రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బెంగాల్.. 381 పరుగుల వద్ద ఆలౌటైంది. ఉదయం ఆరో ఓవర్లోనే మజుందార్ (63)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్న ఉనాద్కట్.. రెండో బంతికి ఆకాశ్‌దీప్‌ను రనౌట్ చేశాడు. ఆ తర్వాత బెంగాల్ తొలి ఇన్నింగ్స్ ముగిసేందుకు ఎంతోసేపు పట్టలేదు. సౌరాష్ట్ర మొదటి ఇన్నింగ్స్‌లో 425 రన్స్ చేయడంతో ఆ జట్టుకు కీలకమైన 44 పరుగుల ఆధిక్యం లభించింది. దాంతో టైటిల్ ఖాయమైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో సౌరాష్ట్ర ఆట నిలిపివేసే సరికి 4 వికెట్లకు 105 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన సౌరాష్ట్ర బ్యాట్స్‌మన్ అర్పిత్ వసవాడ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

## ఇంగ్లండ్ జట్టు ఇంటిదారి..

లంక పర్యటన వాయిదా

**లండన్:** శ్రీలంకలో జరుగుతున్న ఇంగ్లండ్ క్రికెట్ జట్టు పర్యటన వాయిదా పడింది. ఈ మేరకు ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు శుక్రవారం నిర్ణయం తీసుకుంది. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భాగంగా రెండు టెస్టులు ఆడేందుకు ఇంగ్లండ్ జట్టు శ్రీలంక వెళ్లింది.

**పీఎస్‌ఎల్‌నుంచి విదేశీ క్రికెటర్లు..**

**కరాచీ:** పాకిస్థాన్ ప్రీమియర్ లీగ్ (పీఎస్‌ఎల్)లో ఆడుతున్న 9 మంది విదేశీ క్రికెటర్లు స్వస్థలాలకు వెళ్లిపోయారు. వీరిలో ఇంగ్లండ్ ఆటగాళ్లు హేల్స్, జాసన్ రాయ్, విల్స్, డాసన్, లివింగ్‌స్టోన్, గ్రెగరీ, జేమ్స్ విన్స్, విండీస్‌కు చెందిన బ్రాత్‌వైట్, సౌతాఫ్రికా క్రికెటర్ రీలీ రూసో, జేమ్స్ ఫోస్టర్ (కోచ్) ఉన్నారు.

**ఇంగ్లిష్ ప్రీమియర్ లీగ్..**

ఇంగ్లిష్ ప్రీమియర్ ఫుట్‌బాల్ లీగ్‌లోని అన్ని మ్యాచ్‌లనూ ఏప్రిల్ 4 వరకు సస్పెండ్ చేశారు. అప్పటి పరిస్థితులను బట్టి లీగ్‌ను కొనసాగించేదీ లేనిదీ నిర్ణయిస్తామని నిర్వాహకులు ప్రకటించారు.

**ఒలింపిక్స్‌పై డబ్ల్యూహెచ్‌ఓ సలహాలు..**

**బెర్లిన్:** ఒలింపిక్స్ వాయిదా లేదా రద్దు విషయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) సలహాలు పాటిస్తామని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) తెలిపింది. ప్రస్తుతానికైతే ఒలింపిక్స్ నిర్వహించాలనే భావిస్తున్నామని ఐఓసీ చీఫ్ థామస్ బాచ్ చెప్పారు.

**టోక్యో సన్నాహాలు భేష్: ట్రంప్**

**వాషింగ్టన్:** టోక్యో ఒలింపిక్స్‌కు సన్నాహాలు అద్భుతంగా ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసించారు. కరోనా వైరస్ కారణంగా విశ్వక్రీడలను కనీసం ఏడాది వాయిదా వేయాలని సూచించిన 24 గంటల్లోనే సన్నాహాలు బాగున్నాయని ట్రంప్ కీర్తించడం గమనార్హం. జపాన్ ప్రధాని షింజో అబేతో టెలిఫోన్ సంభాషణ అనంతరం ట్రంప్ ఆ ప్రకటన చేశారు.







Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.